RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ | 09 మే 2026 శనివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:287

## శ్రీ మహాలక్ష్మీ వెంకటేశ్వరస్వామి (కొడంగల్ బాలాజీ)

## ఆలయ పునర్నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి భూమి పూజ

### కలిసికట్టుగా పనిచేస్తే కొడంగల్ శాసనసభ నియోజకవర్గాన్ని రాష్ట్రానికే కాకుండా దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దుకోగలుగుతాం రేవంత్ రెడ్డి





అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా గుంపులు, గ్రూపులు పక్కన పెట్టి అందరం కలిసికట్టుగా పనిచేస్తే కొడంగల్ శాసనసభ నియోజకవర్గాన్ని రాష్ట్రానికే కాకుండా దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దుకోగలుగుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. నియోజకవర్గాన్ని గొప్పగా అభివృద్ధి చేసుకోవాలన్న సంకల్పంతో తలపెట్టిన పనులను 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేసుకుందామని పిలుపునిచ్చారు.

కొడంగల్ లో శ్రీ మహాలక్ష్మీ వెంకటేశ్వరస్వామి (కొడంగల్ బాలాజీ) ఆలయ పునర్నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన యాగంలో పాల్గొన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ , వాకిటి శ్రీహరి , జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా కొడంగల్ బాలాజీ ఆలయ పునర్నిర్మాణంతో పాటు కొడంగల్‌లో 430 పడకల ఆసుపత్రి నిర్మాణం, దౌల్తాబాద్ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం, కోస్గి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయాల అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి ఇక్కడి నుంచి శంకుస్థాపన చేశారు.

అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు. దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోక నిర్లక్ష్యానికి గురైన పరిస్థితులను వివరిస్తూ, ప్రస్తుతం చేపట్టిన పనుల గురించి సమగ్రంగా వివరించారు.

దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన ఈ ప్రాంతంలో మెడికల్, ఇంజనీరింగ్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటీఐలు, సైనిక్ స్కూల్స్.. 225 ఎకరాల్లో ఒక ఎడ్యుకేషనల్ హబ్ తీర్చిదిద్దబోతున్నామని చెప్పారు. అతివేగంగా పనులు జరుగుతున్నాయని చెబుతూ ఏడాది లోపు పనులన్నీ పూర్తి కావాలన్నారు.

ఆనాడు చదువుకోవడానికి ఈ ప్రాంత వాసులు రాష్ట్రం నలుమూలల వెళ్లాల్సిన పరిస్థితి నుంచి ఈనాడు రాష్ట్రం నలుమూలల నుండి మంచి చదువుల కోసం కొడంగల్‌కు రావలసిన విధంగా పనులు చేపట్టామని తెలిపారు.

“ఇప్పుడు ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకునే అవకాశం వచ్చింది. మక్తల్ -- నారాయణపేట -- కొడంగల్‌కు నీళ్లు, రైల్వే లైన్, సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు అవకాశం వచ్చింది. దేశంలో ఉండే గొప్ప గొప్ప పరిశ్రమలు రాబోయే రెండేళ్లలో ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

మిగతా 2లో





**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి**హైదరాబాద్:- రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ని తెలంగాణ రాష్ట్ర డిజిపీ సి.వి. ఆనంద్ శుక్రవారం సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. మంత్రికూడా శాలువా కప్పి సి.వి. ఆనంద్ ని అభినందించారు. పోలీసింగ్‌లో రాష్ట్రం ఉన్నత శిఖరాలను చేరుకునేలా కృషి చేయాలని మంత్రి శ్రీనివాసరెడ్డి అభిలషించారు.

## మోడీ బహిరంగా సభను విజయవంతం చేయాలి

### ఆర్.కృష్ణయ్య పిలుపు

వార్త 3 లో

## ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో నైపుణ్య శిక్షణాభివృద్ధి కోర్సులతో డిగ్రీ కళాశాలలు...

### మైనారిటీ సంక్షేమ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

వార్త 2 లో



## మూసీ నివాసితులకు డిప్యూటీ సీఎం భరోసా

### ప్రజా భవన్‌లో మధుపార్క్ రిడ్జ్ అసోసియేషన్ ప్రతినిధులతో మంత్రుల భేటీ

### మూసీ నది పునర్జీవనానికి సహకరించండి



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** మూసీ పునర్జీవన ప్రాజెక్టులో భాగంగా నిర్వాసితులయ్యే వారికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా తగిన సాయం అందిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శుక్రవారం ప్రజా భవన్‌లో మూసీ పునర్జీవన క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబులను మధుపార్క్ రిడ్జ్ (బి-బ్లాక్) రెసిడెన్షియల్ అసోసియేషన్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు తమ వినతులను మంత్రులకు సమర్పించారు. నివాసితులు వ్యక్తం చేసిన సందేహాలు, అపోహలను మంత్రులు నివృత్తి చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ మధుపార్క్ రిడ్జ్ బి-బ్లాక్ నివాసితులందరి విషయంలో ప్రభుత్వం అత్యంత సానుకూల దృక్పథంతో ఉందన్నారు. ప్రజలందరూ సంతోషంగా ఉండాలని, వారికి మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. నగరవాసులకు స్వచ్ఛమైన గాలి, నీరు, పచ్చదనం అందించేందుకు చేపట్టిన ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టులో భాగస్వాములు కావాలని వారిని డిప్యూటి సీఎం కోరారు. ప్రభుత్వ హామీ పట్ల అసోసియేషన్ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. మూసీ పునర్జీవనానికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మధుపార్క్ రిడ్జ్ అసోసియేషన్ అధ్యక్షులు దొడ్డ శ్రీనివాస్ రెడ్డి, సెక్రటరీ జి.వి. శేఖర్, సభ్యులు సత్యనారాయణ, గౌతమ్ రాయ్, రేణుధల్, నబీ సాహేబ్, సాహిల్ ఖాన్ పాల్గొన్నారు. ప్రభుత్వ పక్షాన మూసీ ప్రాజెక్ట్ ఎండి ఈ.వి. నర్సింహారెడ్డి, జాయింట్ ఎండి గౌతమి, అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి తదితరులు హాజరయ్యారు.

## రిటైర్డ్ డీజీ సతీమణి తనూజ హత్య కేసు:

## సంచలన విషయాలు వెల్లడించిన సీపీ సజ్జనార్



హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ప్రశాసన్ నగర్‌లో రిటైర్డ్ డీజీ వినయ్ రంజన్ రాయ్ సతీమణి తనూజ హత్యకు గురయ్యారు. ఈ హత్యకు సంబంధించిన వివరాలపై హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ మీడియాతో మాట్లాడారు. రిటైర్డ్ డీజీ సతీమణి తనూజ హత్య గావింపబడిందని తమకు మొదటగా సమాచారం వచ్చిందని తెలిపారు. రిటైర్డ్ డీజీ భార్య తనూజను గురువారం రాత్రి రెండు గంటలకు దుండగులు హత్య చేశారని చెప్పుకొచ్చారు. నేపాలి గ్యాంగ్ పనిగా ప్రాథమికంగా తాము ఒక అంచనాకు వచ్చామని అన్నారు. కొన్ని క్లూస్ లభించాయని..ఆ క్లూస్ ఆధారంగా ఈ కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. నేపాలి పనివాళ్లపై అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పనిమనిషి కల్పన ఈ హత్య చేసిందినేపాలి పని మనుషులు ఇంట్లో ఎవరూ లేనప్పుడు నేరాలకు పాల్పడుతున్నారని సీపీ సజ్జనార్ చెప్పుకొచ్చారు. గురువారం రాత్రి రిటైర్డ్ డీజీ ఇంట్లో ఎవరు లేనప్పుడు పనిమనిషి కల్పన అనే మహిళ మరికొందరితో కలిసి ఈ క్రైమ్ చేసిందని తెలిపారు. నిందితులు వెనుకాల గేటు నుంచి ఇంట్లోకి ప్రవేశించారని పేర్కొన్నారు. ఈ ఘటన సమయంలో పిల్లలు ఇద్దరు పై ఫ్లోర్‌లో ఉన్నారని..తనూజ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్నారని వెల్లడించారు.ఇంట్లో ఉన్న పనిమనిషి కల్పనాతో బయట వ్యక్తులు కాంటాక్ట్ పెట్టుకొని ఈ క్రైమ్ చేశారని చెప్పారు. ప్రజలు భయాందోళనకు గురికావొద్దని..నిందితులను త్వరలో పట్టుకుంటామని తెలిపారు.వాళ్లపై నిఘా ఉంచాలి:నేపాలి పనిమనుషులు ఇంట్లో ఏడాది, రెండో ఏడాది పనిచేసిన కూడా వాళ్లపై నిఘా ఉంచాలని సీపీ సజ్జనార్ అన్నారు. ఈ కేసును చాలా సీరియస్‌గా తీసుకుంటున్నామని తెలిపారు. చేతులు కట్టేసి నోట్లో గుడ్డలు కుక్కి ఆమెను ఈ గ్యాంగ్ హత్య చేసిందని చెప్పారు. రిటైర్డ్ డీజీ తల్లి కోసం తనూజ హైదరాబాద్ వచ్చారని తెలిపారు. ఇటీవల రిటైర్డ్ డీజీ తల్లి మరణించారని..అప్పటి నుంచి మృతురాలు తనూజ ఇక్కడే ఉంటున్నారని వివరించారు. ఈ కేసులో ఎంత బంగారం, నగదు పోయిందనే అంశాలపై ఆరా తీస్తున్నామని సీపీ సజ్జనార్ తెలిపారు.

## బెంగాల్ కొత్త సీఎం సువేందు అధికారి

కోల్ కత్తా, మే 8, (న్యూస్ పల్స్)పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ఒక చారిత్రాత్మక మార్పు చోటుచేసుకుంది. దశాబ్ద కాలానికి పైగా సాగిన మమతా బెనర్జీ పాలనకు తెరదించుతూ, నూతన ముఖ్యమంత్రిగా బీజేపీ నేత సువేందు అధికారి బాధ్యతలు చేపట్టేందుకు మార్గం సుగమమైంది. కోల్‌కతాలో జరిగిన బీజేపీ శాసనసభాపక్ష సమావేశంలో సువేందును ఏకగ్రీవంగా నాయకుడిగా ఎన్నుకున్నారు. కేంద్ర నాయకత్వం సూచనల మేరకు, రాష్ట్రంలో సామాజిక సమతుల్యతను కాపాడేందుకు ఇద్దరు ఉప ముఖ్యమంత్రులను నియమించాలని నిర్ణయించారు. ఈ ఇద్దరు డిప్యూటీ సీఎంలలో ఒకరు ఉత్తర బెంగాల్ ప్రాంతానికి చెందిన వారు కాగా, మరొకరు మతువా సామాజికవర్గం లేదా గిరిజన వర్గాల ప్రతినిధిగా ఉండే అవకాశం ఉందని సమాచారం. ఈ ముగ్గురు నేతల ఫార్ములా ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు, వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించాలని బీజేపీ వ్యూహరచన చేసింది.

ప్రజాబలం

09 మే 2026 శనివారం

# విజయ్ కంటే.. రాజేంద్ర అర్లేకరే ఫేమస్

దేశవ్యాప్తంగా కొద్దిరోజులుగా తమిళనాడు రాజకీయాలు సృష్టిస్తున్న సంచలనం మామూలుగా లేదు. ఈ ఎన్నికల్లో తమిళనాడు ప్రజలు ఏ పార్టీకి కూడా వన్ సైడ్ విక్టరీ ఇవ్వలేదు. ప్రభుత్వ వ్యతిరేకతను.. ప్రతిపక్షం పార్టీ మీద ఉన్న ఆగ్రహాన్ని ఏకకాలంలో ప్రదర్శించారు. అభిమానాన్ని కూడా చూపించారు. ఫలితంగా మూడు పార్టీలలో దేనికి కూడా గొప్పగా చెప్పుకునే మెజారిటీ రాలేదు. దీంతో ఈసారి తమిళనాడులో బంపర్ మెజారిటీ ఏ పార్టీ సాధించలేకపోయింది. కనీసం మ్యాజిక్ ఫిగర్ కు దగ్గరగా కూడా రాలేకపోయింది. దీంతో పొత్తులు.. సంకీర్ణాల గురించి చర్చ నడుస్తూనే ఉంది. అయితే ఇంతవరకు తమిళనాడులో ఏర్పడిన సందిగ్ధం తీరలేదు.విజయ్ పార్టీకి అత్యధికంగా స్థానాలు వచ్చినప్పటికీ.. ఆయనకు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే బలం లేదు. ఇతర పార్టీల నేతలను కూడగట్టే ప్రయత్నం చేసినప్పటికీ అది సాధ్యం కావడం లేదు. దీంతో తమిళనాడులో రకరకాల రాజకీయాలు సాగుతూ ఉన్నాయి. ఇప్పటికే డీఎంకే తమిళనాడు రాజకీయాల మీద క్లారిటీ ఇచ్చేసింది. తాము ఎవరికి సపోర్ట్ చేయమని.. ప్రజల ఓటింగ్ ద్వారా లభించిన ప్రతిపక్ష స్థానాన్ని కొనసాగిస్తామని డీఎంకే అధినేత స్టాలిన్ ప్రకటించారు. దీంతో తమిళనాడులో రాజకీయాలు మరో మలుపు తీసుకున్నాయి. ఇప్పటికే రిసార్ట్ నుంచి ఎమ్మెల్యే విజయ్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.విజయ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు బుధవారం గవర్నర్ ను కలిశారు. కాకపోతే గవర్నర్ అడిగిన ప్రశ్నలకు టీవీకే అధినేత వద్ద సమాధానాలు లేకుండా పోయాయి. దీంతో గురువారం జరగాల్సిన ప్రమాణ స్వీకారం రద్దయింది. అంతేకాదు ఇప్పట్లో తమిళనాడులో ప్రభుత్వం ఏర్పడే అవకాశం కనిపించడం లేదు.తమిళనాడు రాజకీయాల్లో ఈ సందిగ్ధత కొనసాగుతున్న నేపథ్యంలో ఒక వ్యక్తి విజయ్ కంటే ఎక్కువ ప్రాచుర్యం పొందారు. మీడియా కూడా ఆయన గురించి విశేషంగా కథనాలను ప్రసారం చేస్తోంది. ఆ వ్యక్తి రాజకీయాలతో సంబంధం ఉన్నవారు కాదు. పార్టీలతోనూ సంబంధం ఉన్నవారు కాదు. ఆయన మరెవరో కాదు తమిళనాడు గవర్నర్ రాజేంద్ర అర్లేకర్. ఇటీవల విజయ్ గవర్నర్ కార్యాలయం వద్దకు వెళ్ళినప్పుడు రాజేంద్ర సాదరంగా స్వాగతం పలికారు. మెజారిటీ చూపిస్తేనే టీవీకే ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతి ఇస్తామని అన్నారు. దీంతో రాజేంద్ర మీద తీవ్రస్థాయిలో చర్చ జరుగుతుంది. కొన్ని పార్టీలు రాజేంద్ర తీరును తీవ్రస్థాయిలో విమర్శిస్తున్నాయి. ఆయన వ్యవహరిస్తున్న తీరు ఏమాత్రం బాగోలేదని మండిపడుతున్నాయి. కమలహాసన్ నుంచి మొదలు పెడితే విశాల్ వరకు అందరు గవర్నర్ తీర్పట్ల మండిపడుతున్నారు.తమిళనాడు రాజకీయాలలో సస్పెన్స్ వీడటం లేదు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా అవతరించిన విజయ్ టీవీకే పార్టీకి.. ప్రభుత్వ ఏర్పాటు కోసం గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్ అనుమతి ఇవ్వకపోవటంపై సర్వత్రా చర్చ జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తమిళనాడు రాజకీయ పరిణామాలపై లోక్‌సత్తా వ్యవస్థాపకులు జయప్రకాష్ నారాయణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా తాజా రాజకీయ పరిణామాలు, తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటుకు టీవీకే విజయ్‌ను గవర్నర్ అనుమతించకపోవటం అన్యాయమైన చర్యగా జయప్రకాష్ నారాయణ్ పేర్కొన్నారు.గవర్నర్ తీరు అప్రజాస్వామికమే కాకుండా.. రాజ్యాంగ స్ఫూర్తికి, మౌలిక సూత్రాలకు పూర్తిగా విరుద్ధమని విమర్శించారు. ప్రభుత్వానికి శాసనసభ మద్దతు ఉందా, లేదా అనే విషయం తేల్చాల్సింది అసెంబ్లీలో కానీ.. రాజ్‌భవన్‌లో (లోక్ భవన్) కాదని జయప్రకాష్ నారాయణ్ అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని.. విజయ్‌ను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించేలా గవర్నర్‌కు సూచించాలని అన్నారు. బలనిరూపణ ద్వారా శాసనసభలో ప్రభుత్వాన్ని ఓడించేంత వరకూ.. మైనారిటీ ప్రభుత్వమైనా పాలన సాగించవచ్చని జయప్రకాష్ నారాయణ్ పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు గతంలో ఎన్నో జరిగాయన్న జేపీ.. 1969లో కాంగ్రెస్ చీలిక తర్వాత ఇందిరా గాంధీ ప్రభుత్వం ఏర్పాటు, 1991 నుంచి 1996 వరకూ పీవీ నరసింహారావు పాలనను గుర్తు చేశారు.రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి పక్షపాత రాజకీయాలు చేసే హక్కు గవర్నర్లకు లేదని జయప్రకాష్ నారాయణ్ స్పష్టం చేశారు. తమిళనాడులో ప్రస్తుతమున్న రాజకీయ సంస్కృతిని తిరస్కరిస్తూ తమిళ ప్రజలు అసాధారణమైన తీర్పును ఇచ్చారని.. గవర్నర్ ఆ తీర్పును అగౌరవపరచడం రాజకీయాలపై ప్రజల విశ్వాసాన్ని మరింత దెబ్బతీసి, ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తుందని జయప్రకాష్ నారాయణ్ అభిప్రాయపడ్డారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి చర్యలు.. వీధి పోరాటాలకు, ప్రభుత్వాల పతనానికి ఎలా దారితీస్తాయో పొరుగు దేశాలలో చూశామని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా వివేకం, ముందుచూపుతో వ్యవహరించి, తమిళనాడులో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అతిపెద్ద పార్టీగా నిలిచినవారిని ఆహ్వానించమని గవర్నర్‌కు సలహా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాగే రాజ్యాంగ విలువల పరిరక్షణకు రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలని.. గవర్నర్ ఇంకా మొండిగా వ్యవహరిస్తే, అతడిని తక్షణమే తొలగించాలని సూచించారు.రాజేంద్ర 1989లో బిజెపిలో చేరారు. 2002, 2012లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2017లో స్పీకర్ గా దేశంలోనే మొట్టమొదటిసారిగా కాగిత రహిత అసెంబ్లీ ని రూపొందించారు. రాజ్యాంగ సూత్రాలను ఈయన నూటికి నూరుపాళ్ళు అమలు చేస్తారు. 2025 నుంచి కేరళ రాష్ట్రానికి గవర్నర్ గా ఉన్నారు. తమిళనాడు రాష్ట్రానికి ఇన్చార్జి గవర్నర్ గా వ్యవహరిస్తున్నారు.

# ప్రజా సమస్యలు పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం కృషి



విజయవాడ 45 వ డివిజన్ లో జరిగిన ప్రజా దర్బార్ కార్యక్రమం లో ఎంపీ కేశినేని చిన్ని పాల్గోన్నారు. ఎంపి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ సూచన మేరకు ఈ ప్రజాదర్బార్ కార్యక్రమం జరుగుతుంది. ప్రజా సమస్యలు పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంది. విజయవాడ లో ఉన్న సమస్యలు అన్నిటి పై ముఖ్యమంత్రి కి జిల్లా కలెక్టర్ మరియు ప్రజాప్రతినిధులు అందరం కలిసి తీసుకువెళ్ళామని అన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలం గా సమస్యలు అన్నిటి పై స్పందించారు . జి వో 30 తీసుకువచ్చి ప్రతి ఒక్క లబ్దిదారుడు కి రెగ్యులరైజ్ చేసి పట్టాలు ఇవ్వడం జరుగుతుంది. విజయవాడ లో డ్రైనేజి మరియు కొండ ప్రాంత ప్రజల సమస్యలు త్వరలో రాబోతున్నాయి. పెన్షన్స్ పై ప్రభుత్వం కొత్త పాలసీ తీసుకురాబోతుంది. సమస్యలు పరిష్కరానికి మీ అందరి ప్రభుత్వం ముందు ఉంటుందని అన్నారు. మేము చెప్పిన సంక్షేమ పథకాలు అన్ని ఒక్కొక్కటిగా చేసాం. గత ప్రభుత్వం లో ఎవరు ప్రజల దగ్గరకు వెళ్ళింది లేదు. ప్రజలంతా ఈ ప్రభుత్వాన్ని ఇది మంచి ప్రభుత్వం అంటున్నారని అన్నారు.

## కరీంనగర్ ఘటనపై డీజీపీకి బీఆర్ఎస్ నేతల ఫిర్యాదు

హైదరాబాద్ రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలిశారు.ఈ సందర్భంగా రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యలపై డీజీపీకి బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేశారు. కరీంనగర్‌లో గురువారం మాజీ మంత్రి గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంతో పాటు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వాహనంపై బీజేపీ కార్యకర్తలు దాడి చేసిన విషయం తెలిసిందే..ఈ అంశంపై డీజీపీకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ నేతలపై దాడులను అరికట్టాలని, శాంతిభద్రతలను కాపాడాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.బండి సంజయ్,ముఖ్యమంత్రి చీకటి ఒప్పందాలు, వ్యాపారాలు అందరికి తెలుసని ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ వ్యాఖ్యలు చేశారు. బండి సంజయ్‌కు అహకారం పెరిగిందన్నారు. 'మీ భాషపై మీ భాషలో చెబితే దాడులు చేస్తారా. కౌశిక్ రెడ్డి ఏమి తప్పు మాట్లాడారో చెప్పాలి. వచ్చేది మా ప్రభుత్వం. అప్పుడు బండి సంజయ్ గుజరాత్ వెళ్లి దాక్కోవాలి.అన్ని ఆధారాలను డీజీపీకి ఇచ్చాం. రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెబుతాం అని వివేకానంద గౌడ్ హెచ్చరించారు.శాంతిభద్రతలు దిగజారిపోయాయి పల్లా రాజేశ్వర్ రెడ్డి.తెలంగాణ రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారిపోయాయని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు.

# శ్రీ మహాలక్ష్మి వెంకటేశ్వరస్వామి (కొడంగల్ బాలాజీ) ఆలయ పునర్నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి భూమి పూజ

మొదటి పేజీ తరువాయి

మక్తల్ -- నారాయణపేట్ -- కొడంగల్ ప్రాజెక్టును పూర్తి చేయాలి. కృష్ణా నది జలాలతో ఈ ప్రాంత భూములు తడవాలి. దీనికి జిల్లా ఇంచార్జి మంత్రి రాజనర్సింహ ప్రతి నెల సమీక్ష నిర్వహించాలని కోరుతున్నా. భూ సేకరణ పూర్తి చేసినం. అనుమతులు అన్నీ వచ్చాయి. పనులు ముందుకు సాగాలి" అని అన్నారు.

"ఇప్పుడు నిధులకు అడ్డంకి లేదు. అన్ని మండలాలకు నీళ్లు తెచ్చుకునే అవకాశం ఉంది. పనులు వేగంగా జరిగే విధంగా సర్పంచులు, స్థానిక ప్రతినిధులు చురుకుగా పనిచేయాలి. కృష్ణా – వికారాబాద్ రైల్వే లైన్‌కు కూడా సూత్రప్రాయంగా అనుమతి తెచ్చుకున్నాం.

ఈ ప్రాంతంలో అపారమైన సున్నపురాయి ఉంది. టేకులగోడు ప్రాంతంలో పెద్ద ఎత్తున సిమెంట్ పరిశ్రమకు అన్ని అనుమతులు ఇచ్చినం. రాబోయే ఆర్నెళ్లలో సిమెంట్ పరిశ్రమ నిర్మాణం జరిగితే స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయి.

పెద్ద ఇండస్ట్రియల్ పార్క్ ను లగచర్ల దగ్గర కట్టుకుంటున్నాం. కోస్గీ నుండి నేరుగా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ వరకు 300 అడుగుల రోడ్డు వేస్తున్నాం" అని ముఖ్యమంత్రి చెప్పారు.

ప్రతి ఊర్లో చిన్న సమస్యలు, బేదాభిప్రాయాలు ఉంటాయి. అవన్నీ పక్కన పెట్టి మీరంతా కలిసి కట్టుగా ఉండాలి. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవాలి అని పిలుపునిచ్చారు.

"కొడంగల్ నియోజకవర్గ పరిధిలో 55 ఏళ్ల కిందట కీ.శే. నందారం నర్సింహులు ప్రారంభించిన ఈ పేదల తిరుపతిని, తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో పునర్నిర్మించే ఒక బృహత్తరమైన స్వామి కార్యాన్ని చేపట్టాం. ఇది జీవితంలో మళ్లీ రాని గొప్ప అవకాశం" అని వ్యాఖ్యానించారు.

"తెలంగాణ పేదల తిరుపతిగా దీన్ని అభివృద్ధి చేయాలని చాలా మంది నాయకులు కలలు కన్నారు. వివిధ కారణాల చేత ఎప్పటికప్పుడు వాయిదా పడుతూ వచ్చింది. దేశం గర్వించదగిన ఆగమశాస్త్ర సలహాదారులు సుందర వరదాచార్యులు గారు ఇక్కడ వీధుల్లో రథాన్ని తిప్పడానికి మీరు బాధ్యత తీసుకోవాలని నన్ను కోరడంతో ఆ కార్యక్రమాన్ని చేపట్టాం" అని వివరించారు.

"ఇప్పుడాయన మన మధ్యలో లేకపోవడం తీరని లోటు. సుందర వరదాచార్యులు గారి చివరి కోరికను తీర్చడంతో పాటు, వారిని ఈ ప్రాంతం, ఈ సమాజం గుర్తు పెట్టుకునే విధంగా మందిరాన్ని తీర్చిదిద్దుతాం.

అలాగే, సుందర వరదాచార్యులు పేరు ఈ ప్రాంగణంలో ఏదో ఒక విడిదికి పెట్టాలని" ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కి, దేవాదాయ శాఖ అధికారులకు, జిల్లా కలెక్టర్ కి సూచించారు.

"ఈ కార్యక్రమం రాజకీయాలకు అతీతమైనది. జెండా, అజెండాలకు సంబంధించినది కాదు. ఇది మన ప్రాంతం, రాష్ట్రం గర్వించదగ్గ ఒక గొప్ప అభివృద్ధి కార్యక్రమం. ఇక్కడి వారినే కాదు. కర్ణాటక, మహారాష్ట్ర నుండి వచ్చే ప్రజలను కూడా ఆశీర్వదించడానికి ఒక గొప్ప దైవ కార్యం.

కొడంగల్ శాసనసభ నియోజకవర్గ ప్రతిష్టను దేశ స్థాయిలో విస్తరించడానికి ఇది దోహదపడుతుందని భావిస్తున్నా. ఈనాడు తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయి కొడంగల్ బిడ్డ మీ ముందు నిలబడ్డా.." అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

# ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో నైపుణ్య శిక్షణాభివృద్ధి కోర్సులతో డిగ్రీ కళాశాలలు...

**మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు...**

**మూసీ అభివృద్ధిలో గుడితో పాటు మసీద్, చర్చి, గురుద్వారాల నిర్మాణం**

**మైనారిటీ సంక్షేమ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి**





హైదరాబాద్: మైనారిటీ విద్యార్థుల కోసం ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని.. వాటిలో నైపుణాభివృద్ధి, ఏఐ శిక్షణకు ప్రాధాన్యమివ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.

సంప్రదాయ కోర్సులు కాకుండా వారి జీవనోపాధికి ఉపయోగపడే శిక్షణ ఇప్పించాలన్నారు. మైనారిటీ సంక్షేమ శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సచివాలయంలో శుక్రవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ప్రతిభావంతులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఇస్తున్నట్లే మైనారిటీ విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించాలని,ఇందుకోసం ప్రత్యేకంగా ఒక కార్యక్రమం ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. గ్రూప్–1, గ్రూప్–2, గ్రూప్–3కి ఎంపికైన మైనారిటీ అభ్యర్థుల్లో ఆసక్తి ఉన్న వారిని ఎంపిక చేసి మైనారిటీ సంక్షేమ శాఖలో బాధ్యతలు అప్పగించి... ఆ శాఖ పరిధిలో చేపట్టే అన్ని కార్యక్రమాలపై పూర్తి అవగాహన కలిగించేలా వారిని తీర్చిదిద్దాలని సీఎం ఆదేశించారు. విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించే కార్యక్రమానికి గ్రూప్స్‌కు ఎంపికైన వారిని, క్రీడాకారులను ఆహ్వానించి విద్యా, క్రీడల ప్రాధాన్యతను వారికి తెలియజేయాలని సూచించారు. ఇమామ్, మౌజమ్‌లకు ఇచ్చే గౌరవ పారితోషికాలను క్రమం తప్పకుండా విడుదల చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. మైనారిటీ పాఠశాలల్లో బోధనలో ఏఐకు ప్రాధాన్యమివ్వాలని సీఎం సూచించారు. భూ లభ్యత ఉన్న చోట ఖబరస్తాన్‌లకు స్థలాలను కేటాయిస్తామని సీఎం తెలిపారు. డీజిల్, పెట్రోల్ ఆటోలను ఎలక్ట్రిక్ ఇంజిన్లతో రీట్రోఫిట్టింగ్ చేయడం ద్వారా ఆటోడ్రైవర్లకు ఇంధన ఖర్చులు లేకుండా చేసి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచే లక్ష్యంతో ఒక ప్రణాళిక రూపొందిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

మూసీ రివర్ ఫ్రంట్‌లో భాగంగా గుడితో పాటు మసీద్, చర్చి, గురుద్వారా నిర్మాణాలు చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.

ఆయా మతాలకు సంబంధించిన సంస్కృతుల అధ్యయనం, భారత దేశ విశిష్టతను, తెలంగాణలోని గంగా జమునా తెహ్‌జీబ్ ను తెలియజేసేలా ఆ కట్టడాలు ఉండాలని ముఖ్యమంత్రి అన్నారు. మన సంస్కృతులను అధ్యయనం చేసే గొప్ప అధ్యయన కేంద్రాలుగా అవి పరిఢవిల్లాలని సీఎం ఆకాంక్షించారు. సమీక్షలో రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీలు) మహ్మద్ షబ్బీర్ అలీ, టీజీఎంఆర్ఈఐఎస్ ప్రెసిడెంట్ మహ్మద్ ఫహీముద్దీన్ ఖురేషీ, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, హజ్ కమిటీ ఛైర్మన్ సయ్యద్ గులామ్ అఫ్జల్ బియాబానీ, వక్ఫ్ బోర్డు ఛైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ మహ్మద్ ఓబేదుల్లా కొత్వాల్, ఉర్దూ అకాడమీ ప్రెసిడెంట్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ ఛైర్మన్ దీపక్ జాన్ కొకడాన్, రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి షఫీఉల్లా తదితరులు పాల్గొన్నారు.

# మోదీ సభ తర్వాత తెలంగాణ రాజకీయాలు మారబోతున్నాయి: రామచందర్‌రావు



హైదరాబాద్ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ నెల 10వ తేదీన తెలంగాణలో పర్యటిస్తున్నారని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు నారపరాజు రామచందర్‌రావు వ్యాఖ్యానించారు.ఈ సభ తర్వాత తెలంగాణ రాజకీయాలు మారబోతున్నాయని పేర్కొన్నారు. ఈ సభ ఏర్పాట్లు అన్ని దాదాపు పూర్తి అయ్యాయని చెప్పుకొచ్చారు. పరేడ్ గ్రౌండ్‌లో మోదీ హాజరయ్యే సభ ఏర్పాట్లను శుక్రవారం రామచందర్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.తెలంగాణ అభివృద్ధిలో మోదీ ప్రాధాన్యం..ఈరోజు నుంచి రెండు రోజులపాటు పరేడ్ గ్రౌండ్ పరిసర ప్రాంతాలు అన్ని కేంద్ర బలగాల అధీనంలోకి వెళ్తాయని వెల్లడించారు. గ్రేటర్ ఎన్నికల ముందు మోదీ సభ జరగడం తమ పార్టీకి కలిసి వచ్చే అంశమని తెలిపారు. తెలంగాణ అభివృద్ధిలో మోదీ ప్రాధాన్యం చాలా ఉందని ఉద్ఘాటించారు. రెండు లక్షలకు పైగా మందితో ఈ సభ సక్సెస్ కాబోతుందని అన్నారు. బీజేపీ శ్రేణులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా మోదీ సభ కోసం తరలి వస్తున్నారని తెలిపారు.ఈ సభ కోసం ప్రత్యేక రైళ్లు, బస్సులను ఏర్పాటు చేశామని రామచందర్‌రావు పేర్కొన్నారు.

# మోడీ బహిరంగా సభను విజయవంతం చేయాలి

## కులగణన తరువాత మోడీ ద్వారానే చట్టసభలలో రిజర్వేషన్ సాధ్యం

## బిసి సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు,ఎంపీ ఆర్.కృష్ణయ్య పిలుపు



హైద్రాబాద్ మే 8: మోడీ బహిరంగా సభను విజయవంతం చేయాలని బిసి సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు,ఎంపీ ఆర్.కృష్ణయ్య పిలుపు నిచ్చారు.

కులగణన తరువాత మోడీ ద్వారానే చట్టసభలలో రిజర్వేషన్ సాధ్యమన్నారు.

ప్రధానమంత్రి జనగణనలో కులగణన చేస్తామని ప్రకటించారు. జనగణన కాగానే బీసీ జనాభా తెలుస్తుంది. అప్పుడు అన్ని రంగాలలో జనాభా ప్రకారం బి.సి.లకు వాటా ఇవ్వడం జరుగుతుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వం చరిత్రలో నిలిచిపోయే నిర్ణయాలు తీసుకుంటుంది.శుక్రవారం కాచిగూడ లో జరిగిన 13 బి.సి సంఘాల సమావేశం నీల వెంకటేష్, పల్లగోర్ల మోడీరాందేవ్ అధ్యక్షత జరిగింది. ఈ సమావేశానికి కృష్ణయ్య ముఖ్య అతిధిగా విచ్చేసి ప్రసంగించారు.

ప్రస్తుతం జనగణనలో కులగణన చేస్తామని కేంద్రం ప్రకటించింది. దీనిపై ఎటువంటి అనుమానాలు ఉండవలసిన అవసరం లేదన్నారు. కానీ కొందరు బిసి సంఘాల పేరుతో కాంగ్రెస్ ప్రలోబాలకు లోనై ప్రధానమంత్రి నరేంద్రమోడీ తెలంగాణ పర్యటన అడ్డుకొంతమని పేర్కొనడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. జనగణనల రెండు దశలలో జరుగుతుంది. మొదటి దశలలో ఇళ్ళు లెక్కించడం జరుగుతుంది. రెండవ దశలలో జన గణనతో పాటు కులగణన చేయడం జరుగుతుందని హోం శాఖ మంత్రి అమిత్ షా పార్లమెంటులో ప్రకటించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం అధికారికంగా కూడా రెండవ దశలలో కులగణన ఉంటుందని చెప్పిన ప్రతిపక్షాలు చేస్తున్న అనుమానాలకి వివరణ ఇచ్చారు. ఇందులో ఎటువంటి సందేహాలు లేవు. కచ్చితంగా కులగణన జరుగుతుంది. బీసీలకు జనాభా ప్రకారం విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, సామజిక రంగాలలో జనాభా ప్రకారం వాటా లభిస్తుంది. కులగణన కేంద్ర ప్రభుత్వం అంగీకరించడం చారిత్రాత్మకమైన నిర్ణయం. గతంలో పాలించిన ప్రభుత్వాలు కులగణన చేయడానికి సాహసం చేయలేదు. 76 ఏళ్ల స్వతంత్రం తర్వాత కుల గణన చేసే సాహసం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో బిజెపి ప్రభుత్వం చేసింది.

1931లో బ్రిటిష్ ప్రభుత్వం తీసిన లెక్కల తరువాత నరేంద్ర మోడి ప్రభుత్వం సాహసిపోతా నిర్ణయం తీసుకుందని ప్రశసించారు. ఇది చారిత్రాత్మక నిర్ణయమన్నారు.

13 బి.సి సంఘాల సమావేశంలో నీల వెంకటేష్, రాజేందర్, పర్లగోర్ల మోడీ రాందేవ్, అంజి గౌడ్, నిఖిల్ పటేల్, తిరుమల గిరి అశోక్, బలరాం, మల్లేష్ యాదవ్, రాము తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రతే పోలీసుల మొదటి కర్తవ్యం...

## సీఐ పులి శేఖర్ గౌడ్

## మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి.

తుగ్గలి: మహిళల యొక్క భద్రతే పోలీసుల యొక్క మొదటి కర్తవమని పత్తికొండ రూరల్ సీఐ పులి శేఖర్ గౌడ్ అన్నారు.జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మహిళల భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలియజేశారు.శుక్రవారం రోజున తుగ్గలి మండల పరిధిలోని గల జొన్నగిరి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణం గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలపై,చిన్నారులపై జరుగుతున్నటువంటి అఘాయిత్యాలపై ఆయన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ప్రస్తుత సమాజంలో మహిళలపై,చిన్నారులపై జరుగుతున్నటువంటి మోసాల గురించి, ఐవిఆర్ఎస్ కాల్స్ వారు అవగాహన కల్పించారు.స్మార్ట్ ఫోన్ కలిగిన ప్రతి ఒక్క మహిళ తమ ఫోన్ నందు శక్తి యాప్ను తప్పకుండా ఇన్స్టాల్ చేసుకోవాలని ఆయన తెలియజేశారు.ఈ శక్తి యాప్ లోని జిపిఎస్ ఆధారంగా పది నిమిషాలలోపు పోలీసులు అక్కడికి చేరుకొని మహిళలను రక్షించడం జరుగుతుందని ఆయన తెలియజేశారు. అదేవిధంగా ప్రస్తుత సమాజంలో జరుగుతున్న డిజిటల్ మోసాలపై కూడా మహిళలు అప్రమత్తంగా ఉండాలని ఆయన తెలియజేశారు.అదేవిధంగా మహిళలు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని ఆయన తెలియజేశారు.మహిళలపై జరుగుతున్నటువంటి అఘాయిత్యాలను 100,112 నంబర్లకు కాల్ చేసి నేరుగా ఫిర్యాదు చేయవచ్చని ఆయన తెలియజేశారు.అనంతరం జొన్నగిరి ఎస్సై మల్లికార్జున మహిళల భద్రత కొరకు ప్రతిరోజు పోలీసులు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు.మహిళలు సమాజంలో జరుగుతున్నటువంటి చర్యల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళలందరూ తమ స్మార్ట్ఫోన్లు యందు శక్తి యాప్ ను ఇన్స్టాల్ చేసుకొని వాటి సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన మహిళలకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏపిఎం రాధాకృష్ణ, ఐసిడిఎస్ సూపర్వైజర్ అంబిక,విద్యా కమిటీ చైర్మన్ మిద్దె రవి,మిద్దె వెంకటేశ్వర్లు,బాలన్న,బిసి సంఘం మండల అధ్యక్షుడు సంఘాల కృష్ణ, పార్థయ్య,హోటల్ మల్లి,జొన్నగిరి పోలీస్ సిబ్బంది,అంగన్వాడీ వర్కర్లు,జొన్నగిరి గ్రామ ప్రజలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# టీవీకే అధినేతకు శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర మాల మహానాడు నాయకులు

ఆళ్లగడ్డ అంబేద్కర్ ఆశయాలతో రాజకీయాలలో ప్రవేశించి పార్టీని స్థాపించి అనతి కాలంలోనే ముఖ్య మంత్రి పదవిని చేదిపించుకున్న విజయ్ జోసెఫ్ కు రాష్ట్ర మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు రామోజీ ఇమ్మానియేల్ ప్రత్యేక అభినందనలను తెలియజేశారు. ఈరోజు ఆళ్లగడ్డ పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద రాష్ట్ర మాల మహానాడు నాయకులు చంద్రశేఖర్, చక్రవర్తి, జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ బీరువాళ్ళ భాష బీసీ సంఘం నాయకులు వెంకటసుబ్బయ్య తదితర సంఘాల నాయకులతో కలిసి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. అనంతరం వక్తలు ప్రజాసంఘాల నాయకులు రామోజీ ఇమ్మానియేల్, బక్కవాళ్ళ చంద్రశేఖర్, బీరువాల భాష లు మాట్లాడుతూ బీసీ, ఎస్సీ ఎస్టీ మైనారిటీ సంఘాలను కలుపుకొని పక్క రాష్ట్రమైన తమిళనాడులో నేడు ఒక దళిత బిడ్డ రాజ్యాధికారం చేజించుకోవడం మనందరికీ గర్వకారణం అన్నారు. ప్రతి ఒక్కరూ సమాజం కోసం రాష్ట్రం కోసం దేశం కోసం తమ గళాన్ని విప్పాలని హక్కుల కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగానే నేడు ఆంధ్ర రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిపాలన పగ్గాలు చేపట్టినప్పటి నుండి ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు ఇచ్చిన వాగ్దానాలను విస్మరించడంపై వారు నిప్పులు జరిగారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు ప్రకటించిన హామీలను తక్షణమే అమలు చేయాలని లేకపోతే రానున్న రోజుల్లో ప్రజాసంఘాలన్నీ ఏకమై తగిన గుణపాఠం చెప్పే రోజు ఎంతో దూరం లేదని అన్నారు. అలాగే ప్రజా సంఘాల నాయకులు సభ్యులు ఐక్యమత్యంతో ఉంటూ ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు అటు పాలకులకు ఇటు ప్రభుత్వ అధికారులకు వివరిస్తూ సమస్యల పరిష్కారంలో తమ వంతు పాత్ర పోషించడానికి సమన్వయంతో ముందుకెళ్లాలని సభ్యులకు సూచించారు. కార్యక్రమం అనంతరం విజయ్ జోసఫ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భంగా కేక్ ను కట్ చేసి తమ ఆనందాన్ని అంబరాన్ని అంటేలా సంబరాలు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మాల మహానాడు మండల, నియోజకవర్గ, జిల్లా మరియు రాష్ట్రస్థాయి నాయకులు ఎర్రమల చక్రవర్తి, రాజేష్, ఇమ్మానియేల్, ప్రభాకర్ దస్తగిరి, ఓబులేసు షాషవలి, బద్రి నారాయణ , బ్రహ్మం, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు బాల ఓబులేసు, బీసీ సంఘం నాయకులు వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఓ మహిళా మేలుకో నీ గమ్యం చేరుకో

## మహిళా రిజర్వేషన్ బిల్లు సాధనకై ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ

## కృషి లిఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీనేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదయలక్ష్మి

హైద్రాబాద్ మే 8:ఇటీవల పార్లమెంటులో బిల్లు వీగిపోవడాని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తూ పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ కాన్ఫరెన్స్ హాల్ సూర్య లోక కాంప్లెక్స్ అబిడ్స్ హైదరాబాద్ లో జరిగిన ఓ మహిళా మేలుకో నీ గమ్యం చేరుకో కార్యక్రమాన్ని శ్రీమతి ఉదయలక్ష్మి గారు నిర్వహించగా ముఖ్యఅతిథిగా పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ చైర్మన్ శ్రీ నారగొని , గౌరవ అతిధులుగా పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ బాలకృష్ణ, ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కె. బి .శ్రీధర్, మహిళా విభాగం భాగం జాతీయ ఉపాధ్యక్షురాలు డాక్టర్ అంజలి దేవి, ఏపీ అధ్యక్షుడు శివ శంకర్ రెడ్డి తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ నాదెండ్ల సుధాకర్ తెలంగాణ మహిళా ప్రెసిడెంట్ డాక్టర్ పద్మిని అడ్వైజర్స్ చిత్ర దేవసేన యువజన విభాగం జనరల్ సెక్రెటరీ నవీన్ మహిళా నాయకురాలు అనసూయమ్మ మాతృదేవోభవ సత్సంగ్ రెండు రాష్ట్రాల సెక్రటరీ విజయ కనకదుర్గ సామాజికవేత్త నాగభూషణం పాల్గొన్నారు .



ఈ సందర్భంగా త్వరలోనే ఓ మహిళ మేలుకో నీ గమ్యం చేరుకో ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నట్లు సభా తీర్మానించింది

# యువ అధికారులు నిజాయితీ, సేవాభావంతో పనిచేసి భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా వుండాలి

హైదరాబాద్ యువ అధికారులు నిజాయితీ, సేవాభావంతో పనిచేసి భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం నాడు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన 44 మంది గ్రూప్-1 ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లు హైదరాబాదులోని హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి వారిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.



మంత్రి మాట్లాడుతూ ఎంతో మంది మధ్య పోటీపడి, నిబద్ధతతో కష్టపడి సాధించిన గ్రూప్-1 డిప్యూటీ కలెక్టర్ల ఉద్యోగాన్ని ప్రజాసేవకు అంకితం చేసి భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలవాని సూచించారు. ప్రజల సమస్యలకు వెంటనే స్పందించాల్సిన కీలక బాధ్యత రెవెన్యూ శాఖ అధికారులపై ఉంటుంది. కాబట్టి ప్రజాసేవను లక్ష్యంగా సమర్థవంతంగా పనిచేసి వ్యక్తిగతంగానే కాకుండా ప్రభుత్వానికి కూడా మంచి పేరు తీసుకురావాలి. విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లను ఛాలెంజ్గా స్వీకరించి ముందుకు సాగాలని తెలిపారు.

# వివాహ వేడుకలకు హాజరైన మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



తుగ్గలి మండలం నందు పలు గ్రామాల యందు జరిగిన వైఎస్ఆర్సిపి నాయకుల యొక్క వివాహ వేడుకలకు,నూతన గృహప్రవేశ వేడుకలకు పత్తికొండ మాజీ శాసనసభ్యురాలు కంగాటి శ్రీదేవి శుక్రవారం రోజున హాజరయ్యారు. మండల పరిధిలోని గల జొన్నగిరి గ్రామంలో ప్రజ్ఞ స్కూల్ నందు జరిగిన తుగ్గలి మాజీ ఎంపీపీ ఎర్ర నాగప్ప కుమారుని వివాహ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే హాజరై వధూవరులను ఆశీర్వదించారు.అదేవిధంగా మండల పరిధిలోని పెండేకల్లు గ్రామంలో రంగన్న కుమారుని వివాహ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి హాజరయ్యారు. అనంతరం రాంపురం గ్రామ వైయస్సార్సిపి పార్టీ నాయకులు సుంకప్ప నూతన గృహప్రవేశ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు జిట్టా నాగేష్,జడ్పిటిసి పులికొండ నాయక్,మాజీ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి,ఎర్రగుడి రామచంద్రారెడ్డి, శ్రీరంగడు,రాంపురం గంగాధర్,బద్రి తదితర వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రధాని మోదీ పర్యటనతో తెలంగాణలో బీజేపీ మరింత బలోపేతం: కిషన్ రెడ్డి



హైదరాబాద్ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్పై కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి మరోసారి మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అందించిన సహకారంపై వీరిద్దరికి అవగాహన లేనట్లు ఉందన్నారు. శుక్రవారం హైదరాబాద్లో విలేకరుల సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ. ఈ పన్నెండు ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణ రాష్ట్రానికి అందించిన సహకారంపై తాము ఎప్పుడు చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు.హైదరాబాద్లో ప్రధాని మోదీ సభ తరువాత తెలంగాణలో మరింత బలోపేతం అవుతామని కేంద్ర మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. ఇది ఎన్నికలకు సంబంధించిన కార్యక్రమం కాదన్నారు.ఇది అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అంశమని ఆయన పేర్కొన్నారు. రూ.9 వేల కోట్ల అభివృద్ధి పనులకు మోదీ నేరుగా తెలంగాణలో శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల కంటే ముందే ప్రధాని మోదీ తెలంగాణ పర్యటన ఖరారు అయిందని చెప్పారు. తమిళనాడులో రాజ్యాంగ బద్ధంగా ఏ ప్రభుత్వం అయినా ఏర్పాటు చేయవచ్చునన్నారు.ఇనిట

# చంద్రబాబు సరికొత్త ప్లాన్



విజయవాడ, మే 8, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు యువతరానికి ఇచ్చిన ప్రాధాన్యతను సీనియర్ నేతలకు కూడా ఇవ్వాల్సి ఉంటుంది. లేకుంటే భవిష్యత్ లో రాజకీయ పరమైన ఇబ్బందులు తలెత్తే అవకాశాలున్నాయి. ఇప్పటికే తెలుగుదేశం పార్టీలో సీనియర్లు పదవులు లేక.. ప్రాధాన్యత లభించక తమలో తాము అసహనాన్ని అణుచుకుంటున్నారు. చంద్రబాబు మాత్రం సీనియారిటీతో సంబంధం లేకుండా పనితీరుతోనే పదవులు లభిస్తాయని నిర్మొహమాటంగా చెప్పేశారు. దీంతో సీనియారిటీ, లాయల్టీ కంటే తెలుగుదేశం పార్టీలో హైకమాండ్ అడుగులకు మడుగులొత్తేవారికే పదవులు వస్తాయన్న అభిప్రాయం బలంగా కనిపిస్తుంది.చంద్రబాబు నాయుడు నాలుగు సార్లు ముఖ్యమంత్రి అయ్యారన్నా, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిందన్నా.. కేవలం ఆయన ఒక్కరివల్లనే కాదన్న విషయాన్ని ఇప్పుడు విస్మరించడం సరికాదంటున్నారు. పదవులు ఇవ్వకపోగా, తగిన గౌరవం ఇవ్వకపోతే సీనియర్ నేతల్లోనూ పార్టీ పట్ల అంకిత భావం దెబ్బతింటుందన్న భావన ఎక్కువగా వినపడుతుంది. అయినా ప్రస్తుత పరిస్థితుల్లో చంద్రబాబు లెక్క చేసే పరిస్థితుల్లో లేరు. తనకు పవన్ కల్యాణ్, బీజేపీ మద్దతు ఉంటే గెలుస్తామన్న నమ్మకంతోనే ఆయన లోకేశ్ టీంకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇప్పటికే గుర్రుగా ఉన్న కొందరు నేతలు మాత్రం పదవులు తమకు దక్కుతాయన్న ఆశతో ఉన్నారు.కానీ వారికి పదవులు లభిస్తాయన్న ఆశలు రోజురోజుకూ అడుగంటిపోతుండటంతో పార్టీకి ప్రయోజనం చేయకపోయినా.. నష్టం చేయడం పెద్ద పనికాదన్న విషయం సోషల్ మీడియాలో చర్చ జరుగుతుంది. అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో తమ పాలనలో ఉందంటున్న చంద్రబాబు పదవుల విషయంలోనూ సీనియర్లు, జూనియర్లను సమంగా చూడాలని కొందరు కోరుతున్నారు. పార్టీకి ఇంతకాలం వారి సేవలను విస్మరిస్తే రానున్న కాలంలో టీడీపీ పట్ల అంకిత భావంతో పనిచేసే వారు కనిపించరన్న కామెంట్స్ ఎక్కువగా వినిపిస్తున్నాయి. చంద్రబాబు ఇటువంటి నిర్ణయాలు ఎప్పుడూ తీసుకోరని, ఈసారి మాత్రం ఆయనలో మార్పు స్పష్టంగా కనిపిస్తుందని ఒక సీనియర్ నేత ఆవేదన పార్టీలో ఉన్న పరిస్థితికి అద్దం పడుతుంది. చంద్రబాబు ఇప్పటికైనా జాగ్రత్త పడకుంటే... రానున్న కాలంలో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు.

## టాప్ ప్లేస్‌లో బీసీ సంక్షేమ శాఖ..

## పవన్ కళ్యాణ్ శాఖకు చివరి స్థానం..!

విజయవాడ, మే 8, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కలెక్టర్ల సదస్సులో రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల పనితీరుకు సంబంధించి కీలక ర్యాంకులను ప్రకటించారు. కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ ఆధారంగా ప్రభుత్వం ఈ ర్యాంకులను కేటాయించింది. మొత్తం 100 పాయింట్లకు గానూ 100 పాయింట్లు సాధించి బీసీ సంక్షేమ శాఖ రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలవగా, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యవేక్షణలోని అటవీ మరియు పర్యావరణ శాఖ కేవలం 67 పాయింట్లతో చిట్టచివరి స్థానానికి పరిమితమైంది.ప్రభుత్వ శాఖల పనితీరును విశ్లేషించేందుకు ఈసారి 'ంఃఅఆ' గ్రేడింగ్ విధానాన్ని అమలు చేశారు. ఇందులో మెరుగైన ప్రదర్శన కనబరిచిన శాఖలకు 'ం' గ్రేడ్ కేటాయించగా, వెనుకబడిన శాఖలకు తక్కువ గ్రేడులు ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 18 శాఖలు 90 శాతానికి పైగా పాయింట్లు సాధించి ఉత్తమ పనితీరు కనబరిచినట్లు నివేదిక వెల్లడించింది. అయితే, పర్యావరణం మరియు అటవీ శాఖ తక్కువ పాయింట్లు సాధించడం చర్చనీయాంశంగా మారింది. ప్రజలకు సేవలందించడంలో పారదర్శకత, వేగం మరియు జవాబుదారీతనం ప్రాతిపదికగా ఈ గణాంకాలను సిద్ధం చేశారు.ప్రజల సంతృప్తి స్థాయిని పెంచడమే లక్ష్యంగా శాఖల వారీగా ఈ సమీక్ష నిర్వహించినట్లు ప్రభుత్వం తెలిపింది. వెనుకబడిన శాఖలు తమ పనితీరును మెరుగుపరుచుకోవాలని, 90 శాతం కంటే ఎక్కువ ప్రజా సంతృప్తిని సాధించాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. గతంలో పంచాయతీ రాజ్ వంటి శాఖల్లో పవన్ కళ్యాణ్ తనదైన ముద్ర వేసినప్పటికీ, అటవీ శాఖలో ఆశించిన స్థాయిలో లక్ష్యాలను చేరుకోవడంలో ఆ శాఖ వెనుకబడినట్లు ఈ ర్యాంకులు సూచిస్తున్నాయి. రానున్న రోజుల్లో ఈ లోపాలను సరిదిద్ది శాఖను పరుగులు పెట్టించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

# వైసీపీ ప్రచార అస్త్రంగా వర్మ

కాకినాడ, మే 8, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి సరైన అస్త్రం దొరికింది. పిఠాపురం వర్మపై టిడిపి వేటు వేయడంతో.. ఇక వైసిపి సోషల్ మీడియాకు చేతినిండా పని దొరికింది. ఇప్పటికే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కూటమిలో విచ్ఛిన్నం తెచ్చేందుకు చేయని ప్రయత్నం అంటూ లేదు. కానీ ఆ ప్రయత్నాలు ఏవి ఫలించలేదు. అయితే గతంలో వైసిపి అధికారంలో ఉన్నప్పుడు కొంతమంది ఎమ్మెల్యేలు ధిక్కార స్వరం వినిపించారు. ఇప్పుడు అదే పరిస్థితిని తెచ్చి కూటమిలో విభేదాలు తెచ్చేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలు సహజంగానే చేస్తుంది. ఇప్పటికే కృష్ణ జిల్లాలో ఒకరు లైన్ దాటి మాట్లాడుతున్నారు. పిఠాపురంలో సైతం వర్మ అలానే వ్యవహరిస్తున్నారు.. తాను కచ్చితంగా గెలిచే నియోజకవర్గం అనే ఆవేదన ఆయనలో ఉంటుంది. అది సహజం కూడా. అయితే డిప్యూటీ సీఎం గా పవన్ కళ్యాణ్ ఉన్నారు. కూటమి మరో 15 ఏళ్ల పాటు కొనసాగుతుంది కూడా. ఇటువంటి సమయంలో సహకరించాల్సింది పోయి వర్మ స్వతంత్రంగా ముందుకు వెళ్తున్నారు. ఆయన కోణంలో అది తప్పు లేదు కానీ.. కూటమిపరంగా మాత్రం ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. అందుకే టిడిపి నాయకత్వం వర్మపై వేటు వేసినట్లు తెలుస్తోంది.పిఠాపురం నియోజకవర్గం కావాలా? లేకుంటే మంచి రాజకీయ భవిష్యత్తు కావాలా? అని టిడిపి హై కమాండ్ వర్మను కోరినట్లు తెలుస్తోంది. మూడు రోజుల కిందట వర్మ నారా లోకేష్ ను ప్రత్యేకంగా కలిశారు. ఆ తరువాత ఇప్పుడు వర్మను తొలగిస్తూ పర్యవేక్షణకు గాను ముగ్గురు సభ్యులతో కూడిన టిడిపి కమిటీని ఏర్పాటు చేశారు. కచ్చితంగా వర్మకు చెప్పి.. ఒప్పించి మరి ఆయనను తప్పించి ఉంటారన్న అనుమానాలు అంచనాలు ఉన్నాయి. అయితే ఇప్పుడు వైసీపీ అనుకూల మీడియా కచ్చితంగా వర్మకు జరిగిన అన్యాయం పై డిబేట్ పెడుతుంది. టిడిపికి వ్యతిరేకంగా ప్రచారం కూడా చేయిస్తుంది.వాస్తవానికి గతంలోనే వర్మ వైసీపీలోకి వెళ్లిపోతారన్న ప్రచారం పతాక స్థాయిలో జరిగింది. కూటమి అధికారంలోకి రాగానే వర్మకు ఎమ్మెల్సీ పదవి ఇస్తారని అప్పట్లో హామీ ఇచ్చినట్లు ప్రచారం జరిగింది. అయితే అధికారంలోకి వచ్చి నెలలు సంవత్సరాలు దాటుతున్న ఆయనకు ఎటువంటి పదవి లేకుండా పోయింది. దీంతో ఆయనలో అసహనం పెరిగిపోయిందని.. పదవి రాకుండా పవన్ కళ్యాణ్ అడ్డుకుంటున్నారని.. అందుకే వర్మ వైసీపీలో చేరిపోతారని లేనిపోని ప్రచారం సాగింది. అయితే ఇప్పుడు ఒకటి మాత్రం స్పష్టంగా తెలుస్తుంది. ఇదివరకే రాష్ట్ర కార్యవర్గంలోకి వర్మను తీసుకున్నారు. లోకేష్ ను కూడా వర్మ కలిశారు. ఆ తరువాత ఇంచార్జ్ పోస్టును తీసేసారు. వర్మ పిఠాపురం బాధ్యతలనుంచి తప్పుకుంటే కీలక పదవి కట్టబెట్టే హామీ లభించి ఉంటుంది అనేది పొలిటికల్ వర్గాల్లో ప్రచారం. త్వరలో వర్మను ఎమ్మెల్సీ చేస్తారని కూడా ఒక టాక్ ఉంది. అయితే టిడిపి ఇన్చార్జిగా మరో అధికార కేంద్రంగా పిఠాపురంలో మారకూడదని భావించి.. ఆయన అనుమతితోనే పదవి నుంచి తొలగించి ఉంటారన్న విశ్లేషణలు కూడా ఉన్నాయి. అయితే వర్మకు పదవి తొలగించిన తర్వాత ఆయన స్పందించిన తీరుబట్టి ఒక అంచనాకు రావచ్చు.

### వర్మ తొలగింపు

రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం జరిగింది. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ పదవి నుంచి వర్మను కలిగిస్తూ హై కమాండ్ నిర్ణయం తీసుకుంది. గత కొద్ది రోజులుగా జరుగుతున్న పరిణామాలతోనే తెలుగుదేశం పార్టీ నాయకత్వం ఈ నిర్ణయానికి వచ్చింది. వర్మను తొలగించి.. టిడిపి పర్యవేక్షణ బాధ్యతలను ముగ్గురు నేతలతో కూడిన కమిటీకి అప్పగించింది. వర్మ వ్యక్తిగత వ్యవహార శైలి కూటమి సమన్వయానికి విఘాతం కలిగిస్తున్న నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కూటమి విషయంలో ఇప్పటికే జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తన పార్టీ శ్రేణులకు ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తూ వచ్చారు. ఇప్పుడు అదే పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో టిడిపి నుంచి కూటమికి ఇబ్బంది రాకుండా ఉండేందుకుగాను.. వర్మ పై వేటు వేసింది టిడిపి నాయకత్వం.మొన్నటి ఎన్నికల్లో పిఠాపురం నియోజకవర్గాన్ని పొత్తుల భాగంగా జనసేనకు కేటాయించారు. అయితే తెలుగుదేశం పార్టీకి ఇది బలమైన నియోజకవర్గం. అందుకే వర్మ నేతృత్వంలోని టిడిపి శ్రేణులు అభ్యంతరం తెలిపాయి. కానీ చంద్రబాబు చొరవ తీసుకొని ఒప్పించడంతో పవన్ గెలుపు కోసం కృషి చేశారు వర్మ. అంతవరకు ఓకే కాని ఎన్నికల ఫలితాలు వచ్చిన తరువాత.. వర్మ వైఖరిలో స్పష్టమైన మార్పు కనిపించింది. పిఠాపురం నియోజకవర్గంలో ఆధిపత్యం కోసం ఆయన గట్టి ప్రయత్నాలు చేశారు. ఈ క్రమంలో జనసేన నేతలతో ఘర్షణ వైఖరి అనుసరించారు. మొన్ననే జనసేన మాజీ ఎమ్మెల్యే దొరబాబుతో వీధి పోరాటానికి దిగారు. కేవలం ఉద్దేశపూర్వకంగా ప్రోటోకాల్ పేరుతో వర్మ ఘర్షణ వైఖరి అనుసరిస్తున్నారు అని టిడిపికి నివేదికలు అందాయి.కూటమి విషయంలో ఇబ్బందులకు గురి చేస్తే ఎంతటి వారిపైనైనా చర్యలు ఉంటాయని స్పష్టమైన సంకేతాలు పంపింది టిడిపి నాయకత్వం. మొన్నటి ప్రోటోకాల్ రగడ తర్వాత వర్మకు రాష్ట్ర కార్యవర్గంలో చోటు దక్కింది. దీంతో వర్మ విషయంలో టిడిపి నాయకత్వం చూసి చూడనట్టుగా వెళుతుందని ఒక అభిప్రాయం ఏర్పడింది. కానీ ఇప్పుడు దానికి చెక్ చెబుతూ వేగంగా ఇంచార్జ్ పదవి నుంచి వర్మను తొలగించారు. కూటమి విషయంలో ఇబ్బందులకు గురి చేస్తే ఎంతటి వారినైనా విడిచి పెట్టేది లేదని సంకేతాలు పంపింది టిడిపి నాయకత్వం. అయితే వర్మకు చెప్పి తొలగించారా? ఈ ఆదేశాలు వెనుక వర్మ ఎలా స్పందిస్తారు? అనేది తెలియాల్సి ఉంది. కచ్చితంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతుంది. వర్మ కోసం ప్రయత్నాలు చేస్తుంది. గతంలో కూడా వర్మ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరుతారని ఒక ప్రచారం బలంగా జరిగింది. ఇప్పుడు ఎలాంటి పరిణామాలు జరుగుతాయో చూడాలి.

## భద్రాద్రి కొత్తగూడెం

## జిల్లాలో పెరిగిన ఎండల తీవ్రత

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు చేరిగాయి.ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. మధ్యాహ్నం 12 నుండి 4 గంటల వరకు బయటకు రావద్దని వైద్యులు సూచిస్తున్నారు.వడదెబ్బ తగలకుండా తగినన్ని ద్రవ పదార్థాలు తీసుకుంటూ జాగ్రత్తలు పాటించాలని వెల్లడించారు.

# ముగ్గురు సభ్యులతో ఉన్నత స్థాయి కమిటీ

తిరుమల, మే 8, తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో జరిగినట్లుగా భావిస్తున్న అవకతవకలపై ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం విచారణను మరింత వేగవంతం చేసింది. ఈ వ్యవహారంపై గతంలో మాజీ సీఎస్ దినేష్ కుమార్ సమర్పించిన ఏకసభ్య కమిటీ నివేదికను క్షుణ్ణంగా పరిశీలించేందుకు తాజాగా ఒక ఉన్నత స్థాయి కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ వ్యవహారంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. ఈ వివాదంపై ఇప్పటికే విచారణ జరిపిన వన్ మెన్ కమిటీ సమర్పించిన నివేదికను లోతుగా విశ్లేషించేందుకు, తదుపరి చర్యల కోసం ముగ్గురు ఉన్నతాధికారులతో కూడిన హై లెవెల్ కమిటీ ని ఏర్పాటు చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలను వెలికితీసి, దోషులపై కఠిన చర్యలు తీసుకునే దిశగా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది.ప్రభుత్వం తాజాగా ఏర్పాటు చేసిన ఈ హై లెవెల్ కమిటీకి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. కమిటీలో సభ్యులుగా రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, రాష్ట్ర న్యాయ శాఖ కార్యదర్శి ఉంటారు. లడ్డూ తయారీలో వాడిన నెయ్యి నాణ్యత, టెండర్ల ప్రక్రియలో జరిగిన ఉల్లంఘనలపై ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ దినేష్ కుమార్ ఇచ్చిన నివేదికలోని ముఖ్యాంశాలను ఈ కమిటీ క్షుణ్ణంగా పరిశీలిస్తుంది.ఈ కమిటీని ఏర్పాటు చేసిన ప్రభుత్వం, విచారణను వేగవంతం చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కేవలం వారంలోకా సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని ముఖ్యమంత్రి కార్యాలయం సూచించింది. వన్ మెన్ కమిటీ నివేదిక ఆధారంగా ఎవరెవరిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి? ఏయే విభాగాల్లో లోపాలు జరిగాయి? భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎలాంటి నిబంధనలు తీసుకురావాలి? అనే అంశాలపై ఈ ఉన్నత స్థాయి కమిటీ తన సిఫార్సులు చేయనుంది.భక్తుల మనోభావాలతో ముడిపడి ఉన్న అంశం కావడంతో, ఈ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.ఈ ఉన్నత స్థాయి కమిటీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి , డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ , మరియు న్యాయ శాఖ కార్యదర్శి సభ్యులుగా వ్యవహరించనున్నారు. దినేష్ కుమార్ కమిటీ సేకరించిన ఆధారాలు, నెయ్యి సేకరణలో జరిగిన నిబంధనల ఉల్లంఘనలు, మరియు లడ్డూ నాణ్యత విషయంలో గతంలో జరిగిన పొరపాట్లపై ఈ కమిటీ లోతైన అధ్యయనం చేయనుంది. గత ప్రభుత్వ హయాంలో టీటీడీ బోర్డు తీసుకున్న నిర్ణయాలు, టెండర్ల ప్రక్రియలో జరిగిన లోపాలను ఈ కమిటీ నిశితంగా పరిశీలిస్తుందిదినేష్ కుమార్ నివేదికలోని సిఫార్సులను ఏ మేరకు అమలు చేయవచ్చు..? బాధ్యులపై ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి..? అనే అంశాలపై ఈ త్రిసభ్య కమిటీ ప్రభుత్వానికి తన నివేదికను సమర్పించనుంది. ఈ ప్రక్రియ ద్వారా తిరుమల పవిత్రతను కాపాడటంతో పాటు, దోషులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వం నిశ్చయించుకుంది. తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో వాడే ముడిపదార్థాల నాణ్యతను కాపాడటానికి శాశ్వత పరిష్కారాలను కూడా ఈ కమిటీ సూచించే అవకాశం ఉంది. ఈ హైలెవల్ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా ప్రభుత్వం మరిన్ని కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉండటంతో, ప్రస్తుతం ఈ కమిటీ నియామకం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

# పార్ట్ టైం పాలిటిక్స్ లో జగన్



విజయవాడ, మే 8, రాజకీయాలు ఒక వృత్తి. ఒక పద్ధతి ప్రకారం చేస్తేనే దానికి ఒక గుర్తింపు ఉంటుంది. అధికారానికి చేరువ కాగలం. ప్రస్తుతం వివిధ రాష్ట్రాల్లో పొలిటికల్ ట్రెండ్స్ చూస్తుంటే ఎప్పటికప్పుడు మార్పులు కనిపిస్తున్నాయి. అయితే దానిని అందుకుంటేనే అనుకున్నది సాధించగలం. విజయ్ రెండు సంవత్సరాల క్రితం పార్టీని ఏర్పాటు చేశారు. అంతకంటే ముందే మరో సీనియర్ నటుడు కమల్ హాసన్ సైతం పార్టీని ఏర్పాటు చేశారు. అయితే విజయ్ అంత దూకుడుగా వ్యవహరించలేదు. సినిమాలను పక్కనపెట్టి రాజకీయాలపైనే పూర్తిగా దృష్టిపెట్టారు విజయ్. జీవన్మరణ సమస్య అన్నట్టు పోరాటం చేశారు. అనుకున్నది సాధించగలిగారు. పశ్చిమ బెంగాల్లో బిజెపి నేతలు చేసింది కూడా అదే. ఫుల్ టైం రాజకీయాలు చేసి అక్కడ సక్సెస్ అయ్యారు. అయితే ఏపీలో ప్రతిపక్షంలో ఉన్న జగన్మోహన్ రెడ్డి అందుకు విరుద్ధంగా ఉన్నారు. ఒకసారి అధికారం చేపట్టి దానికి దూరం అయ్యారు జగన్మోహన్ రెడ్డి. అయినా సరే ఫుల్ టైం పాలిటిక్స్ చేయడం లేదు. వీకెండ్ పాలిటిక్స్ కు పరిమితం అవుతున్నారు.2019 నుంచి 2024 మధ్య టిడిపి తో పాటు జనసేన విపక్షంలో ఉంది. ఆ సమయంలో చంద్రబాబు రాజకీయాలంటే ఒక ఊపిరిగా పనిచేశారు. లోకేష్ సైతం రాజకీయాలను ఒక వృత్తిగా భావించారు. పవన్ కళ్యాణ్ సైతం రోజువారి జరిగే పరిణామాలపై కూడా స్పందించేవారు. ఆ ముగ్గురితో పోల్చుకుంటే జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు దేనిపై స్పందిస్తున్నారు. అలాంటి రాజకీయాలు చేస్తున్నారా? కనీసం ఏ అంశం పైన స్పందిస్తున్నారా? అంటే సమాధానం దొరకని పరిస్థితి. ఎంతవరకు తన పార్టీపై పగ తీర్చుకుంటున్నారు. ప్రతీకార కేసులు పెడుతున్నారు అని ఆరోపణలు చేస్తున్నారే తప్ప.. సమకాలిన అంశాలపై ఆయన స్పందించడం లేదు. జనాల్లోకి వచ్చి తిరగడం లేదు. జనాల సమస్యలను మరింత గట్టిగా అడగడం లేదు. బెంగళూరులో నాలుగు రోజులు.. తాడేపల్లిలో రెండున్నర రోజులు గడిపేసి వెళుతున్నారు. కళ్ళు మూసుకుంటే రెండేళ్లు దాటిపోయాయి. మరో మూడేళ్లు దాటి పోతే మన ప్రభుత్వం వచ్చేస్తుంది అని చెబుతున్నారు. ఫుల్ టైం రాజకీయాలు చేయకుండా పార్ట్ టైం రాజకీయాలకు పరిమితం అవుతున్నారు.ప్రస్తుతం వివిధ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలు ఓడిపోయాయి. ఇదో ట్రెండ్ నడుస్తోంది. అయితే అధికార పార్టీలు ఏదో ఈజీగా ఓడిపోలేదు. అక్కడ విపక్షాలు గట్టి ప్రయత్నాలు చేశాయి. దానిపై సత్ఫలితాలు వచ్చాయి. ఈ ట్రెండ్ను ఇలానే కొనసాగించాలి అంటే ప్రజల్లో జగన్మోహన్ రెడ్డి ఉన్నారు అని భావన కలిగించాలి. కానీ ఎందుకు ఆయన జనం మధ్యకు వచ్చేందుకు పెద్దగా ఇష్టపడడం లేదు. అన్నింటికీ 2027 పాదయాత్రను చూపిస్తున్నారు. అయితే 2017 పాదయాత్ర ఒక ఎత్తు.. ఇప్పుడు ఒక ఎత్తు. ఎందుకంటే అప్పుడు అధికారంలో అంతకు ముందు లేరు. ఇప్పుడు అధికారంలోకి వచ్చి ఐదేళ్లు పాలించారు. అందుకే పాదయాత్ర పై కూడా అంతగా నమ్మకం పెట్టుకోకూడదు. అంతకుమించి పార్ట్ టైం రాజకీయాలు చేయకూడదు. ఇక జగన్మోహన్ రెడ్డి ఇష్టం.

# కేంద్ర కేబినెట్ లో మార్పులు

విజయవాడ, మే 8, ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వచ్చాయి. భారతీయ జనతా పార్టీకి అనుకూల ఫలితాలు ఇవి. పశ్చిమ బెంగాల్ చేజిక్కడం.. అస్సాంలో రెండోసారి అధికారంలోకి రావడం భారతీయ జనతా పార్టీ దూకుడు అప్రతిహాసంగా కొనసాగుతోంది. మరోవైపు పుదుచ్చేరిలో సైతం తిరిగి ఎన్ డి ఏ గెలుపొందడం ఆ పార్టీకి మరింత ఊపు తెచ్చింది. మరోవైపు కేరళలో మూడు అసెంబ్లీ స్థానాలతో ఉనికి చాటుకుంది. తమిళనాడులో ఆ పార్టీ గెలవకపోయినా అస్తవ్యస్త వాతావరణం తనకు అనుకూలంగా మార్చుకునే పనిలో ఉంది బిజెపి. అయితే ఇదే ఊపుతో మిగతా రాష్ట్రాలపై దృష్టి పెట్టాలని చూస్తోంది భారతీయ జనతా పార్టీ. ఇప్పటికే 29 రాష్ట్రాలకు గాను.. 20 రాష్ట్రాల్లో బిజెపి అధికారంలో ఉంది. అందుకే మిగతా రాష్ట్రాలపై ఫుల్ ఫోకస్ పెడుతోంది. అందులో భాగంగా కేంద్ర క్యాబినెట్ విస్తరణ చేపట్టి.. అన్ని రాష్ట్రాలకు సమప్రా ధాన్యం ఇవ్వాలని చూస్తోంది. ఏపీ నుంచి ఇద్దరికీ మంత్రి పదవులు ఖాయమన్న టాక్ నడుస్తోంది.ప్రస్తుతం ఏపీ నుంచి కేంద్ర మంత్రివర్గంలో ముగ్గురు ఉన్నారు. క్యాబినెట్ హోదాలో కింజరాపు రామ్మోహన్ నాయుడు ఉన్నారు. స్వతంత్ర హోదాలో గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. సహాయ మంత్రిగా బిజెపి ఎంపీ భూపతి రాజు శ్రీనివాస వర్మ కొనసాగుతున్నారు. ఎన్డీఏకు 21 మంది ఎంపీలు ఉండగా.. అందులో ముగ్గురికి కేంద్ర మంత్రి పదవులు ఉన్నాయి.. ఇంకా 18 మంది ఎంపీలు ఉన్నారు. అయితే ఇప్పుడు రెండు మంత్రి పదవులు ఇస్తే ఏ పార్టీకి కేటాయిస్తారు అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే టిడిపి తో పాటు బిజెపికి రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రివర్గంలో ప్రాతినిధ్యం ఉంది. ఇప్పుడు లేనిది ఒక్క జనసేనకు మాత్రమే.ఈసారి కచ్చితంగా కేంద్రమంత్రివర్గంలోకి జనసేన వెళ్లడం ఖాయమని తెలుస్తోంది. ప్రస్తుతం జనసేనకు ఇద్దరు ఎంపీలు ఉన్నారు. కాకినాడ నుంచి తంగేళ్ల ఉదయ శ్రీనివాస్, మచిలీపట్నం నుంచి వల్లభనేని బాలసౌరి ఉన్నారు. ఆ ఇద్దరిలో ఒకరికి మంత్రి పదవి ఖాయమని ప్రచారం సాగుతోంది. బాలశౌరి కాపు సామాజిక వర్గానికి చెందిన నేత. గతంలో రెండు సార్లు ఎంపీగా కూడా ఎన్నికయ్యారు. ఆయనకు తప్పకుండా కేంద్ర క్యాబినెట్లో చోటు దక్కుతుంది అన్న టాక్ నడుస్తోంది. మరోసారి బిజెపికి ఛాన్స్ ఇస్తే మాత్రం దగ్గుబాటి పురందేశ్వరికి బెర్త్ లభించే అవకాశం ఉంది. సీఎం రమేష్ కూడా ఒక ఆశావహుడిగా ఉన్నారు. టిడిపికి ఇస్తే మాత్రం రాయలసీమ నుంచి.. రెడ్డి సామాజిక వర్గ పరంగా, మహిళా నేతపరంగా నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి కి ఛాన్స్ ఇస్తారని తెలుస్తోంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# జనసేన ఒంటరి పోరు...

కాకినాడ, మే 8, ప్రస్తుతం సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున జరుగుతున్న ప్రచారం.. తమిళనాడులో విజయ్‌పార్టీ టీవీకే ఒంటరిగా నిలిచి సత్తా చాటిందని.. ఏపీలో మాత్రం జనసేన ఒంటరిగా పోటీ చేసేందుకు వెనుకంజ వేస్తోందని!. దీనిలో వాస్తవం లేకపోలేదు. 2019 ఎన్నికల్లో జనసేన దాదాపు ఒంటరిగానే బరిలో నిలిచింది. కమ్యూనిస్టులు, బీఎస్పీ వంటి వాటితో పొత్తు పెట్టుకున్నా.. అవి పెద్దగా లెక్కలోకిరాలేదు. ఒకరకంగా జనసేన ఒంటరి పోరాటమే చేసింది. కానీ, ఫలితం దక్కలేదు. . గ్రీన్ కార్డ్ కష్టాలతో అమెరికా వీడుతున్న భారతీయ దంపతులు దీంతోనే 2024లో పట్టుబట్టి టీడీపీ+ బీజేపీలను ఒకే వేదికపైకి చేర్చి జనసేన పోటీ చేసింది. తద్వారా తాను లబ్ధిపొంది.. ప్రభుత్వం ఏర్పాటు చేసే పరిస్థితి వచ్చింది. ఇదే ఫార్ములాను వచ్చే 15 సంవత్సరాలు కూడా అమలు చేయాలన్నది జనసేన వ్యూహం. కానీ, ప్రత్యర్థులు.. అదేసమయంలో రాజకీయ విశ్లేషకులు మాత్రం జనసేన ఒంటరిగా ఎందుకు పోటీ చేయదంటూ.. మళ్లీ ప్రశ్నిస్తున్నారు. దీనికి విజయ్‌ను ఉదాహరణగా చూపిస్తున్నారు. ఈ నేపథ్యంలో జనసేన ఒంటరిగా పోటీచేస్తే.. ఎవరికి లాభం.. ఎవరికి నష్టం అనే ప్రశ్నలు తెరమీదికి వస్తున్నాయి. ఈ దఫా జనసేన ఒంటరిగా పోటీచేస్తే.. ఆ పార్టీకి ఖచ్చితమైన లాభం ఉంటుందన్న అంచనాలు వస్తున్నాయి. 2019లో లెక్కవేరు.. ప్రస్తుత లెక్క వేరని పరిశీలకులు చెబుతున్నారు. గత రెండేళ్ల కాలంలో పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా.. ఇతర శాఖ లమంత్రిగా చేస్తున్న పనులు, రాజకీయంగా పార్టీలో కొన్ని ఒడిదుడుకులు వచ్చినా.. ఆయన పాటిస్తున్న సంయమనం వంటివి సాధారణ ప్రజలను కూడా మంత్రముగ్ధులను చేస్తున్నాయి. ఇక, అభివృద్ధిపరంగా కూడా.. పంచాయతీలను డెవలప్ చేస్తున్నారుఅంటే.. 2019 ఎన్నికల సమయంలో పవన్‌పై ఉన్న ఇమేజ్‌కు భిన్నంగా ఇప్పుడు పాలన పరంగా ఆయన ఇమేజ్ పెరిగిందన్న వాదన వినిపిస్తోంది. దీనికితోడు.. జనసేనలో క్షేత్రస్థాయి ఎమ్మెల్యే ల పరిస్థితి ఎలా ఉన్నప్పటికీ.. పార్టీ అధినేతగా పవన్‌కు ఎలాంటి మచ్చలు మరకలు లేవు. పైగా.. గ్రామీణ, గిరిజన, ఎస్సీ సామాజికవ ర్గాలకు ఆయన మరింత చేరువ అయ్యారు. పట్టణాలు, నగరాల్లోనూ 'ఫీల్ గుడ్ లీడర్'గా చూస్తున్నారు. ఈ పరిణామాలతో జనసేన కనుక ఒంటరిగా పోటీ చేసినా.. ఆ పార్టీకి లాభం చేకూరుతుందని మెజారిటీ విశ్లేషకులు

# సైలెంట్ గా కేతిరెడ్డి....

అనంతపురం, మే 8, ఏపీ వైసీపీలో ఆ లీడర్ స్టైలే వేరు. ఎడ్యుకేటేడ్. వాస్తవాలకు దగ్గరగా..ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడే మనస్తత్వం ఉన్న ఆయన..గత ఎన్నికల్లో ఓటమి తర్వాత కొన్నాళ్లు మౌనంగా ఉండిపోయారు. ఆ తర్వాత తెరమీదకు వచ్చి ప్రెస్‌మీట్లు, ఫీల్డ్‌లో ఆందోళనలు, కూటమి సర్కార్‌పై అటాక్ చేస్తూ లైమ్‌లైట్‌లో కొనసాగారు. ఇప్పుడేమైందో ఏమో తెలియదు కానీ మళ్లీ సైలెంట్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. గుడ్ మార్నింగ్ ధర్మవరం పేరుతో ఎప్పుడూ ప్రజల్లో ఉండే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి మళ్లీ సైలెంట్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. రాజకీయ ప్రత్యర్థులపై విరుచుకుపడే కేతిరెడ్డి..ఎన్నికల ఫలితాల తర్వాత కొన్నాళ్లు మౌనంగా ఉండిపోయారు. ఈ మధ్యకాలంలో ఫుల్ యాక్టివ్ అయ్యారు. ప్రెస్‌మీట్లు, ఆందోళనలు, క్యాడర్‌తో మీటింగ్‌లు పెట్టి లైమ్‌లైట్‌లో కనిపించారు. ఇప్పుడు మళ్లీ కేతిరెడ్డి ఎక్కడా కనిపించట్లేదన్న టాక్ వినిపిస్తోంది. అయితే ఆయన మళ్లీ సైలెంట్ కావడానికి వైసీపీలో నాయకుల మధ్య ఉన్న విభేదాలే కారణమా లేక మరేదైనా రీజన్ ఉందా.? అనే చర్చ మొదలైంది.రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మధ్య వైరం నడుస్తోందట. ధర్మవరంలో రాప్తాడు నియోజకవర్గం వైసీపీ పార్టీ ప్రారంభిస్తానని ప్రకాష్ రెడ్డి స్టేట్‌మెంట్ ఇవ్వడంతో ఇద్దరి మధ్య కోల్డ్ వార్ స్టార్ట్ అయిందట. పార్టీ అధికారంలో ఉన్నప్పటి నుంచే తోపుదుర్తి, కేతిరెడ్డి మధ్య గ్యాప్ కొనసాగుతుందని వైసీపీ కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. ఇక ధర్మవరంలో పార్టీ ఆఫీస్‌ను పెడుతానంటూ తోపుదుర్తి ప్రకటించడంతో కేతిరెడ్డి కౌంటర్ ఇచ్చారు. ధర్మవరంలో ఆఫీస్ పెట్టడం ఎందుకు..ఫోన్ ఎత్తి సమాధానం చెప్తే సరిపోతుంది కదా అంటూ సెటైర్ వేశారు. ముందుగా రాప్తాడులో పార్టీ ఆఫీస్ పెట్టుకోమనంటూ అంటూ కేతిరెడ్డి గట్టిగానే సమాధానం ఇచ్చారు.అయితే కేతిరెడ్డిపై పైచేయి సాధించే ఉద్దేశంతో ఎలాగైనా ధర్మవరం వైసీపీకి కొత్త నాయకుడిని తేవాలని తోపుదుర్తి ఇంటర్నల్‌గా గట్టి ప్రయత్నాలే చేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. కేతిరెడ్డి ప్రత్యర్థి అయిన అంగబలం, అండ బలం ఉన్న ఓ మాజీ ఎమ్మెల్యేను వైసీపీలోకి తీసుకొచ్చేందుకు ప్రకాష్ రెడ్డి శతవిధాల ప్రయత్నాలు చేస్తున్నట్లు టాక్. అయితే ధర్మవరంలో కేతిరెడ్డిని కాదని వైసీపీ అధిస్టానం మరొకరికి అవకాశం ఇస్తుందా? అంతటి సాహసం చేస్తుందా అనేది చర్చనీయాంశంగా మారింది.కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డికి వైసీపీ అధిష్టానంతో మంచి సంబంధాలే ఉన్నాయట. కేతిరెడ్డి దూకుడు, ప్రత్యర్థులపై విరుచుకుపడే తత్వం చూసిన అధిష్టానం శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడిగా నియమించాలని చూసిందట. కానీ సామాజిక సమీకరణాల నేపథ్యంలో బీసీలకు కేటాయించినట్లు చెబుతున్నారు. ధర్మవరం నియోజక వర్గం నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి వైసీపీలో తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్నారు. గత ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత ఆయన పార్టీ మారతారని గుసగుసలు వినిపించాయి.రాజకీయాలలో గెలుపోటములు సహజం అంతమాత్రాన కన్నతల్లి లాంటి పార్టీని వీడుతామా అంటూ..తాను వైసీపీ అధినేత జగన్ వెంటే ఉంటానని ప్రచారానికి ఫులిస్టాప్ పెట్టారు కేతిరెడ్డి. వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తుంది అప్పుడు 2.వాలో తామేంటో చూపిస్తామంటూ వైసీపీ క్యాడర్‌లో ఉత్తేజాన్ని నింపే ప్రయత్నం చేశారు. అయితే కేతిరెడ్డి ఎప్పుడు ఫుల్ యాక్టివ్ మోడ్‌లోకి వస్తారోనని ఎదురు చూస్తోంది ధర్మవరం వైసీపీ క్యాడర్.ఉమ్మడి అనంతపురం జిల్లా వైసీపీలో ప్రకాశ్ రెడ్డి వర్సెస్ కేతిరెడ్డి మధ్య 2019 నుంచి కోల్డ్ వార్ నడుస్తోందట. అప్పట్లో మంత్రి పదవి విషయంలో ఇద్దరి మధ్య కాస్త డిఫరెన్సెస్ వచ్చాయట. వైసీపీ హయాంలో జిల్లాలో కురుమ సామాజిక వర్గానికి మంత్రి పదవి రావడానికి, రెడ్డి సామాజిక వర్గానికి అమాత్యయోగం దక్కకపోవడానికి కేతిరెడ్డే కారణమని అని తోపుదుర్తి కినుక వహించారట. దీంతో అప్పటి నుంచి ఇద్దరి మధ్య గ్యాప్ నడుస్తోందట. అదీకాక ధర్మవరం వైసీపీ టికెట్‌ను గోరంట్ల మాధవ్‌కు ఇప్పించాలని తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి కాస్త గట్టిగానే ట్రై చేశారట. ఈ ఇష్యూతో కేతిరెడ్డి, ప్రకాశ్‌రెడ్డి మధ్య గ్యాప్ మరింత పెరిగిందట. ఓ వైపు పార్టీ ఓడిపోయి ప్రతిపక్షంలో ఉండగా..నేతల గొడవతో తమను ముందుండి నడిపించే నాయకులు లేరని..క్యాడర్ ఆందోళన చెందుతోందట. ఇప్పటికైనా కేతిరెడ్డి యాక్టివ్ మోడ్‌లోకి వచ్చి..ధర్మవరం పార్టీ యాక్టివిటీని స్పీడప్ చేయాలని రిక్వెస్ట్ చేస్తున్నారట

# 72 నియోజకవర్గాల్లోనే టీడీపికి పాజిటివ్

గుంటూరు, మే 8, ఏపీ అధికార పార్టీ టీడీపీలో 'చేసుకున్న వారికి చేసుకున్నంత' అనే మాట వినిపిస్తోంది. కొందరు ఎమ్మె ల్యేలు.. పనితీరులో ముందుంటే.. మరికొందరు వెనుకబడుతున్నారు. ముందున్న నాయకులు.. తమకు అంతాబాగుందని చెబుతున్నారు. వెనుకబడుతున్నవారు.. నెపాన్ని సర్కారుపైనో.. అధికారులపైనో నెట్టేస్తున్నారు. దీంతో ఇటీవల క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాలపై పార్టీ ఆరా తీసింది. అసలు ఏం జరుగుతోందో తెలుసుకుంది. 135 నియోజకవర్గాల్లో టీడీపీ విజయం దక్కించుకుంది. 72 నియోజకవర్గాలలో పరిస్థితి బాగుందని పార్టీకి రిపోర్టులు వస్తున్నాయి. మరి మిగిలిన నియోజకవర్గాల పరిస్థితి ఏంటి? అనేది ప్రశ్న. ఇదే అసలు సర్వేకు కారణమైంది. నియోజకవర్గాల అభివృద్ధి విషయంలో నాయకులు దూకుడుగా వ్యవహరిస్తున్నవి.. 72 చోట్ల మాత్రమేనని అర్థమైంది. ఇక్కడ ప్రజలకు చేరువగా ఉండడమే కాకుండా కేంద్రం అందిస్తున్న పలు పథకాలను సద్వినియోగం చేసుకుంటున్నారు.తద్వారా రాష్ట్ర ప్రభుత్వంపై ఆధారపడకుండా.. నిధులు సమకూర్చుకుంటున్నారు. ఇలాంటి వాటిలో అనంతపురంలో మూడు నియోజకవర్గాలు.. చిత్తూరులో నాలుగు.. నెల్లూరు 3 ఇలా.. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల వారీగా నియోజకవర్గాల లెక్క తేలింది. వీటిలో ఎంపీలతో సమన్వయం అవుతున్న ఎమ్మెల్యేలు.. వారికి సహకరిస్తున్న ఎంపీలు ఉన్న నియోజకవర్గాల్లో పరిస్థితి ఆశాజనకంగానేఉంది. కానీ, ఎమ్మెల్యేలు వర్సెస్ ఎంపీల మధ్య వివాదాలు ఉన్న నియోజకవర్గాల్లో ఇబ్బందులు పడుతున్నారు.ఈ క్రమంలోనే ఆయా నియోజకవర్గాలు వెనుకబడుతున్నాయని పార్టీ గుర్తించింది. దీంతో ఎమ్మెల్యేలు-ఎంపీల మధ్య సమన్వయం కోసం.. పార్టీ కమిటీలను ఏర్పాటు చేయనుంది. దీనికి సంబంధించి కార్యాచరణ కూడా పూర్తయింది. ఒక్కొక్క ఎమ్మెల్యే ఒక్క తరహా రాజకీయం చేస్తుండడాన్ని పార్టీ తీవ్రంగా పరిగణిస్తోంది. చేసుకునేందుకు.. చేసేందుకు కూడా అవకాశం ఉండి కూడా.. ఎమ్మెల్యేలు దూరంగా ఉన్నవారిని గుర్తించి.. వారి విషయంలో కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. ఈ విషయంలో గుంటూరు, కృష్ణా, పశ్చిమ, తూర్పు గోదావరి, విజయనగరం జిల్లాలుముందు వరుసలో ఉన్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# ఏలూరు జిల్లాలో దారుణం.

## అక్రమ సంబంధానికి అడ్డు వస్తున్నాదని 12 లక్షలు సుపారి ఇచ్చి భర్తను హత్య చేయించిన భార్య

ఏలూరు జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. అక్రమ సంబంధానికి అడ్డు వస్తున్నాదని 12 లక్షలు సుపారి ఇచ్చి భర్తను అతి కిరాతకంగా హత్య చేయించింది భార్య. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఏలూరు జిల్లా కార్యాలయంలో ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ వెల్లడించారు. ఆగిరిపల్లి మండలం, వడ్లమాను గ్రామానికి చెందిన రెడ్డి సలోమన్ రాజు, రెడ్డి దుర్గామణి భార్యాభర్తలు. గత మూడు సంవత్సరాలుగా వడ్లమాను సచివాలయంలో పనిచేసిన పలగాని వెంకన్నబాబుతో అక్రమ సంబంధం పెట్టుకుంది. సదరు విషయం భర్త రెడ్డి సులోమన్ రాజు తెలియడంతో తన భార్యను తరచూ వేధిస్తూ, కొట్టేవాడు. దీంతో దుర్గామణి తన భర్తను అడ్డు తొలగించుకునేందుకు ప్రియుడు వెంకన్నబాబుతో మాట్లాడి సుమారు రూ.12 లక్షల రూపాయలు సాయి శ్రీనివాస్, జస్వంత్ రాయ్ లతో మాట్లాడి సుపారీ ఇచ్చి సాల్మన్ రాజును హత్య చేయించేందుకు ప్లాన్ చేశారు. గత నెల 17వ తేదీ రాత్రి సులేమాన్ రాజును కారులో ఎక్కించుకుని కొండపావులూరు సమీపంలోని జగనన్న ఇళ్ల సముదాయం వద్ద ఎన్డీఆర్ఎఫ్ గేటు దగ్గరకు తీసుకెళ్లారు. అక్కడ సులేమాన్ మెడకు చార్జింగ్ వైరు బిగించి హత్య చేశారు. మృతదేహాన్ని అక్కడే పడేసి, కారులో పరారయ్యారు. ఆగిరిపల్లి పోలీసుల విచారణలో అసలు విషయం బయటపడిందని ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ తెలిపారు. ఈ కేసులో భార్య తో పాటు నలుగురు ముద్దాయిలను కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేసిన పోలీసులు నిందితులైన కలతోటి సాయిశ్రీనివాస్, మద్దాలి జశ్వంత్‌రాయ్, కలతోటి మణికంఠ, పలగాని వెంకన్నబాబు, రెడ్డి దుర్గామణిలను గన్నవరం వద్ద గురువారం అరెస్టు చేశారు.

కారు, 5 సెల్‌ఫోన్లు, 5 బీరు సీసాలు, సెల్‌ఫోన్ పవర్ బ్యాంక్ చార్జింగ్ కేబుల్ వైరు, రూ.75 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు

## మొక్కజొన్న రైతుల కష్టాలు ఇంతింతకాదయా..

## వేధిస్తున్న గన్ని సంచుల కొరత

మహబూబ్ నగర్, మే 8,రోజుల తరబడి ధాన్యం విక్రయానికి రైతులు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఆరుగాలం కష్టించి పండించి న మొక్కజొన్న పంటను అమ్ముకునేందుకు రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నాగర్ కర్నూల్ జిల్లాలో ఎన్నడూ లేని విధంగా ఈసారి మొక్కజొన్న సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగినప్పటికీ, అందుకు అనుగుణంగా అధికారులు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.మార్క్ఫెడ్ ద్వారా పీఏసీఎస్ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోళ్లు ప్రారంభించినప్పటికీ గన్ని సంచుల కొరత, కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిల్వ చేసేందుకు సరిపడ గోదాములు లేకపోవడంతో కొనుగోలు ప్రక్రియ లో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ. 2400 రైతులకు పూర్తిస్థాయిలో అందడం లేదు.హమాలీ, రవాణా ఖర్చులు అధికంగా ఉండటంతో పాటు సకాలంలో దిగుమతులు జరగక రైతులు మరింత ఇబ్బందులు పడుతున్నారు.దీంతో అనేక మంది రైతులు ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరలకు మొక్కజొన్న విక్రయిస్తున్నారు. మరికొందరు రూ.25 నుంచి రూ.30 వరకు చెల్లించి బయట గన్ని బ్యాగులను కొనుగోలు చేస్తున్నారు , ధాన్యం నింపినచోట అమాలికి బస్తాకు రూ 25లు, దిగుమతి వద్ద కూడా ఒక్కో బస్తాకు అదనంగా రూ.5 వసూలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఒక క్వింటాల్కు సుమారు రూ.200 నుంచి రూ.300 వరకు అదనపు భారం పడుతోందని తెలిపారు.మండలానికి ఒకే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడంతో రైతులు అధికారులు సూచించిన గోదాములకు ధాన్యం తరలించాల్సి వస్తోంది.అక్కడ దిగుమతికి నాలుగు నుంచి ఐదు రోజుల సమయం పడుతుండటంతో రవాణా ఖర్చులు మూడింతలు అవుతున్నాయని రైతులు వాపోతున్నారు. రాత్రింబవళ్లు రోడ్లపైనే గడుపుతున్నప్పటికీ, గోదాముల్లో స్థలం లేదంటూ ఒకచోటు నుంచి మరొకచోటుకు పంపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్కడికి వెళ్లాక మళ్లీ వరుసలో నిలబడాల్సి రావడంతో మరింత సమయం వృథా అవుతోంది. ఒక ట్రాక్టర్ ధాన్యం దిగుమతికి సుమారు వారం రోజుల సమయం పడుతోందని రైతులు చెబుతున్నారు.దీంతో అద్దె ట్రాక్టర్లపై ధాన్యం తీసుకువచ్చిన రైతులు కిరాయిలు చెల్లించలేక సతమతమవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులకు సమీపంలోని గోదాములకే ధాన్యం తరలించేలా చర్యలు తీసుకోవాలని, గన్ని సంచులు సకాలంలో అందించి రైతులపై పడుతున్న అదనపు ఆర్థిక భారాన్ని తగ్గించాలని కోరుతున్నారు.

# మెజార్టీ లేనప్పుడు ఏం చేయాలి

చెన్నై, మే 8, తమిళనాడు ఎన్నికల ఫలితాలలో టీవీకే అత్యధిక స్థానాలు సాధించింది. కానీ, గవర్నర్ విజయ్ ని ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించలేదు.. మెజారిటీ కి సరిపడా ఎమ్మెల్యేల మొదట తీసుకొని రావాలని గవర్నర్ రాజేంద్ర అర్లేకర్ సూచించారు. దీనిపై అనేక రకాలుగా విమర్శలు వస్తున్నాయి.. గవర్నర్ తీసుకున్న నిర్ణయం పట్ల కొంతమంది విశ్లేషకులు మరో విధంగా చెబుతున్నారు. గవర్నర్ ముందు జాగ్రత్త తీసుకున్నారని అంటున్నారు.మనదేశంలో గతంలో అనేక రాష్ట్రాలలో గవర్నర్ల సూచన మేరకు కొన్ని ప్రభుత్వాలు హడావిడిగా ఏర్పాటయ్యాయి. విశ్వాస పరీక్ష ఎదుర్కోవడంలో విఫలమయ్యాయి. 1996లో కేంద్రంలో వాజ్ పేయి ప్రభుత్వం 13 రోజులు మాత్రమే ఉంది. అలాంటి ఘటనలు దేశానికి మంచివి కావని భావించి.. ప్రభుత్వాల ఏర్పాట్లు గవర్నర్లు సరైన విధానంలో వ్యవహరించాలని సుప్రీంకోర్టు మార్గదర్శకాలు జారీ చేసింది. "ఎస్ఆర్ బొమ్మై" కేసులో మనదేశ సర్వోన్నత న్యాయస్థానం అనేక మార్గదర్శకాలు జారీ చేసింది.. అప్పట్లో సర్కారియా, పూంచి కమిషన్లు అనేక సూచనలు చేశారు. నాడు సుప్రీంకోర్టు వాటిని సమర్థించింది కూడా.

×××సుప్రీంకోర్టు సమర్థించిన సర్కారియా, పూంచి కమిషన్లు ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం ప్రభుత్వాల ఏర్పాటు విషయంలో గవర్నర్లు ప్రాధాన్యతను పాటించాల్సి ఉంటుంది. ఎక్కువ స్థానాలకు వచ్చిన కూటమికి ముందుగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని పిలవాలి.. ఒకవేళ ముందుగా ఏర్పడిన కూటమికి మెజారిటీ రాకపోతే.. ఎక్కువ సీట్లు గెలిచిన పార్టీని ప్రభుత్వ ఏర్పాటుకు పిలవాలి. ఒకవేళ అనేక పార్టీలు కూటమిగా ఏర్పడి.. మెజార్టీ ఉందని చూపిస్తే.. వాళ్లను ప్రభుత్వ ఏర్పాటుకు పిలవవచ్చు.

×××ఒకవేళ ప్రభుత్వంలో భాగంగాక పోయినప్పటికీ.. బయటనుంచి మద్దతు పలికే పార్టీలతో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉంటే దానిని పరిశీలించవచ్చు.

×××ఒకవేళ ఏ పార్టీ కూడా మెజారిటీ అందుకోలేని పక్షంలో.. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం లేనప్పుడు.. గవర్నర్ రాజ్యాంగం 356 ప్రకారం రాష్ట్రపతి పరిపాలనకు సిఫారసు చేసేందుకు అవకాశం ఉంటుంది.

×××సపోర్ట్ చేస్తున్న పార్టీల నుంచి ఎమ్మెల్యేల సంతకాలు చేసిన లేఖలను గవర్నర్ తీసుకోవాలని.. ఆయన స్వయంగా ధ్రువీకరించుకోవాలని పూంచి కమిషన్ స్పష్టంగా చెప్పింది. అయితే సుప్రీంకోర్టు ఈ విషయంలో ఎటువంటి వ్యాఖ్యలు చేయలేదు.

×××ఎక్కువ సీట్లు సాధించిన పార్టీని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు.. అప్పటికే అధికారంలో ఉన్న ప్రభుత్వానికి సంబంధించిన మెజారిటీ.. ఈ అంశాల మీద ఎట్టి పరిస్థితుల్లో రాజ్ భవన్ లో నిర్ణయాలు సాధ్యం కావని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. బొమ్మై కేసులో సుప్రీంకోర్టు ఈ తీర్పునిచ్చింది. కేవలం అసెంబ్లీలో మాత్రమే పార్టీలుబలనిరూపణ చేసుకోవాలని సూచించింది. గవర్నర్ ఒక నిర్ణయానికి రావడానికి అంటే ముందు ఎమ్మెల్యే సంతకాలు పరిగణలోకి తీసుకోవద్దని.. అసెంబ్లీలో ఓటింగ్ ను మాత్రమే చూడాలని సూచించింది. కర్ణాటకలో బొమ్మై ప్రభుత్వాన్ని నాటి గవర్నర్ వెంకటసుబ్బయ్య.. మెజారిటీ లేదని రద్దు చేశారు. ఆ కేసు సుప్రీంకోర్టు దాకా వెళ్ళింది. కేసును విచారించిన సుప్రీంకోర్టు పై అంశాలను పేర్కొంది.

# జాతీయ గీతానికి రక్షణ ఉందని తెలుసా

హైదరాబాద్, మే 8, వందేమాతరం 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేంద్రం పూర్తి గేయం పాడాలని ఇటీవల చట్టం చేసింది. తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. వందేమాతరాన్ని జాతీయ గీతంతో సమానంగా గౌరవించాలని ఆదేశాలు జారీ చేసింది. ఉద్దేశపూర్వక అవమానం, ఆటంకం, లేదా అడ్డంకి కలిగించే వారిని జైలుకు పంపాలని పేర్కొంది.ఇప్పటి వరకు 1971 నాటి చట్టం ప్రధానంగా జనగణమన, జాతీయ జెండా, రాజ్యాంగ గౌరవానికే రక్షణ కల్పిస్తోంది. కొత్త ప్రతిపాదన ద్వారా వందేమాతరానికీ అదే న్యాయస్థాయి వర్తింపజేయాలని కేంద్రం భావిస్తోంది. ఇది చట్టపరంగా జాతీయ గీతం, జాతీయ గేయం" మధ్య ఉన్న రక్షణ తేడాను తొలగించింది.వందేమాతరాన్ని అవమానించే లేదా పాడటాన్ని అడ్డుకునే వారికి గరిష్ఠంగా మూడేళ్ల జైలు, జరిమానా, లేదా రెండూ విధించే అవకాశం ఉంటుంది. ఈమేరకు కేంద్రం చట్టపరమైన రక్షణ కల్పించింది. ఇది ప్రతి సందర్భానికీ తక్షణ శిక్ష అన్న అర్థం కాదు. ఉద్దేశం, పరిస్థితి, చర్య తీవ్రత వంటి అంశాలను కోర్టు పరిశీలించే అవకాశం ఉంటుంది. అందువల్ల ఇది భావోద్వేగ ప్రతిస్పందన కంటే న్యాయపరమైన ప్రక్రియకు లోబడి పనిచేసే చట్టమే.ఈ నిర్ణయానికి సాంస్కృతిక కోణం ఎంత ఉందో, రాజకీయ సంకేతమూ అంతే ఉంది. వందేమాతరానికి ఉన్న చారిత్రక గుర్తింపును మరింత బలపరచడం ద్వారా, జాతీయతా భావనను కేంద్రం ముందుకు తెస్తోంది. అదే సమయంలో, ఈ అంశం దేశవ్యాప్తంగా భావోద్వేగ స్పందనలను రేకెత్తించే అవకాశం కూడా ఉంది.ఇలాంటి చట్టం దేశభక్తి చిహ్నాలపై గౌరవాన్ని పెంచుతుందని మద్దతుదారులు వాదించవచ్చు. కానీ మరోవైపు, గౌరవం చట్టబద్ధ శిక్షలతో ఎంతవరకు నిలుస్తుందన్న ప్రశ్న కూడా సహజమే. గీతాన్ని లేదా గేయాన్ని గౌరవించడం సామాజిక నైతికత నుంచి రావాలి. చట్టం దానికి తోడ్పడగలదు కానీ పూర్తి ప్రత్యామ్నాయం కాకపోవచ్చు.మొత్తంగా చూస్తే, వందేమాతరానికి రక్షణ కల్పించాలన్న కేంద్ర నిర్ణయం ఒక సాంస్కతిక?చట్టపరమైన ప్రకటన. దేశ గౌరవ చిహ్నాల పట్ల నియమబద్ధమైన గౌరవం ఉండాలన్న సందేశం ఇందులో ఉంది. అయితే ఈ సవరణ ఎంత దూరం అమలవుతుందో, పార్లమెంటులో ఆమోదం తర్వాత దాని పరిధి ఎలా రూపుదిద్దుకుంటుందో చూడాలి.

# హుందాగా వ్యవహరిస్తున్న స్టాలిన్



చెన్నై, మే 8, రాజకీయ నాయకుల పరిస్థితి ఎలా ఉందంటే.. అధికారాన్ని దక్కించుకుంటేనేమో వారు గొప్ప నాయకులు. ఒకవేళ అధికారాన్ని కోల్పోతే మాత్రం ఈవీఎం లో అవకతవకలు.. గెలిచిన వారేమో తమను తాము గొప్పగా చెప్పుకుంటుంటే.. ఓడిపోయిన వారు తమ తప్పులను కాకుండా.. అదంతా ఈవీఎం ల మాయ అనే విమర్శలు చేస్తున్నారు. ఈవీఎంల ద్వారా గెలిచి.. ప్రజాస్వామ్యాన్ని నాశనం చేశారని ఆరోపిస్తున్నారు. వారు గెలిసినప్పుడు మాత్రం ఈ మాట మాట్లాడటం లేదు.ఆ మధ్య ఏపీలో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు జరిగాయి. వైసిపి దారుణంగా ఓడిపోయింది. 11 స్థానాలకు మాత్రమే పరిమితం అయిపోయింది. అయితే ప్రజల్లో ఉన్న ఆగ్రహాన్ని అంచనా వేయలేక వైసీపీ దారుణమైన ఓటమిని మూటకటుకుంది. ఈ విషయాన్ని చెప్పలేక వైసీపీ నాయకులు తామ ఓడిపోయిన నెపాన్ని ఈ వియంల నెట్టడం మొదలుపెట్టారు. అంతేకాదు ఓట్ల నమోదుకు.. చివరి క్షణంలో ఎన్నికల సంఘం ఇచ్చిన లెక్కకు పోలిక సరిపోడం లేదని సరికొత్త ఆరోపణ తెరపైకి తీసుకొచ్చారు. వాస్తవానికి ఈవీఎం యంత్రాలను ఎవరూ హ్యాక్ చేయలేరు అనే విషయం అందరికీ తెలుసు కానీ ప్రజల్లో సానుభూతి పొందడానికి ఈ తరహా ప్రచారానికి వైసిపి శ్రీకారం చుట్టడం విశేషం.వైసిపి మాదిరిగానే పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమత బెనర్జీ కూడా ఈ తరహా ప్రచారాన్ని మొదలుపెట్టారు. ఎన్నికల్లో బిజెపి లూటీ చేసి గెలిచిందని ఆరోపించడం ప్రారంభించారు.. కేరళలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో కూటమి గెలిస్తే దాని గురించి మాట్లాడటం లేదు. అస్సాం, పశ్చిమబెంగాల్ లో బిజెపి గెలిస్తే మాత్రం మమత బెనర్జీ ఈ తరహా వ్యాఖ్యలు చేస్తున్నారు. చివకి తమిళనాడులో ఏ పార్టీకి కూడా సరైన మెజారిటీ రాకపోయిన విషయాన్ని కూడా ఆమె గుర్తించడం లేదు. చివరికి తమిళనాడులో బిజెపి ఒకే ఒక ఎమ్మెల్యే స్థానంతో సరిపెట్టుకున్నప్పటికీ ఆమెకు అది కనిపించడం లేదు. పైగా రాహుల్ గాంధీ లాంటి నాయకులు మమతను సపోర్ట్ చేస్తున్నారు. అఖిలేష్ యాదవ్ లాంటి మాజీ ముఖ్యమంత్రి మమతకు జై కొడుతున్నారు. అసలు ఇటువంటి నాయకులను ఏమనాలో అర్థం కావడం లేదు.మరోవైపు ఇండియా కూటమిలోనే ఉన్న డీఎంకే మాత్రం తమిళనాడు ఎన్నికల విషయంలో సరికొత్తగా స్పందించింది.. ముఖ్యంగా డీఎంకే అధినేత స్టాలిన్ హుందాగా మాట్లాడారు.. ఆయన మాట్లాడిన మాటలు చాలామంది నాయకులకు గడ్డి పెట్టే విధంగా ఉన్నాయి.. "నేను గెలిచింది ఈవీఎంల మీదనే.. ఓడిపోయింది కూడా ఈవీఎంల మీదనే.. గెలిచాక నా సత్తా వల్లా అని.. ఓడిపోయిన తర్వాత ఈవీఎంలు హ్యాక్ అయ్యాయని అదంతా దద్దమ్మని కాదు. ప్రజల తీర్పు గౌరవించడం రానివాళ్లే అలా మాట్లాడతారు" అని స్టాలిన్ వ్యాఖ్యానించారు. స్టాలిన్ మాట్లాడిన మాటలు ప్రస్తుతం సోషల్ మీడియాలో సంచలనం కలిగిస్తున్నాయి. ఈ వ్యాఖ్యలను టిడిపి నేతలు ప్రముఖంగా ప్రస్తావిస్తున్నారు. ఈవీఎంల మీద మాట్లాడే నాయకులకు స్టాలిన్ గడ్డపార స్థాయిలో రాడ్డు దింపారని వ్యాఖ్యానిస్తున్నారు.

# యువతి ఇంటి ముందు ఆందోళన చేస్తున్న యావన్ కుటుంబసభ్యులు



హైదరాబాద్ ప్రేమించిన పాపానికి సికింద్రాబాద్లో యువకుడిని యువతి బంధువులు దారుణంగా హతమార్చారు. దాంతో యువతి ఇంటి ముందు యువకుడి కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ యువకుడి కుటుంబ సభ్యుల నిరసనకు దిగారు.

యావన్ (23) జవహర్నగర్ ప్రాంతంలో నివాసం ఉంటూ నాలుగేళ్లుగా సీతాఫల్మండి ప్రాంతానికి చెందిన యువతిని ప్రేమిస్తున్నారు. ఈ విషయం తెలిసిన యువతి తల్లిదండ్రులు ఎన్నిసార్లు హెచ్చరించినా వినకుండా, సీతాఫల్మండి ప్రాంతంలో ఉండే తన స్నేహితుడి ఇంట్లో ఉంటూ తరచూ యువతిని కలుస్తున్నడు. దీంతో నిన్న రాత్రి మూడు ద్విచక్ర వాహనాలపై వచ్చి ఆరుగురు దుండగులు యావన్పై కత్తులతో దాడి చేసారు. కత్తితో 17 చోట్ల పొడిచి హతమార్చారు.

# గ్రేటర్ లో పాగా లక్ష్యంగా ఆపరేషన్ ఆకర్ష్..

హైదరాబాద్, మే 8, బెంగాల్‌పై ఫోకస్ చేసి మరీ కొట్టారు. నెక్ట్స్ మిషన్ సౌత్ లో భాగంగా..తెలంగాణపై బీజేపీ కాన్సంట్రేట్ చేసింది. నైజాంలోనూ కాషాయ జెండా ఎగరవేసేందుకు వ్యూహాలు రచిస్తోంది. ఈ క్రమంలోనే ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల తర్వత?నరేంద్ర మోదీ తొలి సభ తెలంగాణలోనే జరుగనుంది. ఈ సభా వేదికగా.. బీజేపీ ఆపరేషన్ ఆకర్ష్‌కు తెరలేపనుందా? ఇంతకు కమలనాథులతో టచ్‌లో ఉన్న బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలెవరు? మోదీ సభలో చేరికలు ఉండబోతున్నాయనే టాక్ నిజమేనా.. మైండ్ గేమా?తెలంగాణా వార్తలుఆఫ్టర్ ఎ లాంగ్ టైమ్..ప్రధాని మోదీ ఈ నెల 10న తెలంగాణకు వస్తున్నారు. ఇప్పటికే ప్రధాని షెడ్యూల్ టూర్ ఖరారైంది. ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. సాయంత్రం 7 గంటల వరకు హైదరాబాద్‌లో టైమ్ స్పెండ్ చేయనున్నారు ప్రధాని. ఇందులో భాగంగా అధికార, పార్టీ కార్యక్రమాలు కూడా ఫిక్స్ చేశారు. పార్టీ కార్యక్రమాల వేదికగా బీజేపీని బలోపేతం చేసేందుకు సిద్ధం అవుతున్నారు. టార్గెట్ తెలంగాణ లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. తెలంగాణలో అధికారంలోకి రావాలంటే సాధారణ ఎన్నికల ముందు జరిగే గ్రేటర్ ఎన్నికలను సెమీ ఫైనల్‌గా భావిస్తున్నాయి అన్ని పార్టీలు. గ్రేటర్ పరిధిలోని మూడు కార్పొరేషన్లలో పాగా వేయడమే లక్ష్యంగా బీజేపీ పావులు కదుపుతోంది. ఇందుకోసం బీఆర్ఎస్ , కాంగ్రెస్ నేతలను పార్టీలో చేర్చుకునేందుకు వ్యూహాలు రచిస్తున్నారట.ఇటీవల మాజీ మంత్రి మల్లారెడ్డి కోడలు బీజేపీ స్టేట్ ఆఫీస్‌కు రావడం పొలిటికల్ సర్కిల్స్‌లో పెద్ద ఎత్తున చర్చ జరిగింది. మాజీ మంత్రి మల్లారెడ్డి కుటుంబంతో కలిసి ఢిల్లీలో నరేంద్ర మోదీని కలిశారు. దీంతో బీఆర్ఎస్‌లో ఒక్కసారిగా కలకలం రేగింది. మాజీ మంత్రి మల్లారెడ్డి కుటుంబంతో సహా కమలం గూటికి చేరేందుకు రెడీ అయ్యారన్న వార్తలు వస్తున్నాయి. అయితే బీజేపీలో చేరికపై మల్లారెడ్డి కోడలు ప్రీతీరెడ్డి క్లారిటీ ఇచ్చినా..వారి కుటుంబం వేస్తున్న అడుగులు బీజేపీలో చేరేలా ఉన్నాయనే చర్చ నడుస్తోంది. ఇప్పుడు ఇదే అంశం బీఆర్ఎస్‌లోనూ చర్చకు దారి తీసిందంటున్నారు. నరేంద్ర మోదీ రాష్ట్రానికి వస్తున్న నేపథ్యంలో మాజీమంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి, అల్లుడు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, మల్లారెడ్డి కొడుకు భద్రారెడ్డి, కోడలు ప్రీతీరెడ్డి బీజేపీలో చేరబోతున్నారా అనే ఊహాగానాలు మొదలయ్యాయి. బీజేపీ నేతలు కూడా ఈ అంశంపై నర్మగర్భంగా స్పందిస్తుండటం చర్చనీయాంశంగా మారింది.ఇక గ్రేటర్‌లో కీలకంగా ఉన్న కాంగ్రెస్ నేతలే లక్ష్యంగా ఆపరేషన్ ఆకర్ష్‌కు తెర లేపేందుకు సిద్ధమయ్యారట కమలనాథులు. గ్రేటర్ పరిధిలో ఉన్న ఒక్కరిద్దరు కాంగ్రెస్ సీనియర్ నేతలను చేర్చుకునేలా పావులు కదుపుతున్నారట. జీహెచ్ఎంసీ, మల్కాజ్ గిరి కార్పొరేషన్, సైబరాబాద్ కార్పొరేషన్ పరిధిలో పాగా వేసేలా బలమైన నేతలను తమ వైపునకు తిప్పుకునేందుకు వ్యూహాలు రచిస్తున్నారట. నరేంద్ర మోదీ సభ వేదికగా బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలను బీజేపీలోకి తీసుకోవడం ద్వారా ఆ రెండు పార్టీలకు షాక్ ఇవ్వాలనే ప్లాన్ నడుస్తోందట.వార్తా సేవలుమోదీ సభను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న స్టేట్ బీజేపీ లీడర్లు..ఇక మోదీ సభకు ముందు, ఆ తర్వాత అన్నట్టుగా పార్టీ దూకుడు పెంచాలని డిసైడ్ అయ్యారట. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లో ఉన్న బలమైన నేతలను, ఆయా పార్టీలో ఉన్న అసంతృప్త నేతలను ఐడెంటిఫై చేసి వారిని దశల వారీగా కమలం గూటికి చేర్చుకోవాలనేది ప్లాన్ అంటున్నారు. మరి మోదీ సభ వేదికగా బీజేపీలో చేరేదెవరో చూడాలి.

# చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో యాక్సెస్ కంట్రోల్ సిస్టం

హైదరాబాద్, మే 8, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ తరహాలోనే చర్లపల్లి స్టేషన్‌లోనూ వాహనాల రద్దీని నియంత్రించేందుకు దక్షిణ మధ్య రైల్వే యాక్సెస్ కంట్రోల్ వ్యవస్థను అందుబాటులోకి తెస్తోంది. వాహనాల పికప్, డ్రాప్ కోసం 20 నిమిషాల వరకు ఉచిత సమయాన్ని కేటాయించగా.. ఆపై నిమిషాల ఆధారంగా రుసుము వసూలు చేయనున్నారు. డిజిటల్ టికెటింగ్, ప్రత్యేక లేన్లతో కూడిన ఈ విధానం వల్ల అనధికార పార్కింగ్‌కు చెక్ పడటంతో పాటు ప్రయాణికులకు సాఫీగా రాకపోకలు సాగించే వీలుంటుందని రైల్వే అధికారులు చెబుతున్నారు.హైదరాబాద్ మహానగరంలో నాలుగో ప్రధాన రైల్వే టెర్మినల్‌గా అభివృద్ధి చెందుతున్న చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. స్టేషన్ ప్రాంగణంలో వాహనాల రద్దీని క్రమబద్ధీకరించడానికి, ట్రాఫిక్ జామ్ సమస్యలను నివారించడానికి అత్యాధునిక యాక్సెస్ కంట్రోల్ వ్యవస్థను అమలు చేయనుంది. ఇప్పటికే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లోని 10వ ప్లాట్‌ఫాం వద్ద విజయవంతంగా నడుస్తున్న ఈ విధానాన్ని ఇప్పుడు చర్లపల్లికి కూడా విస్తరిస్తున్నారు. దీనివల్ల స్టేషన్ లోపలికి వచ్చే వాహనాల వివరాలు డిజిటలైజ్ చేయబడటమే కాకుండా.. అనధికారికంగా వాహనాలను నిలిపివేసే ధోరణికి అడ్డుకట్ట పడుతుందని రైల్వే అధికారులు చెబుతున్నారు.ఈ కొత్త విధానం ప్రకారం.. బైక్, ఆటో, నాలుగు చక్రాల వాహనాలకు వేర్వేరుగా లేన్లను కేటాయించారు. స్టేషన్ ప్రాంగణంలోకి ప్రవేశించే ప్రతి వాహనానికి ప్రవేశ సమయంతో కూడిన డిజిటల్ టికెట్ జారీ చేస్తారు.

ప్రయాణికులను డ్రాప్ లేదా పికప్ కోసం వచ్చే వాహనాలకు మొదటి 20 నిమిషాల వరకు ఎటువంటి రుసుము వసూలు చేయరు. అంటే 20 నిమిషాలలోపు పని ముగించుకుని బయటకు వెళ్లే వారికి 'ఫ్రీ ఎగ్జిట్' సదుపాయం ఉంటుంది. అయితే నిర్ణీత సమయం దాటిన తర్వాత డిజిటల్ రసీదు ప్రకారం ఛార్జీలు వర్తిస్తాయి. నేరుగా పార్కింగ్ స్థలాలకు వెళ్లే వాహనాలకు ఈ అదనపు ఛార్జీల నుంచి మినహాయింపు ఉంటుంది.కమర్షియల్ వెహికల్స్ అంటే బస్సులు, మినీ బస్సులకు కూడా 20 నిమిషాల ఉచిత సమయాన్ని కల్పించారు. ఒకవేళ 20 నుండి 30 నిమిషాల మధ్య ఉంటే రూ.100, 30 నుంచి 60 నిమిషాల వరకు ఉంటే రూ.200 రుసుము చెల్లించాల్సి ఉంటుంది. వాహనాలను గంట కంటే ఎక్కువ సమయం లోపల ఉంచడానికి అనుమతి లేదు. ఈ నిబంధనను అతిక్రమించే వారికి రూ.1000 వరకు భారీ జరిమానా విధించనున్నట్లు రైల్వే అధికారులు హెచ్చరించారు. ఈ కఠిన నిబంధనల వల్ల స్టేషన్ ఎంట్రన్స్ వద్ద అనవసరపు రద్దీ తగ్గి ప్రయాణికులు సకాలంలో ప్లాట్‌ఫాంలకు చేరుకునే అవకాశం ఉంటుంది.స్టేషన్‌లో గంటల ప్రాతిపదికన వాహనాలు నిలుపుకోవాలనుకునే వారి కోసం ప్రత్యేక పార్కింగ్ రేట్లను ఖరారు చేశారు. కార్లకు మొదటి రెండు గంటలకు రూ.20, ఆ తర్వాత ప్రతి గంటకు రూ.10 చొప్పున వసూలు చేస్తారు. ద్విచక్ర, త్రిచక్ర వాహనాలకు మొదటి రెండు గంటలకు రూ.15, ఆపై గంటకు రూ.10 చొప్పున ఛార్జీ ఉంటుంది. ఈ డిజిటల్ పేమెంట్, యాక్సెస్ కంట్రోల్ విధానం ద్వారా పారదర్శకత పెరుగుతుందని, ప్రయాణికులకు మెరుగైన రవాణా అనుభూతి లభిస్తుందని దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో వెల్లడించింది.

# మంగ్లీ ఎక్కడ...



నల్గొండ, మే 8, వాళ్లంతా పేదలు. వారి దగ్గర నుంచి డబ్బులు వసూలు చేసిన వారిని కచ్చితంగా శిక్షించాలి. వారి తరఫున నేను పోరాడుతాను. అవసరమైతే హెల్ప్ చేస్తాను. ముందుగా వారిని పట్టుకోవాలి. ఈ కేసులో సంబంధం లేని వ్యక్తులపై విమర్శలు చేస్తున్నారు. నేను మీడియా ఫ్యామిలీ నుంచి వచ్చాను. మీడియా నాకు అండగా ఉండాలి. నామీద అడ్డగోలుగా రాయవద్దు. నేను బాధపడుతున్నాను. ఇబ్బంది పడుతున్నాను.. ఇదిగో ఇలా సాగిపోయింది మంగ్లీ ఆ మధ్య రెండు సార్లు విలేకరులతో మాట్లాడినప్పుడు సాగించిన మాటల పరంపర.ఆమె మాట్లాడిన మాటలకు.. క్షేత్రస్థాయిలో చేతలకు పొంతనలేదని పోలీసుల దర్యాప్తులో తేలిపోయింది. ఈ కేసులో ఇప్పటికి తెలంగాణ పోలీసులు అనేక రకాలుగా సమాచారాలను సేకరించినట్టు తెలుస్తోంది. మంగ్లీ సోదరుడి ఖాతాలోకి భారీగా జమైన డబ్బు.. ఆ డబ్బును డ్రా చేసిన తీరు.. ఇంకా అనేక అంశాలను గుర్తించారు. సాంకేతిక ఆధారాలు మాత్రమే కాకుండా.. ఇక అనేక రకాలైన కీలక ఆధారాలను సేకరించారు. ఆ తర్వాత తదుపరి ఏం చేయాలనేది పోలీసులు నిర్ణయం తీసుకోబోతున్నారు.ఈ ఎపిసోడ్ ఇలా సాగుతుండగానే మంగ్లీ గురించి మరోసారి న్యాయవాది సుబ్బారావు సంచలన ఆరోపణలు చేశారు.. "మంగ్లీ మీద, ఆమె సోదరుడు శివ మీద గద్వాల, గచ్చిబౌలి, నల్గొండ పోలీస్ స్టేషన్లలో కేసులున్నాయి. దీనికి సంబంధించి వాళ్లు సమాధానం చెప్పాలి. మైక్రో ఫైనాన్స్ కేసు విషయంలో డిజిపి సివి ఆనంద్ ను కలిశాం. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలుస్తాను. బాధితులకు తిరిగి డబ్బులు చెల్లిస్తే ఖచ్చితంగా కేసులు వెనక్కి తీసుకుంటాం.. మైక్రో ఫైనాన్స్ స్కీం పేరుతో అధిక లాభాలు వస్తాయని నమ్మబలికారు. సింగర్ మంగ్లీ, ఆమె సోదరుడు , ఇంకా కొంతమంది కోట్లలో మోసం చేశారు. ఈ విషయాన్ని నాకు హిమ కాంత్ రెడ్డి తెలిపారు. ఈ విషయం గురించి తెలుసుకోవడానికి మంగ్లీని సంప్రదించాను. ఆమె నన్ను బెదిరించారు.. అందువల్లే పంజాగుట్ట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాను.. నా ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు మంగ్లీ, ఆమె సోదరుడు, మరో ముగ్గురు మీద కేసు నమోదు చేశారని" న్యాయవాది సుబ్బారావు తెలిపారు.మరోవైపు సుబ్బారావు మీద కూడా మంగ్లీ ఫిర్యాదు చేశారు.. తన మీద దుష్ప్రచారం చేస్తున్నారని.. ఓ సెలబ్రిటీ నటిమీద సుబ్బారావుకు క్రష్ ఉందని.. అందువల్లే ఇదంతా చేస్తున్నారని మంగ్లీ ఆరోపించారు. తన మీద ఫిర్యాదులు చేస్తూ సుబ్బారావు ప్రాచుర్యం పొందడానికి ప్రయత్నం చేస్తున్నారని మంగ్లీ పేర్కొన్నారు. కాగా, సుబ్బారావు బుధవారం కీలకమైన విషయాన్ని తెరపైకి తీసుకొచ్చారు. తప్పు చేయనప్పుడు మంగ్లీ ఎందుకు తప్పించుకుంటున్నారని ఆరోపించారు.. సుబ్బారావు ఇన్ని రకాల ఆరోపణలు చేసిన నేపథ్యంలో.. మంగ్లీ ఏవిధంగా సమాధానం చెప్తారో చూడాల్సి ఉంది.

## నెక్కొండలో
## రైతుల బైటాయింపు

వరంగల్ నెల రోజులైనా మక్కలు కొనలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేసారు. వరంగల్ జిల్లా నెక్కొండ మార్కెట్ యార్డ్లో రైతులు అందోళనకు దిగారు. పంట కొనమని అంటే బయటైనా అమ్ముకుంటాం కదా. కొంటామని సంచుల్లో నింపారు, తీసుకోలేదు.ఇప్పుడు వర్షానికి సంచులు తడిచి మక్కలు మొలకలు వచ్చాయని అన్నారు. ఇంత కష్టపడి పంట పండించి ఈ గోస పడతామని అనుకోలేదని మండల కేంద్రంలో రోడ్డుపై రైతులు బైఠాయించారు. ప్రభుత్వం వెంటనే పంట కొనుగోలు చేయాలంటూ నినాదాలు చేసారు. దాంతో భారీ ఎత్తున వాహనాలు . నిలిచిపోయాయి

# గంగుల వర్సెస్ బండి





కరీంనగర్, మే 8, కరీంనగర్ రాజకీయాల్లో అగ్గి రాజుకుంది. రాజకీయ ప్రత్యర్థులు అయిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ప్రెస్‌మీట్‌లో కరీంనగర్ సీపీ గౌస్ ఆలం, కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. దీంతో ఇరుపక్షాల మధ్య మాటల యుద్ధం మొదలైంది. బీజేపీ నాయకులు కరీంనగర్‌లో పాడి కౌశిక్‌రెడ్డిపై దాడికి యత్నించారు. ఆయన తప్పించుకున్నారు. కానీ ఎమ్మెల్యే గంగల కమలాకర్ క్యాంపు కార్యాలయంపై దాడి జరిగింది.ఇటీవల కరీంనగర్‌లోని పీంఎజే ఆభరణాల దుకాణంలో భారీ చోరీ జరిగింది. ఈ విషయంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి సీపీ గౌస్‌ఆలంపై సంచలన ఆరోపణలు చేశారు. సీపీ చేతగానితనంతోనే చోరీ జరిగిందన్నారు. రక్షణ కల్పించంలో, దొంగలను పట్టుకోవడంలో విఫలమయ్యారని పేర్కొన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్ కూడా చేష్టలు ఉడిగి చూస్తున్నారని మండిపడ్డారు. బండి సంజయ్ తంబాకు, డ్రగ్స్ కలిపి తీసుకుంటారని ఆరోపించాడు. అందుకే తలపై వెంట్రుకలు ఊడిపోయాయని పేర్కొన్నాడు. కేటీఆర్ డ్రగ్ టెస్ట్‌కు సిద్ధమని, సంజయ్ కూడా సిద్ధం కావాలని డిమాండ్ చేశాడు. దీంతో బీజేపీ కార్యకర్తలు పాడి వ్యాఖ్యలపై మండిపడ్డారు. కరీంనగర్‌లో ఉన్న విషయం తెలుసుకుని ఆయనపై దాడికి బయల్దేరారు. తృటిలో ఎమ్మెల్యే తప్పించుకున్నారు.ఎమ్మెల్యే కార్యాలయంలోని కారు, కార్యాలయం అద్దాలను బీజేపీ శ్రేణులు ధ్వంసం చేశాయి. దీంతో బీఆర్ఎస్ కార్యకర్తలు అక్కడకి చేరుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు కూడా అక్కడికి చేరుకున్నారు. ఉద్రిక్తతలు పెరగడంతో పోలీసులు వారిని చెదరగొట్టేందుకు లాఠీచార్జి చేశారు.అనంతరం పాడి కౌశిక్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. క్యాంపు కార్యాలయంలోనే అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తానే బాధితుడినని, తనపై రౌడీషీటర్లతో దాడి చేయించారని ఆరోపించారు. బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలకు తాను కౌంటర్ ఇచ్చానని, ఎవరినీ దుర్భాషలాడలేదని వెల్లడించారు.సాధారణంగా అధికార ప్రతిపక్షాల మధ్య గొడవలు జరుగుతుంటాయి. కౌశిక్ రెడ్డి వ్యవహార శైలి కారణంగా ఇప్పటికే కాంగ్రెస్ నాయకులు హైదరాబాదులో దాడి చేశారు. తాజాగా ప్రతిపక్ష పార్టీలైన బిజెపి బిఆర్ఎస్ మధ్య గొడవ మొదలైంది. ఈసారి కరీంనగర్ లో బిజెపి కార్యకర్తలు దాడికి యత్నించారు.

# కేరళ గెలుపులో రేవంత్ లెక్క...



హైదరాబాద్, మే 8, ఐదు రాష్ట్రాలకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమి యూడీఎఫ్ విజయం దక్కించుకుంది. ఇక్కడి 140 అసెంబ్లీ స్థానాల్లో 102 స్థానాల్లో కూటమి గెలుపు గుర్రం ఎక్కింది. అయితే.. ఈ విజయంలో పలువురి పాత్ర ఉన్నప్పటికీ.. ముఖ్యంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాత్రపైనే ఇప్పుడు ఆసక్తికర చర్చ సాగుతోంది. ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో రేవంత్ కేవలం కేరళపైనే ఎక్కువగా దృష్టి పెట్టారు. దాదాపు 18 రోజుల పాటు ఆయన ప్రచారం నిర్వహించారు. తొలి దశలో 7 రోజులు.. తర్వాత తర్వాత నాలుగు రోజుల చొప్పున ప్రచారంలో పాల్గొన్నారు. అయితే.. ఇది సాధారణ ప్రచారమైతే.. పెద్దగా చర్చ ఉండేది కాదు. కాంగ్రెస్ తరఫున ఎంతో మంది ప్రచారం చేశారు కాబట్టి.. ఆ లెక్కలో కలిసిపోయేది. కానీ, రేవంత్ చేసిన ప్రచారం విభిన్నంగా సాగింది. ఆయన కేరళకు, తెలంగాణలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వానికి మధ్య లింకు పెట్టి ప్రచారం సాగించారు.తిరువనంతపురం జిల్లా సహా.. పాలక్కాడు, పథనం తిట్ట వంటి తెలుగు వారి మూలాలు ఉన్న జిల్లాల్లో పెద్ద ఎత్తున రోడ్ షోలు.. ప్రసంగాలతో దంచి కొట్టారు. మరీ ముఖ్యంగా ఈ సమయంలో సీఎం పినరయి విజయన్‌ను ఢీ అంటే ఢీ అన్నట్టుగా రేవంత్ ఢీ కొట్టారు. ఆయనకు అనేక సవాళ్లు విసిరారు. పేద రికం నుంచి అవినీతి వరకు , నిరుద్యోగం నుంచి ఉపాధి కల్పన దాకా.. అనేక అంశాలను రేవంత్ ప్రస్తావించా రు. ఈ క్రమంలో ఇరువురు ముఖ్యమంత్రుల మధ్య లేఖల యుద్ధం కూడా కొనసాగిందిఇది కేరళ కాంగ్రెస్ పార్టీ నాయకులకు కలసి వచ్చింది. రేవంత్ ప్రసంగాలను.. ముఖ్యంగా సీఎం పినరయి విజయన్ చేసిన ప్రసంగాలతో పోల్చుతూ.. స్థానికంగా బలంగా వినిపించారు. 'రైజింగ్ తెలంగాణ' మాదిరిగా 'రైజింగ్ కేరళ' మంత్రాన్ని జపించారు. నగరాలు, పట్టణాల్లో రేవంత్ ఫొటోలను ప్రచారంలోకి తీసుకువచ్చారు. ఆయన ప్రసంగాలను స్థానిక భాషలోకి అనువదించి.. మరింత విస్తారంగా ప్రచారంలోకి తెచ్చారు. మొత్తంగా కేరళ విజయంలో రేవంత్ రెడ్డి మాటల తూటాలు.. బాగానే పనిచేశాయి. సాధారణంగానే కాంగ్రెస్ పార్టీలో ముఖ్యమంత్రి పీఠం కోసం.. పోటీ కొనసాగుతుంది. అనేక మంది సీని యర్ నాయకులు ఈ జాబితాలో ముందున్నారు. ఇలాంటి వారిలో తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ కేసీ వేణుగోపాల్ సహా.. కీలక నేత సతీశన్, ఎంపీ శశిథరూర్‌వంటి హేమాహేమీలు కూడా పోటీపడు తున్నా రు. ఇక, యూడీఎఫ్ మిత్ర పక్షం ఆల్ ఇండియా ముస్లిం లీగ్(ఏఐఎంఎల్).. తన మద్దతు సతీశన్‌కేనని చెబుతోంది. ఈయన 2001 నుంచి ఇప్పటి వరకు అప్రతిహతంగా విజయం దక్కించుకున్నారు. పైగా పదేళ్లపాటు ప్రతిపక్ష నాయకుడిగా కూడా వ్యవహరించారు. మరోవైపు కేసీ వేణుగోపాల్ కూడా తానే ముఖ్యమంత్రినంటూ ప్రకటించుకుంటున్నారు. పార్టీని ముందుండి నడపడంలోనూ.. ఎన్నికల వేళ పార్టీని బలోపేతం చేయడంలోనూ ఆయన సేవలను ఎవరూ కాదనలేరు. ఇక, శశి థరూర్ వ్యవహారం కూడా పార్టీలో చర్చకు వచ్చినా.. ఆయనకు అదిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇవ్వకపోవచ్చు. మరో వైపు ఇతర నేతల ప్రయత్నాలు కూడా కొనసాగుతున్నాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డేనన్న ప్రచా రం జరుగుతోంది. ఆయన ఎన్నికల సమయంలోఅనుసరించిన వ్యూహాలు.. అప్పటి సీఎం విజయన్‌తో ఢీ అంటే ఢీ అన్నట్టుగా వ్యవహరించిన తీరుతో కాంగ్రెస్ పుంజుకుందని అంటున్నారు. ఈ క్రమంలో ఇప్పు డు ముఖ్యమంత్రి అభ్యర్థి ఎంపిక విషయంలోనూ.. రేవంత్ రెడ్డి కీలక పాత్ర పోషించనున్నట్టు తెలుస్తోంది. తాజాగా రేవంత్ రెడ్డి బుధవారం ఢిల్లీకి వెళ్లారు. ముఖ్యమంత్రి అభ్యర్థి విషయంలో రేవంత్‌కే ప్రాధాన్యం లభిస్తే.. ఆయన ఓటు కేసీ వేణుగోపాల్‌కే ఉంటుందన్న చర్చ కేరళలో జోరుగా సాగుతోంది. అయితే.. దీనిని సతీశన్ వర్గం తీవ్రంగా విభేదిస్తోంది. పార్టీని అన్ని విధాలా కాపాడిన తననే సీఎంను చేస్తారన్న నమ్మకం ఉందని సతీశన్ చెబుతున్నారు. ఈయన 'పెరవూరు' నియోజకవర్గంలో తిరుగులేని నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# సెల్ తీసుకోండి... జనగణన చేసుకోండి..
## ఆన్లైన్ ద్వారా అవకాశం..
### 11వ తేదీ నుంచి ఇంటింటికి జనగణన సిబ్బంది..
### ఫరూక్ నగర్ తాహసీల్దార్ నాగయ్య




లింగారెడ్డిగూడెం గ్రామంలో మార్ దాన్ వాక్ చేతిలో ఉన్న సెల్ ఫోన్ లేదా ఇంట్లో ఉన్న కంప్యూటర్ ద్వారా స్వీయ జనగణన చేసుకునేందుకు ప్రభుత్వం సువర్ణ అవకాశాన్ని ప్రతి ఒక్కరికి కల్పించిందని షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ ఎమ్మార్వో నాగయ్య అన్నారు. ఫరూక్ నగర్ మండలం లింగారెడ్డిగూడెం గ్రామంలో స్వీయ జనగణన పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ మార్ దాన్ వాక్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వీయ జన గణ ఆన్లైన్ పై అవగాహన ఉన్న ప్రతి ఒక్కరు చేసుకోవచ్చని వెల్లడించారు. ఈనెల పదవ తేదీ లోపు ఈ కార్యక్రమాన్ని పూర్తిచేయాలని వివరించారు. ఈనెల 13వ తేదీ నుంచి జూన్ 9 వరకు ఇంటింటికి జనగణన కోసం కేటాయించిన సిబ్బంది వస్తారని, ప్రజల స్వచ్ఛందంగా తమ వివరాలను అందించి సహకరించాలని సూచించారు. ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెల్లడించారు. గ్రామ సర్పంచ్ ఎంసి ప్రవీణ్ కుమార్, ఉపసర్పంచ్ ఎర్రోళ్ల అశోక్, గ్రామ మాజీ ఉపసర్పంచ్ మల్లేష్ యాదవ్, వార్డు సభ్యులు, కొనేంటి సాయికుమార్, గ్రామస్తులు నరేందర్ రెడ్డి, జంగయ్య యాదవ్, ప్రతాపరెడ్డి, దాదేమియా తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పార్టీని సెట్ చేస్తున్న రేవంత్



హైదరాబాద్, మే 8, కాంగ్రెస్ పార్టీ లో ఒక సంప్రదాయం ఉంటుంది. అధికారం లేనంతవరకు అధికారం కోసం కొట్లాడుతూ ఉంటుంది. అధికారం దక్కిన తర్వాత పదవుల కోసం ఆ పార్టీలో కొట్లాటలు జరుగుతూ ఉంటాయి. అందువల్లే ఆ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువగా ఉంటుంది అంటారు. కేవలం రాష్ట్రాలు మాత్రమే కాదు.. కేంద్రంలో కూడా అదేవిధంగా ఉంటుంది. అందువల్లే కాంగ్రెస్ పార్టీని సామాన్య ఓటరు అంతగా నమ్మనిది. కొంతమంది చరిష్మా ఉన్న నాయకులు కాంగ్రెస్ పార్టీకి పెట్టని బలం మాదిరిగా ఉంటారు.

ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో ఆ బలం రేవంత్ రెడ్డి రూపంలో కనిపిస్తోంది.కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బలమైన గొంతు గా రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజలకు కనిపించారు. అందువల్లే ఆయనను తెలంగాణ ప్రజలు ప్రత్యామ్నాయంగా చూశారు. 2023 ఎన్నికల్లో ఆయన ఆధ్వర్యంలోని కాంగ్రెస్ పార్టీకి మెజారిటీ స్థానాలు అందించి తెలంగాణ రాష్ట్రాన్ని ఏలమని కోరారు. తెలంగాణ ప్రజలు తీసుకున్న ఈ నిర్ణయం భారత రాష్ట్ర సమితి సుప్రీం కెసిఆర్ కు మింగుడు పడలేదు. అయినప్పటికీ ప్రజా తీర్పును శిరసా వహించాల్సి ఉంటుంది కాబట్టి తప్పలేదు.తెలంగాణ రాష్ట్ర పగ్గాలు దక్కిన తర్వాత రేవంత్ రెడ్డికి అంత ఈజీగా ఏదీ లేదు. స్వపక్షంలోనే విపక్షం లాగా పరిస్థితి ఎదురయింది. సొంత పార్టీ నేతలు ఇబ్బంది పెట్టారు. ప్రత్యర్థి పార్టీలకు లీకులు కూడా ఇచ్చారు. ప్రభుత్వ పాలసీలను వివాదాస్పదం చేశారు. దీంతో అనేక రకాల వివాదాలు రేవంత్ రెడ్డిని చుట్టుముట్టాయి. ఎప్పుడైతే రేవంత్ రెడ్డి వరుస ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించడం మొదలుపెట్టారో.. అప్పుడే పరిస్థితి మారిపోయింది. అధిష్టానం కూడా రేవంత్ రెడ్డికి సరెండర్ అయిపోయింది.. దీంతో రేవంత్ రెడ్డి పార్టీ మీద పట్టు సాధించారు. తోక జాడిస్తున్న కొంతమంది పార్టీ పెద్దలకు చుక్కలు చూపించడం మొదలుపెట్టారు. దీంతో పార్టీలో రేవంత్ పెత్తనం పెరిగిపోయింది.ఇప్పుడు ప్రభుత్వంలో కూడా రేవంత్ తన దూకుడు తనం చూపిస్తున్నారు. సంక్షేమ పథకాల విషయంలో ఏమాత్రం వెనకడుగు వేయడం లేదు. ఇప్పటికే ఇందిరమ్మ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా రికార్డు స్థాయిలో గృహాలను నిర్మించారు. ఇంకా రెండవ దశ, మూడోదశలో కూడా గృహాలు మంజూరు చేస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. దివ్యాంగులకు.. త్రిచక్ర వాహనాలను పంపిణీ చేశారు. రైతులకు సంబంధించి పంట పెట్టుబడి సాయం విషయంలో కాస్త ఇబ్బందులు ఎదురవుతున్నప్పటికీ.. వాటిని కూడా అధిగమించే ప్రయత్నం చేస్తున్నారు. సన్న ధాన్యం పండించే రైతులకు బోనస్ ఇస్తున్నారు. ఇవే కాకుండా త్వరలో చౌక దుకాణంలో ప్రజలకు జొన్నలు కూడా ఇచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది.. సంక్షేమ పథకాల విషయంలో కొత్త ఒరవడి సృష్టిస్తున్న రేవంత్.. పార్టీ పరంగా నామినేటెడ్ పదవుల విషయంలో కూడా అదే జోరు చూపిస్తున్నారు. ఇప్పటికే ఆయా కులాలకు కార్పొరేషన్లను కేటాయించారు. పదవులు కూడా భర్తీ చేశారు. త్వరలో మిగతా పోస్టులను కూడా భర్తీ చేస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇలా చెప్పుకుంటూ పోతే రేవంత్ రెడ్డి అన్నిటిని సెట్ రైట్ చేసుకుంటూ వస్తున్నారు.దీర్ఘకాల సమస్యగా ఉన్న ఆర్టీసీ కి కొత్త దారిని చూపించారు రేవంత్. అధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ఆర్టీసీ కార్మికులకు బకాయిలను చెల్లించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అంతేకాదు వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించేందుకు ఉన్న సమస్యలు మొత్తం అధిగమించాలని అధికారులకు సూచనలు చేశారు. అతి త్వరలో ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం ఖాయమని రేవంత్ సంకేతాలు ఇస్తున్నారు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల విషయంలోనూ రేవంత్ ఉదారత చూపిస్తున్నారు. అందువల్లే ఉద్యోగులు ఇటీవల ఆయనను సన్మానించారు. ప్రభుత్వ పరంగా ఉన్న బకాయిలను ప్రతినెల 6వేల కోట్ల చొప్పున చెల్లించేందుకు రేవంత్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

తద్వారా ఉద్యోగుల సమస్యకు ఒక పరిష్కారాన్ని చూపించారు. పిఆర్సి.. ఇతర సమస్యలను కూడా త్వరలోనే పరిష్కరిస్తామని రేవంత్ పేర్కొన్నారు. పెరిగిపోయిన అప్పులు.. రాబడి విషయంలో ఏదో అవుతున్న సవాళ్లు.. ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు.. ఇన్ని రకాల సమస్యలు ఉన్నప్పటికీ రేవంత్ సావధానంగా వెళ్తున్నారు. తన కాళ్లలో పుల్లలు వేస్తున్నప్పటికీ వాటిని ఏరుకుంటూ ధైర్యంగా ముందుకు సాగుతున్నారు. ఇదే దూకుడు కనక రేవంత్ కొనసాగిస్తే ఖచ్చితంగా వైయస్ రాజశేఖర్ రెడ్డి ని మించిన స్థాయిలో కాంగ్రెస్ పార్టీలో పేరు తెచ్చుకుంటారని కార్యకర్తలు అంటున్నారు.

# బాలానగర్ చెక్‌పోస్ట్‌ను సందర్శించి తనిఖీలు నిర్వహించిన జిల్లా ఎస్పీ డి.జానకి,

### పశువుల అక్రమ రవాణాపై కఠిన చర్యలు
### జిల్లా వ్యాప్తంగా 7 ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు
### చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిపై కూడా చర్యలు తప్పవు

మహబూబ్నగర్ జిల్లాలో పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు జిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానకి, ఐపీఎస్ గారు తెలిపారు. జిల్లాలోని కీలక ప్రాంతాలైన పాలమూరు యూనివర్సిటీ, కోయిలకొండ చీ రోడ్, బాలానగర్, మిడ్జిల్, నవాబ్‌పేట, మహమ్మదాబాద్ మరియు అడ్డాకల్ ప్రాంతాల్లో మొత్తం 7 ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి 24 గంటలపాటు వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ డి.జానకి వెల్లడించారు.



ఈ సందర్భంగా గురువారం బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్‌పోస్ట్‌ను జిల్లా ఎస్పీ సందర్శించి తనిఖీలు నిర్వహించారు. చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీల విధానం, సిబ్బంది అప్రమత్తత, రికార్డుల నిర్వహణపై సమీక్ష నిర్వహించి సంబంధిత పోలీస్ అధికారులకు పలు సూచనలు మరియు ఆదేశాలు జారీ చేశారు.

అక్రమంగా పశువులను తరలించే వ్యక్తులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని, ఎలాంటి రాజీ ఉండదని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక డ్రైవ్స్ నిర్వహిస్తూ అనుమానాస్పద వాహనాలపై నిఘా పెంచినట్లు తెలిపారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పశువుల అక్రమ రవాణా చట్టరీత్యా శిక్షార్హమైన నేరమని, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

అలాగే పశువుల రవాణా పేరుతో ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడరాదని సూచించారు. మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టే విధంగా వ్యవహరించడం, శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలు చేయడం సహించబోమని తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, వాస్తవాలు నిర్ధారించకుండా సందేశాలు లేదా వీడియోలను షేర్ చేయరాదని ప్రజలకు సూచించారు. పశువుల అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే డయల్-100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. జిల్లాలో శాంతిభద్రతలను పరిరక్షిస్తూ, సామాజిక సామరస్యాన్ని కాపాడుతూ, మూగజీవాల రక్షణకు మహబూబ్నగర్ జిల్లా పోలీసులు నిరంతరం కట్టుబడి పనిచేస్తున్నారని ఎస్పీ తెలిపారు.

# నిందితులను అప్పగించాలని బంధువుల డిమాండ్

హైదరాబాద్ చిలకలగూడలో హత్యకు గురైన అఖిల్ తండ్రి శ్రీనివాస్తో పాటు బంధువులు, మిత్రులు పెద్ద ఎత్తున నిందితుల ఇంటి వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. తమ కుమారుడిని దారుణంగా హత్య చేసిన నిందితులను వెంటనే తమకు అప్పగించాలని వారు డిమాండ్ చేశారు.

మా బిడ్డ ప్రాణం తీసిన నిందితులు దర్జాగా ఇంట్లో ఏసీల్లో కూర్చున్నారు. బీటెక్ చదువుతున్న మా కుమారుడి ప్రాణాన్ని ఎవరు తిరిగి తీసుకొస్తారు?" అంటూ అఖిల్ బంధువులు పోలీసులను ప్రశ్నించారు. తమకు న్యాయం జరిగే వరకు అక్కడి నుంచి కదిలేది లేదని స్పష్టం చేస్తూ పెద్ద ఎత్తున ధర్నాకు దిగారు.

ఈ సందర్భంగా ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈస్ట్ జోన్ అదనపు డీసీపీ నర్సయ్య ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో పోలీసులు మోహరించి దాదాపు రెండు గంటల పాటు విశ్వప్రయత్నం చేసి నింధితులను ఎట్టి పరిస్థితుల్లో వదిలే ప్రసక్తి లేదని డీసీపీ హామినివ్వడంతో అక్కడి నుండి ఆందోళనకారులు వెళ్లిపోవడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఈ సందర్భంగా అదనపు డీసీపీ మాట్లాడుతూ ప్రాథమిక సమాచారం మేరకు ఇది ప్రేమ వ్యవహారంలో జరిగిన హత్యగా తెలుస్తుందన్నారు. 5మంది ఈ హత్య ఘటనలో పాల్గొన్నట్లు తీలుస్తుందని, దీని వెనుక ఇంకా ఏవరెవారు ఉన్నదనే విషయం విచారణలో తెలితుందన్నారు. ఎంతటి వారు ఉన్నా వదిలే ప్రసక్తి లేదని వెల్లడించారు. త్వరలోనే నిందితులను అరెస్ట్ చేస్తామని వెల్లడించారు.

## భక్తిశ్రద్ధలతో ఘనంగా శ్రీ కోదండరామస్వామివారి ఆస్థానం

తిరుపతి, 2026 మే 08 అన్నమయ్య జయంతి ఉత్సవాల్లో భాగంగా తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో శుక్రవారం ఉదయం శ్రీ కోదండరామస్వామివారి ఆస్థానం వైభవంగా నిర్వహించారు. శ్రీరామనామ స్మరణతో, గోవింద నామసంకీర్తనల మధ్య జరిగిన ఈ కార్యక్రమం భక్తులను ఆధ్యాత్మిక ఆనందంలో ముంచెత్తింది.ముందుగా శ్రీ కోదండరామస్వామివారి ఆలయం నుండి ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాల నడుమ అన్నమాచార్య కళామందిరానికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు భక్తిరసభరిత సంకీర్తనలను ఆలపించి శ్రీరామ భక్తిని పరవశింపజేశారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులను తిరిగి ఆలయానికి తీసుకెళ్లారు.ఉదయం నిర్వహించిన సంగీత కార్యక్రమాల్లో అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు "రామచంద్రుడితడు రఘువీరుడు", "జయతు జయతు మంత్రం జన్మసాఫల్య మంత్రం", "జయ జయ రామ", "రాముడు రాఘవుడు" తదితర సంకీర్తనలను మధురంగా ఆలపించి భక్తులను అలరించారు.తదనంతరం తిరుపతికి చెందిన శ్రీ హేమప్రకాశ్ బృందం గాత్ర సంగీత సేవ అందించగా, శ్రీ వేంకటేశ్వర్లు భాగవతార్ హరికథా గానం ద్వారా శ్రీరాముని మహిమను భక్తులకు వినిపించారు.

# హద్దుల్లో వుండాలి..హుందాగా మాట్లాడాలి - కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



సికింద్రబాద్ కరీంనగర్ లో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ సర్కార్ నిధులతో నిర్మించింది. అక్కడ బూతులు తిడుతూ ప్రెస్ మీట్ పెట్టడం కరెక్టా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. శుక్రవారం నాడు అయన సికింద్రాబాద్ సురభి గార్డెన్స్ వద్ద మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ పై దాడి చేయాలనే ఆలోచనే కార్యకర్తలకు లేదు. అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ అరాచకాలు గుర్తులేవా? కేటీఆర్ సిరిసిల్ల వచ్చినప్పుడల్లా బీజేపీ కార్యకర్తలను పెట్టిన హింస గుర్తుకు రాలేదా? ప్రజా సంగ్రామ యాత్రలో బీజేపీ కార్యకర్తలపై చేసిన రాళ్ల దాడులను మర్చిపోతామా? వడ్ల కొనుగోలు కేంద్రాల పరిశీలనకు వెళ్లినప్పుడు ఉమ్మడి నల్లగొండలో మాపై కర్రలతో, రాళ్లతో చేసిన దాడులు గుర్తు లేవా? మహిళా కార్యకర్తలను, రైతులను ఎత్తుకుపోయిన బీఆర్ఎస్ గూండాలు చేసిన దాడులను మర్చిపోతామా? ఇయాళ సిగ్గులేకుండా బూతులు తిడితే ఊరుకుంటారా? బీజేపీ ఎన్నడూ దాడులను ప్రోత్సహించదని అన్నారు.అయితే బీజేపీ కార్యకర్తల సహనాన్ని చేతగానితనంగా భావించొద్దు. అరాచకాలు, దాడులకు కేరాఫ్ అడ్రస్ బీఆర్ఎస్సే. అధికారంలో ఉన్నప్పుడు దాడుల చేసి ఇప్పుడు సుద్దపూస లెక్క మాట్లాడితే సరిపోతుందా? అధికారం ఎవ్వరికీ శాశ్వతం కాదు. హద్దుల్లో ఉంటూ హుందాగా వ్యవహరిస్తే మంచిదని అన్నారు.

# ప్రాణహిత-చెవెళ్లను నిర్వీర్యం చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వం: మంత్రి వివేక్ వెంకటస్వామి

### తుమ్మిడిహెట్టి ద్వారా ఉత్తర తెలంగాణకు మళ్లీ జీవం పోస్తాం

కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా, మే 8: తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును కావాలనే బలహీనపరచి, కేవలం కమిషన్ల కోసమే మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి డా. గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. ఉత్తర తెలంగాణకు జీవనాడిగా నిలిచే ప్రాణహిత-చెవెళ్ల ప్రాజెక్టును బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు.శుక్రవారం మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాంతాన్ని సందర్శించిన మంత్రి వివేక్ వెంకటస్వామి అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రాణహిత నదికి జలహారతి ఇచ్చి, శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు.మంత్రి మాట్లాడుతూ, ప్రాణహిత-చెవెళ్ల ప్రాజెక్టు పనుల కోసం అప్పటికే సుమారు రూ.1100 కోట్లు ఖర్చు చేసి, భారీ స్థాయిలో పనులు పూర్తి చేశారని తెలిపారు. మరో రూ.25 వేల కోట్లు కేటాయించి ఉంటే ప్రాజెక్టు పూర్తయ్యేదని అన్నారు. కాకా వెంకటస్వామి గారు ఉత్తర తెలంగాణలో నీటి సమస్యల పరిష్కారం కోసం ఈ ప్రాంతానికి ప్రాజెక్టు అవసరమని భావించారని గుర్తుచేశారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఈ అవసరాన్ని గుర్తించి ప్రాణహిత-చెవెళ్ల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని పేర్కొన్నారు.తదుపరి కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వ కాలంలో ప్రాజెక్టు ఎత్తును 152 మీటర్లుగా నిర్ణయించే దిశగా ఒప్పందం జరిగిందని తెలిపారు. దాంతో మహారాష్ట్రలో సుమారు 5 వేల ఎకరాల ముంపు ఉండేదని, అందుకు పరిహారంగా రూ.5 వేల కోట్లు చెల్లిస్తే సరిపోయేదని వివరించారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం ప్రాజెక్టు ఎత్తును 148 మీటర్లకు తగ్గించి ప్రాణహిత-చెవెళ్లను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. కేవలం కమిషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని, దాని ద్వారా కొంతమంది కాంట్రాక్టర్లకు లాభం చేకూర్చారని విమర్శించారు.ఇటీవల కాళేశ్వరం ప్రాజెక్టును ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డితో కలిసి పరిశీలించామని, శాస్త్రవేత్తలు కూడా ఈ పర్యటనలో పాల్గొన్నారని తెలిపారు. భారీ వ్యయంతో కేవలం 60 టీఎంసీల నీటిని మాత్రమే ఎల్లంపల్లికి తరలించారని, అందుకు రూ.3 వేల కోట్ల వరకు విద్యుత్ బిల్లులు వచ్చాయని పేర్కొన్నారు. రూ.35 వేల కోట్ల ప్రాజెక్టును లక్ష కోట్ల రూపాయల ప్రాజెక్టుగా మార్చారని ఆరోపించారు.కేసీఆర్ తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును కూడా పూర్తి చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని విమర్శించిన మంత్రి, ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉత్తర తెలంగాణ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని తుమ్మిడిహెట్టి ద్వారా 2 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టును పునరుద్ధరించే దిశగా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తుమ్మిడిహెట్టికి వచ్చి ప్రాజెక్టుకు సంబంధించిన కార్యక్రమాలను ప్రారంభిస్తారని వెల్లడించారు. తెలంగాణకు చెందిన ప్రజాప్రతినిధులంతా కలిసి, ముఖ్యనంగా బీజేపీ నాయకులు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో చర్చించి 150 మీటర్ల ఎత్తుకు అనుమతి పొందేలా కృషి చేయాలని మంత్రి కోరారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, పాల్వాయి హరీష్ బాబు, జిల్లా కలెక్టర్ హరిత, ఎస్పీ నిఖిత పంత్ తదితరులు పాల్గొన్నారు.



## టీడీపీ కేంద్ర కార్యాలయం వద్ద గిరిజనుల ధర్నా

తాడేపల్లి టీడీపీ కేంద్ర కార్యాలయం వద్ద గిరిజనులు ధర్నాకు దిగారు. మంత్రి కొల్లి రవీంద్ర అనుచరుడు పామర్తి రాజా తమతో పనులు చేయించుకొని 200 మందికి డబ్బులు ఇవ్వటం లేదని ఆందోళన కు దిగారు. డబ్బుల కోసం పామర్తి రాజా కోసం తిరుగుతున్న పట్టించుకోకుండా అవమానపరుస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేసారు. తమకు ఇవ్వాల్సిన రూ.1.50 కోట్లు ఇచ్చేవరకు ఆందోళన కొనసాగిస్తామంటూ టీడీపీ ఆఫీస్ గేటు ఎదుట గిరిజనులు బైఠాయించారు. వీరంతా న ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజవర్గం జి. కొండూరు మండలం కట్టుబడి పాలెం కు చెందినవాల్లు.

## 3,50,000 లంచం తీసుకుంటూ ఏసిబికి పట్టుబడ్డ భద్రాచలం ఎఫ్ డి ఓ, తేగడ ఎఫ్ ఆర్ ఓ



భద్రాద్రి అటవీ శాఖలో మరోసారి అవినీతి బాగోతం బయటపడింది. కేసు నమోదు చేయకుండా ఉండేందుకు లక్షల రూపాయలు డిమాండ్ చేసిన అటవీ శాఖ అధికారులను ఏసీబీ రెడ్ హ్యాండెడ్గా పట్టుకుంది. భద్రాచలం అటవీ విభాగంలో చోటుచేసుకున్న ఈ ఘటన ఇప్పుడు తీవ్ర సంచలనంగా మారింది

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అటవీ శాఖ అవినీతి మరోసారి బట్టబయలైంది. చర్ల మండలం పూసుగుప్ప ప్రాంతంలో జరుగుతున్న రోడ్డు పనుల సందర్భంగా కొన్ని అటవీ శాఖ చెట్లు దెబ్బతిన్నాయని పేర్కొంటూ, సంబంధిత కాంట్రాక్టర్పై కేసు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు. అయితే? కేసు నమోదు చేయకుండా ఉండాలంటే భారీగా లంచం ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. భద్రాచలం డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ సుజాత ఏకంగా రూ. 10 లక్షలు డిమాండ్ చేసినట్లు సమాచారం.

దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఫిర్యాదు ఆధారంగా రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు పక్కా వ్యూహంతో ఉచ్చుపన్ని, గురువారం భద్రాచలం కార్యాలయంలో తొలి విడతగా రూ. 3 లక్షల 50 వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా ఎఫ్డీఓ సుజాతతో పాటు చర్ల ఇన్చార్జ్ డీఆర్ఓ కృష్ణయ్యను రెడ్ హ్యాండెడ్గా పట్టుకున్నారు.

ఏసీబీ డీఎస్పీ వై. రమేష్ ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగినట్లు తెలుస్తోంది. పట్టుబడిన అధికారులను అదుపులోకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్నారు.

## టీకా బాలికలకు ఒక వరం. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ అధికారి బి వెంగయ్య.



బద్వేలు 14 సంవత్సరాలు నిండిన బాలికలకు గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ రాకుండా హెచ్ పి వి టీకా ఒక వారం లాంటిదని ,డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ అధికారి బి వెంగయ్య అన్నారు. బద్వేల్ మండలం కొత్తచెరువు, రంగాపురంలో శుక్రవారం హెచ్ పి వి పై అవగాహన కార్యక్రమం, ఫ్రైడే డ్రైడే కార్యక్రమం జరిగింది. వైద్య సిబ్బంది ఇంటింటి ఫీవర్, లార్వా సర్వేను నిర్వహించి, లార్వా ఉన్న నీటిని పడవేయించారు. 14 సంవత్సరాలు కలిగిన బాలికలకు హెచ్పీవీ టీకాలు వేయించాలి. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే పాటించాలి. పరిసరాలను శుభ్రంగా పెట్టుకోవాలి. సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటూ, బ్యానర్లు చేతపట్టి, వైద్య సిబ్బంది పలు వీధులలో ర్యాలీని నిర్వహించి, నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ అధికారి మాట్లాడుతూ, హెచ్ పి వి టీకా బాలికలకు సంజీవని లాగా పని చేస్తుందన్నారు. సరైన సమయంలో పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించి, మెరుగైన ఆరోగ్యం అందించేటట్లు పిల్లల తల్లిదండ్రులు చేయాలన్నారు. హెల్త్ అసిస్టెంట్ జనార్దన్ రావు మాట్లాడుతూ, నిల్వ ఉన్న నీరు ,తడి ప్రదేశాలలో అఫ్టేట్, ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ ను చల్లిస్తున్నామన్నారు. 104, విలేజ్ హెల్త్ క్లినిక్, అవసరమైన చోట మెడికల్ క్యాంపులను నిర్వహించడం ద్వారా ,ప్రజల వద్దకే వైద్యం అందుతుందన్నారు. అన్ని జబ్బులకు ప్రభుత్వ ఆసుపత్రులలో మందులు సమృద్ధిగా ఉన్నాయన్నారు. ప్రైవేట్ ఆస్పత్రిలో పోయి వేల రూపాయలు పోగొట్టుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ వీణ, ఏఎన్ఎం దీపిక, ఆశలు, ప్రజలు పాల్గొన్నారు.

## కోటి రూపాయలతో డివిజన్ రెజిమెంటల్ బజార్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆధునీకరణ



సికింద్రాబాద్ రూ 1 కోటి రూపాయలు పైగా నిధులతో మోండా డివిజన్ రెజిమెంటల్ బజార్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆధునీకరణ చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. మహావీర్ ఇంటర్నేషనల్ ఉడాన్ ట్రస్ట్ ఔఊ సంస్థ ఆధ్వర్యంలో కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (ఆఖీ ఫండ్స్) నిధులతో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను నా చొరవతో కార్పోరేట్ స్కూల్స్ కు ధీటుగా ఆధునీకరణ చేయడానికి ముందుకు రావడంతో వారికి ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని అనుమతులను ఇప్పించానని అన్నారు. శుక్రవారం నాడు పాఠశాలను మహావీర్ ఇంటర్నేషనల్ సంస్థ, విద్యార్థులు, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి సందర్శించి విద్యార్థులకు ఏమేం సౌకర్యాలు కావాలో తెలుసుకుని దానికి అనుగుణంగా నిర్మాణ పనులను చేపట్టాలని సూచించడం జరిగింది.

## గోవింద నామస్మరణతో వైభవంగా శ్రీ వేదనారాయణస్వామివారి రథోత్సవం

తిరుపతి, 2026 మే 08 భక్తిశ్రద్ధలతో రథాన్ని లాగిన భక్తజనంమే 9న చక్రస్నానం, ధ్వజావరోహణంనాగలాపురం శ్రీ వేదనారాయణస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు శుక్రవారం ఉదయం జరిగిన రథోత్సవం భక్తి పారవశ్యంలో అంగరంగ వైభవంగా జరిగింది. గోవింద నామస్మరణలు, మంగళ వాయిద్యాలు, భజనల నడుమ స్వామివారి రథయాత్ర గ్రామ వీధులను ఆధ్యాత్మిక కాంతులతో నింపింది. ఉదయం 6.25 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేదనారాయణస్వామివారు మహారథాన్ని అధిష్ఠించి నాలుగు మాడ వీధుల్లో విహరించారు. డప్పు వాయిద్యాలు, కోలాటాలు, భజన బృందాల నృత్యాలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. “గోవిందా? గోవిందా?” నామస్మరణల మధ్య భక్తులు భక్తిశ్రద్ధలతో రథాన్ని లాగి తమ భక్తిని చాటుకున్నారు. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పించి స్వామివారి కృపకు పాత్రులయ్యారు. రథం యథాస్థానానికి చేరుకున్న అనంతరం వేదపారాయణం, ప్రబంధం, శాత్తుమొర నిర్వహించి మహాహారతి సమర్పించారు. రథోత్సవం ఆధ్యాత్మికంగా విశిష్టమైన తత్వాన్ని తెలియజేస్తుంది. శరీరమే రథం, బుద్ధి సారథి, మనస్సు పగ్గం, ఇంద్రియాలే గుర్రాలు, ఆత్మ రథికుడనే భావన ద్వారా ఆత్మానాత్మ వివేకాన్ని ఈ ఉత్సవం భక్తులకు బోధిస్తుంది. అనంతరం ఉదయం 11 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు స్వామివారు, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. రాత్రి 7.30 గంటలకు అశ్వవాహన సేవ జరగనుంది. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, సూపరింటెండెంట్ శ్రీ శ్రీనివాసులు రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ శ్రీ చెంగల్ రాయులు తో పాటు విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మే 9న చక్రస్నానంబ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 10.30 నుండి 11.45 గంటల వరకు చక్రస్నానం వైభవంగా జరుగనుంది. రాత్రి 7.30 గంటలకు ధ్వజావరోహణంతో వార్షిక బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

## ఈ నెల 15వ తేదీ నుంచి ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ కు వస్తున్న “తిమ్మరాజుపల్లి టీవీ” సినిమా




న్యూ టాలెంట్ ను ఎంకరేజ్ చేస్తూ హీరో కిరణ్ అబ్బవరం సుమైర స్టూడియోస్ తో కలిసి తన కేఏ ప్రొడక్షన్స్ పై నిర్మించిన సినిమా “తిమ్మరాజుపల్లి టీవీ”. తేజ వేల్పుచర్ల సహ నిర్మాతగా వ్యవహరించారు. ఈ చిత్రంతో సాయి తేజ్, వేద జలంధర్ హీరో హీరోయిన్స్ గా నటించారు. “తిమ్మరాజుపల్లి టీవీ” చిత్రంతో వి. మునిరాజు దర్శకుడిగా పరిచయమయ్యారు. విలేజ్ బ్యాక్ డ్రాప్ లో సాగే పీరియాడిక్ డ్రామాగా రూపొందిన ఈ సినిమా ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చి ఘన విజయాన్నిసొంతం చేసుకుంది.

తాజాగా ఈ సినిమా డిజిటల్ ప్రీమియర్ కు సిద్ధమయ్యింది. “తిమ్మరాజుపల్లి టీవీ” సినిమా ఈ నెల 15వ తేదీ నుంచి ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ కు రాబోతోంది. ఆహా గోల్డ్ యూజర్స్ 24 గంటల ముందుగానే ఈ చిత్రాన్ని చూడొచ్చు. థియేట్రికల్ గా ప్రేక్షకుల్ని అలరించిన “తిమ్మరాజుపల్లి టీవీ” సినిమా ఇప్పుడు ఆహా ద్వారా మరింతమంది ఆడియెన్స్ కు చేరువకానుంది.

నటీనటులు – సాయి తేజ్, వేద జలంధర్, ప్రదీప్ కొట్టె, స్వాతి కరిమిరెడ్డి, అమ్మ రమేష్, సత్యనారాయణ, లతీష్, తదితరులు

## 'పవర్‌పేట' మూవీ పవర్‌ఫుల్ గ్లింప్స్ రిలీజ్



విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నేతృత్వంలోని ప్రముఖ బ్యానర్ 70ఎఎ ఎంటర్‌టైన్‌మెంట్స్ మరో క్రేజీ ప్రాజెక్ట్ తో రాబోతుంది. బలమైన కథనంతో కూడిన సినిమాలకు మద్దతు ఇవ్వడంలో పేరుపొందిన ఈ నిర్మాణ సంస్థ తన తదుపరి ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించింది. సందీప్ కిషన్ కథానాయకుడిగా నటిస్తుండగా, రచయిత నుంచి దర్శకుడిగా మారిన కృష్ణ చైతన్య దర్శకత్వం వహిస్తున్నారు. సందీప్ పుట్టినరోజు సందర్భంగా, పవర్‌పేట చిత్ర నిర్మాతలు ఆకట్టుకునే గ్లింప్స్‌ను విడుదల చేశారు.

ఈ గ్లింప్స్ థియేటర్‌లో ఫస్ట్ డే ఫస్ట్ షో హంగామాతో హై వోల్టేజ్ మూడ్‌లో ప్రారంభమవుతుంది. అభిమానుల అరుపులు, సంబరాల మధ్య హీరో ఎంట్రీ, సిగరెట్ తాగుతూ సింహం గురించి పవర్‌ఫుల్ డైలాగ్ చెప్పడం అలరించింది ఆ తర్వాత ఆ నేల స్వభావం, దానికి శక్తినిచ్చే మనుషుల గురించి చెబుతూ తన పాత్ర ఇంటెన్స్ చూపించారు. థియేటర్ స్క్రీన్‌పై బాణాసంచా విసిరే సీన్‌తో గ్లింప్స్ మరింత మాస్ ఫీల్‌ను అందించింది.

సందీప్ కిషన్ ఈ సినిమాలో రగ్డ్ పీరియాడిక్ అవతార్‌లో కనిపించారు. స్టైలిష్ షేడ్స్, కలర్‌ఫుల్ కాస్ట్యూమ్స్, రా అటిట్యూడ్‌తో ఆయన లుక్ ఆకట్టుకుంటోంది. ‘సేనాపతి రవి’ అనే పాత్ర పేరును రివీల్ చేయడం ద్వారా ఆ క్యారెక్టర్‌లోని డామినేషన్, ఇంటెన్సిటీని సూచించారు. సందీప్ స్క్రీన్ ప్రెజెన్స్, పవర్‌ఫుల్ డైలాగ్ డెలివరీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

దర్శకుడు కృష్ణ చైతన్య భారీ స్థాయి మాస్ క్యారెక్టరైజేషన్‌ను ఎంత బలంగా డిజైన్ చేశారో ఈ గ్లింప్స్‌లో స్పష్టమవుతోంది. పాత్ర ఎలివేషన్స్, డైలాగ్స్ ఆయన రచయితగా ఉన్న బలాన్ని మరోసారి చాటాయి. సిగరెట్ వెలిగించే చిన్న సీన్‌ను కూడా కోపం, ఆవేశంతో నింపి చూపించిన తీరు దర్శకుడి స్టైల్‌ను ప్రతిబింబిస్తోంది.

మధీ సినిమాటోగ్రఫీ పీరియాడిక్ సెటప్‌ను అద్భుతంగా చూపించగా, మణిశర్మ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రతి ఫ్రేమ్‌కు మరింత పవర్ ఇచ్చింది. నేషనల్ అవార్డ్ విన్నర్ శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్ నిర్వహిస్తుండగా, రామకృష్ణ–మోనిక ప్రొడక్షన్ డిజైన్, సచిన్ సుధాకరన్, హరిహరన్ సౌండ్ డిజైన్ చిత్రానికి ప్రత్యేకమైన టెక్స్చర్‌ను తీసుకొస్తున్నాయి.

ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే ఫస్ట్ షెడ్యూల్ విజయవంతంగా పూర్తయింది.

తారాగణం: సందీప్ కిషన్

## శ్రీ కొండాలమ్మ అమ్మవారి కృపతో గుడివాడ మరింత అభివృద్ధి చెందాలి: గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

**వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో 14 షాపుల కాంప్లెక్స్ ప్రారంభం**

**దాతల సహకారంతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము**

**అమ్మవారికి ప్రత్యేక పూజలు – వేద పండితుల ఆశీర్వచనం పొందిన ఎమ్మెల్యే**

**దేవాలయాల అభివృద్ధిలో దాతల భాగస్వామ్యం**

వేమవరం, గుడ్లవల్లేరు, మే 8: మహిమాన్వితమైన శ్రీ కొండలమ్మ అమ్మవారి కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆకాంక్షించారు. అమ్మవారి కృపతో గుడివాడ మరింత అభివృద్ధి చెందాలని ఆయన అమ్మవారిని ప్రార్థించారు. కృష్ణాజిల్లాలో ప్రసిద్ధిగాంచిన గుడ్లవల్లేరు మండలం వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన 14 షాపుల షాపింగ్ కాంప్లెక్స్ భవనాన్ని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ముందుగా ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే రాము శ్రీ కొండలమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దివ్య అనుగ్రహం ప్రజలందరిపై ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా విరాజిల్లాలని ప్రార్థించారు. అనంతరం వేద పండితులు ఎమ్మెల్యేకు వేద ఆశీర్వచనాలు అందించగా, ఆలయ సంప్రదాయం ప్రకారం దేవాదాయ శాఖ అధికారులు ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ, “దేవాలయాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు నిలయాలన్నారు. అమ్మవారి సన్నిధిలో ఈ షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. దేవాలయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందనీ,ఇందులో దాతల భాగస్వామ్యం అభినందనీయమన్నారు. 14 దుకాణాల నిర్మాణానికి సహకరించిన దాతలందరికీ అమ్మవారి కృప ఎల్లప్పుడూ ఉంటుంది” అని అన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు తన సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని, నియోజకవర్గంలో దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం తరపున అన్ని చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు

# మహానాడు లో రక్తదానం మెడికల్ క్యాంపు కమిటీలో బద్వేల్డాక్టర్ ఓబులాపురం రాజశేఖర్

బద్వేలు తెలుగుదేశం పార్టీ ప్రతి సంవత్సరము మే 26-28 తేది లలో మహానాడు కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతుంది. ఈ సంవత్సరము నెల్లూరు జిల్లాలో జరుగుతుంది.ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుండి ప్రతి విభాగంలో కమిటీ లను నారా చంద్రబాబు నాయుడు , లోకేష్ స్వయంగా పరిశీలించి ఏర్పాటు చేశారు.రక్తదానం, మెడికల్ క్యాంపు కమిటీ నందు బద్వేలు నియోజకవర్గం నుండి డాక్టర్ ఓబుళాపురం రాజశేఖర్ ను కమిటీ సభ్యులు గా నిన్న విడుదల చేసిన జాబితా లో నియమించడం జరిగింది.కడప జిల్లా నుండి కేవలం ఐదు మంది ని మాత్రమే తీసుకోవడం జరిగింది అందులో బద్వేలు నియోజకవర్గం నుండి డాక్టర్ రాజశేఖర్ మహానాడు కమిటీల్లో వున్నారు.గతంలో కూడా అనంతపురం లో జరిగిన సూపర్ సిక్స్ -సూపర్ హిట్ ప్రోగ్రాం నందు, కర్నూల్ లో జరిగిన ప్రధానమంత్రి సూపర్ జిఎస్టి - సూపర్ సేవింగ్స్ ప్రోగ్రాం బహిరంగ సభకు కూడా డాక్టర్ రాజశేఖర్ పార్టీ ఆదేశానుసారం వైద్య సేవలు అందించారు.ఈ సందర్భంగా డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ పార్టీ తన సేవలను వినియోగించు కుంటున్నందులకు హర్షం వ్యక్తం చేశారు, తన అదృష్టం గా భావిస్తున్నట్లు తెలియజేసారు. మహానాడు సభ విజయవంతం కావాలని కోరుకుంటున్నట్లు తెలియజేసారు. బద్వేలు నియోజకవర్గం నుండి కార్యకర్తలు, నాయకులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని విజయవంతం చెయ్యాలని, ఎండ తీవ్రతకు తగిన జాగ్రత్త లు తీసుకోవాలని ప్రజలకు సూచించారు

# ప్రధాని మోదీ పర్యటనతో తెలంగాణలో బీజేపీ మరింత బలోపేతం: చొప్పరి జయశ్రీ

కరీంనగర్ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై కరీంనగర్ 12 డివిజన్ కార్పొరేటర్ చొప్పరీ జయశ్రీ మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అందించిన సహకారంపై వీరిద్దరికి అవగాహన లేనట్లు మాట్లాడుతున్నట్టు ఉందన్నారు. శుక్రవారం కరీంనగర్ లో విలేకరుల సమావేశంలో చొప్పరి జయశ్రీ మాట్లాడుతూ.ఈ పన్నెండు ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణ రాష్ట్రానికి అందించిన సహకారంపై తాము ఎప్పుడు చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు.హైదరాబాద్‌లో ప్రధాని మోదీ సభ తరువాత తెలంగాణలో బిజెపి పార్టీ మరింత బలోపేతం అవుతామని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు.ఇది ఎన్నికలకు సంబంధించిన కార్యక్రమం కాదన్నారు.ఇది అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అంశమని ఆమె పేర్కొన్నారు. రూ.9 వేల కోట్ల అభివృద్ధి పనులకు మోదీ నేరుగా తెలంగాణలో శంకుస్థాపన చేయనున్నారని ఆమె తెలిపారు.ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల కంటే ముందే ప్రధాని మోదీ తెలంగాణ పర్యటన ఖరారు అయిందని ఆమె అన్నారు. తమిళనాడులో రాజ్యాంగ బద్ధంగా ఏ ప్రభుత్వం అయినా ఏర్పాటు చేయవచ్చునన్నారు కరీంనగర్ 12 డివిజన్ కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ అన్నారు.

# చలో అమరావతి..పేదల ఇంటి స్థలాల కోసం 'ప్రజానాట్యమండలి' సమరశంఖం!...?

## సర్వే నెంబర్ 30 నిరుపేదలకే సొంతం కావాలి.. కలెక్టరేట్ వద్ద హోరెత్తిన నిరసన!.. కార్పొరేట్లకు ఎకరాలు.. పేదలకు సెంట్లు ఇవ్వరా?...

రేణిగుంట ప్రభుత్వ వైఖరిపై చిన్నం పెంచలయ్య ధ్వజం!...పేద ప్రజల ఇంటి స్థలాల సమస్య పై మన ఆక్రందన రాజధాని లో ధ్వనించే టట్లు ఉద్యమం చేపట్టాలని ప్రజానాట్యమండలిరాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య పిలుపునిచ్చారు. సర్వే నెంబర్ 30లో ఇంటి స్థలాల కేటాయించాలని కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే నిరసన కార్యక్రమం ఈరోజు మూడవ రోజు చేరింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్న సమస్య పరిష్కారం చేయనందు వల్ల ఛలో అమరావతికి తరలి వెళ్లాలని పేద ప్రజలకు పిలుపునిచ్చారు. గతంలో పాదయాత్రలో లోకేష్ బాబు సర్వేనెంబర్ 30లో ఇంటి స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఆహామీను గుర్తు చేసేటట్లు రాజధానిలో ఆయనను కలిసి విజ్ఞప్తి చేయాలని కోరారు. స్థలాన్ని కొంతమంది కబ్జాదారులు ఆక్రమించుకుని వ్యాపారం చేయదలుచుకుంటే ఎర్రజెండా చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. పెద్ద పెద్ద పరిశ్రమ ఆధిపతులకు ఎకరా ఒక రూపాయికి ఇచ్చే ప్రభుత్వం పేదలకు రెండు సెంట్లు ఇంటి స్థలాలకి ఇవ్వడానికి మాత్రం వెనకడుగు వేయడం చాలా దారుణం అన్నారు. అంటే ఈ ప్రభుత్వం ఓట్లకు మాత్రమే పేదల ప్రజలను



వాడుకొని, పరిపాలన మాత్రం కార్పొరేట్లకు అనుకూలంగా చేయడం చాలా దారుణం అన్నారు. కావున ఇప్పటికైనా ప్రభుత్వం తన వైఖరిని మార్చుకొని సర్వే నెంబర్ 30లో పేదల ప్రజలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరారు. దళిత హక్కుల పోరాట కమిటీ నాయకులు డాక్టర్ బలరాం , కాళయయ్య మాట్లాడుతూ పోరాటం చేస్తున్న నాలుగు కాలనీ వాళ్లు నూటికి 80 శాతం దళితులుగా ఉన్నారు. దళితులకు న్యాయం చేసే ప్రభుత్వం మాది అని చెబుతున్న ప్రభుత్వం ఈ దళితులకు న్యాయం చేయాలని కోరారు. విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ నాయకుడు ఉదయ్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు అందరూ ఈ ఉద్యమంలో పాల్గొని వీరికి న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తారని తెలిపారు. తారక రామనగర్ పేదల పోరాట కమిటీ నాయకులు ఈ సందర్భంగా వీరికి మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు భాను మరియు దాము హరి కోటి పెంచలయ్య బాల ధనలక్ష్మి భువన యశోదమ్మ సుబ్బలక్ష్మి అమ్మ..తదితరులు పాల్గొన్నారు

# మానసిక స్థితి సరిగా లేని మహిళకు ఆశ్రయం కల్పించిన పోలీసులు..?



రేణిగుంట పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని విమానాశ్రయం సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఒక మహిళను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం ఉదయం సుమారు 10 గంటల సమయంలో 40 ఏళ్ల వయస్సు గల మహిళ ఒంటరిగా తిరుగుతుండటాన్ని గమనించిన పోలీసులు ఆమెను స్టేషన్‌కు తరలించి విచారించారు.?విచారణలో సదరు మహిళ తన పేరు చంద్రకళ అని తెలిపినప్పటికీ, తన స్వగ్రామం లేదా కుటుంబ సభ్యుల గురించి సరైన వివరాలు చెప్పలేకపోతోంది. ఆమె తెలుగు మరియు హిందీ భాషల్లో అసంబద్ధంగా మాట్లాడుతుండటంతో ఆమె మానసిక స్థితి సరిగా లేనట్లు పోలీసులు నిర్ధారించారు. ప్రస్తుతం ఆమెకు రక్షణ, ఆశ్రయం మరియు అవసరమైన వైద్య సహాయం అందించడం కోసం తిరుచానూరులోని మహిళా ప్రాంగణంలో తాత్కాలికంగా చేర్పించారు.?ఈ మహిళకు సంబంధించిన బంధువులు లేదా ఆమె వివరాలు తెలిసిన వారు ఎవరైనా ఉంటే వెంటనే రేణిగుంట పోలీస్ స్టేషన్ అధికారులను సంప్రదించాలని కోరుతున్నారు. ఆమె ఆచూకీ కనుగొనడంలో ప్రజలు సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# పట్టణాభివృద్ధి పథకాలపై పార్లమెంటరీ స్థాయి సంఘం సమీక్ష...

**కేంద్ర పట్టణాభివృద్ధి పథకాల అమలుపై సమగ్ర సమీక్ష...?**
**నగరాల పునరుద్ధరణ మరియు మౌలిక వసతుల కల్పన..?**
**స్వచ్ఛ భారత్ మరియు పట్టణ పారిశుధ్య నిర్వహణ...?**
**నగర పేదల గృహ నిర్మాణ పథకాల పురోగతి?**
**వీధి వ్యాపారుల ఆర్థికాభివృద్ధి మరియు రుణాల మంజూరు...?**
**సమీకృత నియంత్రణ కేంద్రాల పనితీరు పరిశీలన..?**

తిరుపతి, పార్లమెంటరీ గృహ నిర్మాణ మరియు పట్టణ వ్యవహారాల స్థాయి సంఘం అధ్యయన పర్యటనలో భాగంగా నేడు తిరుపతిలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించబడింది. కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులు, వివిధ విభాగాల అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర గృహ నిర్మాణ మరియు పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన వివిధ పథకాల అమలు మరియు పురోగతిపై సభ్యులు చర్చించారు.




ముఖ్యంగా నగరాల పునరుద్ధరణ, పట్టణ పరివర్తన పథకాలు, స్వచ్ఛ భారత్ కార్యక్రమం, నగర గృహ నిర్మాణ యోజన, వీధి వ్యాపారుల స్వయం సమృద్ధి నిధి, పట్టణ సవాళ్ల నిధి, జాతీయ పట్టణ డిజిటల్ మిషన్ మరియు విద్యుత్ బస్సుల సేవలపై లోతైన సమీక్ష జరిగింది.?అదేవిధంగా సమీకృత కమాండ్ మరియు నియంత్రణ కేంద్రాల పనితీరు, వాటి నిర్వహణ అంశాలను అధికారులు పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వ నిర్మాణ సంస్థలు మరియు గృహ నిర్మాణ అభివృద్ధి సంస్థలు పట్టణ మౌలిక వసతుల కల్పనలో పోషిస్తున్న పాత్రపై చర్చించారు. తిరుపతి నగర పాలక సంస్థతో పాటు ఇతర పట్టణ స్థానిక సంస్థల మానవ వనరుల సామర్థ్యం, ఆదాయ వనరుల సమీకరణ మరియు బడ్జెట్ నిర్వహణ అంశాలపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. తిరుపతి వంటి వారసత్వ మరియు ఆధ్యాత్మిక నగరాల స్థిరమైన పట్టణాభివృద్ధి, రాష్ట్రంలోని మురికివాడల పునర్వ్యవస్థీకరణ మరియు పునరావాస కార్యక్రమాల అమలు వంటి అంశాలపై కూడా చర్చలు జరిగాయి. ఈ పర్యటన ద్వారా తిరుపతి నగరాభివృద్ధి, పట్టణ పరిపాలన బలోపేతం మరియు మౌలిక వసతుల విస్తరణకు దోహదపడే కీలక సూచనలు వెలువడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.?అనంతరం మెప్మా వారి ఆధ్వర్యంలో మూడు వేల ఏడు వందల యాభై రెండు మంది వీధి వ్యాపారులకు మొదటి, రెండో మరియు మూడో విడతల కింద పదిహేను కోట్ల అరవై తొమ్మిది లక్షల రూపాయలను మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో లోక్‌సభ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, స్థానిక శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు, రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, మెప్మా నిర్వహణ సంచాలకులు కరుణ, స్వచ్ఛ ఆంధ్ర మరియు టిడ్కో విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అలాగే తిరుపతి నగరాభివృద్ధి సంస్థ అధ్యక్షుడు డాలర్స్ దివాకర్ రెడ్డి, జిల్లా సంయుక్త కలెక్టర్ గోవిందరావు, నగర పాలక సంస్థ కమిషనర్ శారద, తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారి రవిచంద్ర మరియు వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రతినిధులు హాజరయ్యారు.

# రుయా ఆసుపత్రిలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి సూపరింటెండెంట్ కు సిఐటియు వినతి

తిరుపతి రుయా ఆసుపత్రిలో పనిచేస్తున్న ఎమ్ఎన్ఓ, ఎఫ్ఎన్ఓలు మరియు నాలుగో తరగతి ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి, రుయా ఆసుపత్రి వర్కింగ్ ప్రెసిడెంట్ కె. వేణుగోపాల్ మాట్లాడుతూ ఆసుపత్రిలో బెడ్ల సంఖ్యకు తగినంత మంది సిబ్బంది లేకపోవడంతో ప్రస్తుతం పనిచేస్తున్న కార్మికులపై అధిక పనిభారం పడుతోందన్నారు. రోజురోజుకు ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఎమ్ఎన్ఓ, ఎఫ్ఎన్ఓలు మరియు ఇతర సహాయక సిబ్బందిని తక్షణమే నియమించాలని కోరారు. ముఖ్యంగా చిన్నపిల్లల వార్డులో ఒక్క



ఎమ్ఎన్ఓ, ఎఫ్ఎన్ఓ మాత్రమే విధులు నిర్వహించడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అక్కడ కూడా తగిన సిబ్బందిని ఏర్పాటు చేయాలని కోరారు. మొత్తం 12 సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సూపరింటెండెంట్‌కు అందజేశారు.వినతిపత్రంపై స్పందించిన రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్ మాట్లాడుతూ తన పరిధిలో ఉన్న సమస్యలను తప్పకుండా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఇప్పటికే కొన్ని మార్పులు చేపట్టినట్లు తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధి, రోగులకు మెరుగైన వైద్యం అందించడంలో యాజమాన్యం?ఉద్యోగులు కలిసి ఐక్యతతో పనిచేయాలని సూచించారు. కుటుంబ సభ్యుల్లా కలిసి పనిచేస్తే ఆసుపత్రికి మంచి పేరు తీసుకురాగలమన్నారు.అలాగే ఇటీవల కొత్తగా జాయిన్ అయిన 12 మంది ఎఫ్ఎన్ఓ, ఎమ్ఎన్ఓలకు గత ఆరు నెలలుగా పూర్తిస్థాయి వేతనాలు అందక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని నాయకులు ప్రస్తావించగా, ఆ సమస్య పరిష్కారానికి ఇప్పటికే చర్యలు ప్రారంభించామని, త్వరలోనే సానుకూల పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని సూపరింటెండెంట్ తెలిపారు.ఈ కార్యక్రమంలో రుయా ఆసుపత్రి నాలుగో తరగతి ఉద్యోగస్తుల సంఘం కార్యదర్శి ఏ. నరసింహులు, అధ్యక్షులు జి. మునిచంద్ర, కోశాధికారి శివకుమార్, కార్యదర్శి బి. గురవయ్య, మధు, నాంపల్లి సుబ్రహ్మణ్యం, రాధా, నాగ, పద్మలత, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామంలోకి రాకుండా హిజ్రాలపై నిషేధం.?



హైదరాబాద్ తెలంగాణలో హిజ్రాల ఆగడాలు శ్రుతిమించడంతో నిజామాబాద్ జిల్లా భీమగల్ మండలం బడా భీమగల్ గ్రామ పెద్దలు కీలక నిర్ణయం తీసుకున్నారు. వారు ఊర్లోకి రాకుండా నిషేధం విధిస్తూ గ్రామ అభివృద్ధి కమిటీ విడిసి తీర్మానం చేసింది.పెళ్లిళ్లు, గృహప్రవేశాలు,ఇతర శుభకార్యాల సమయంలో రూ.వేలల్లో డబ్బులు డిమాండ్ చేస్తూ వేధింపులకు గురిచేస్తుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. మరి మీ ఏరియాలోనూ హిజ్రాల ఇబ్బందులు ఉన్నాయా.

## జన గణన అవగాహన వాక్ ర్యాలీని ప్రారంభించిన జిల్లా కలెక్టర్




**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి మే 08 2026 ములుగు**జనగణన--2027లో ప్రతి పౌరుడు స్వయంగా తమ కుటుంబ వివరాలను నమోదు చేసుకునేలా జిల్లా ప్రజలకు అవగాహన కల్పించేందుకు జనగణనపై శుక్రవారం ఉదయం కలెక్టరేట్ కార్యాలయం వద్ద "జనగణన అవగాహన వాక్" ను చేపట్టారు. ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు హాజరై, జనగణన అవగాహన వాక్ ను జెండా ఊపి ప్రారంభించి ప్రజలకు జనగణన ప్రాముఖ్యతను వివరించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్



మహేందర్ జి, ఆర్డీఓ వెంకటేష్, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలు,సిబ్బంది, యువత, విద్యార్థులు, పట్టణ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన ఆత్మ చైర్మన్ కర్ల అరుణ మరియు మాజీ మండల అధ్యక్షులు చిటమట రఘు

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి మే 07 2026 ఏటూరు నాగారం** ఆత్మ చైర్మన్ అరుణ మాట్లాడుతూ అకాల వర్షాలతో వరి ధాన్యాన్ని సురక్షితంగా కాపాడుకోవాలి.

అకాల వర్షం వలన తడిసిన ధాన్యంను కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. రైతులు అదైర్యపడవద్దని భరోసా కల్పించిన ఆత్మ చైర్మన్ మరియు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు

తడిసిన ప్రతిగింజను ప్రభుత్వమే కొనుగులు చేస్తుంది. ప్రతి రైతుకు

అండగా మంత్రి సీతక్క ఉన్నారు

విక్రయాలకు ఎప్పటికప్పుడు వేగవంతం జరుగుతున్నాయి

వరి కొనుగోలు కేంద్రాలలో టార్పాలిన్స్ , తూర్పాల మిషన్లు రైతులకు అందుబాటులో ఉంచే విధంగా ప్రభుత్వం చూస్తుంది

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి ప్రభుత్వం. అని రైతులకు ఒకేసారి 2 లక్షల రుణమాఫీ చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీ అని అన్నారు

సన్న వడ్లకు క్వింటాకు 500 రూపాయలు ఇచ్చిన ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ ఘనత అని అన్నారు.



బిఏటూరునాగారం మండల కేంద్రంలో అన్ని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతులను కలసి ప్రతి గింజను ప్రభుత్వమే కొంటుందని రైతులకు తెలియజేయడం జరిగింది అకాల వర్షాలు నుండి మరి ధాన్యాన్ని కాపాడుకోవాలని రైతులకు ధైర్యం చెప్పడం జరిగింది.

రైతు భరోసా ఎకరానికి 12000 రూపాయలు కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తుందని అన్నారు

బిఅకాల వర్షాల వల్ల పంట నష్టపోతే పంట నష్టపరిహారం కూడా ప్రభుత్వము చెల్లించడానికి సిద్ధంగా ఉందని తెలియజేసినారు

ఈ కార్యక్రమంలో సునార్కని శ్రీను, కందుకూరి రతన్ తదితరులు పాల్గొన్నారు

## ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి :: జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్.మహేందర్.జి.

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి మే 07 2026 ములుగు** శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ మహేందర్ జి తన ఛాంబర్ లో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ అంశాలపై జిల్లా అధికారులతో కలిసి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.



ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలు 13.05.2026 నుండి 21.05.2026, ప్రాక్టికల్ పరీక్షలు 22.05.2026 నుండి 25.05.2026 వరకు జరగనున్నాయని తెలిపారు.

విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేసి పరీక్షలను విజయవంతంగా నిర్వహించాలని, పరీక్షల నిర్వహణ కోసం జిల్లా వ్యాప్తంగా ఏడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసామని, పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలు, బందోబస్తు, ఆర్టీసీ బస్సు సౌకర్యం, పోస్టల్ సేవలు తదితర అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు.

మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ జనరల్ విభాగంలో 1050 మంది, వోకేషనల్ విభాగంలో 39 మంది, ద్వితీయ సంవత్సరం జనరల్ విభాగంలో 227 మంది, వోకేషనల్ విభాగంలో 19 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డి.ఐ.ఇ.ఓ నాయిని వీరేందర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు తీరని కష్టాలు రైతుల పాలిట శాపంగా మారిన అకాల వర్షాలు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి మే 07 2026 ఏటూరు నాగారం** చేతికొచ్చిన పంటను ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఆరబోసిన వడ్లపై వరణుడు కన్నెర్ర చేశాడు దీనితో రైతుల కళ్ళలో కన్నీళ్లు వరదల మారింది ఆరు కాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చిందని ఆశపడే తరుణంలో వర్ణుడు రైతులపై కన్నెర్ర చేస్తున్నాడని మా జీవితాలతో ఆడుకుంటున్నాడని రైతులు వాపోతున్నారు అకాల వర్షాలకు తడిసిన వడ్లను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు రైతులు పండించిన పంట కటింగ్ లేకుండా కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు



## ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరాలి

### ప్రభుత్వ పథకాల అమలులో అధికారులు సమన్వయంతో పనిచేయాలి: ఎంపీ ఈటల రాజేందర్

**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం మే 8:**మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంపీ ఈటల రాజేందర్ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ (దిశ - DISHA) సమావేశం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు చామకూర మల్లారెడ్డి (మేడ్చల్), మర్రి రాజశేఖర్ రెడ్డి (మల్కాజిగిరి), బండారి లక్ష్మారెడ్డి (ఉప్పల్), మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, తో పాటు మున్సిపల్ ఛైర్మన్లు, అన్ని శాఖల కేంద్ర మరియు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో ఎంపీ ఈటల రాజేందర్ శాఖల వారీగా సమీక్ష జరుపుతూ అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు: అంగన్వాడీ కేంద్రాల్లో మెరుగైన వసతులు కల్పించాలని, గర్భిణీలు మరియు పిల్లలకు పౌష్టికాహారం అందించడంలో రాజీ పడకూడదని సూచించారు. గృహ హింసకు గురవుతున్న మహిళలకు అండగా ఉండేందుకు సఖి కేంద్రాల పనితీరుపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలన్నారు. ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుతూ మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. 10 వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న ప్రాంతాల్లో పీహెచ్సీలు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన ఆయుష్మాన్ భారత్ ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలి అన్నారు, ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన పేద కార్మికులకు అత్యవసర చికిత్సను అందించడానికి అన్ని ఆసుపత్రులలో సేవలు కల్పించడానికి కృషి చేయాలనీ మెడికల్ అధికారులను ఆదేశించారు. నగర వనాల యోజన కింద పట్టణ పార్కుల అభివృద్ధిపై దృష్టి సారించాలని, రోడ్ల విస్తరణకు సంబంధించి అటవీ శాఖ త్వరగా అనుమతులను అందించాలని అన్నారు. యువతకు ఉపాధి కల్పించడానికి గాను స్కిల్ డెవలప్మెంట్ లో శిక్షణ ఇచ్చి, ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు లభించేలా చూడాలని ఎంపీ అధికారులను కోరారు. కార్మికులకు ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనాలు అందేలా చూడాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి లేవనెత్తిన అంశంపై స్పందిస్తూ, కార్మిక శాఖ కఠిన చర్యలు తీసుకోవాలని ఎంపీ ఆదేశించారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ పారిశ్రామిక మరియు విద్యా సంస్థల్లో అవగాహన సదస్సులు నిర్వహించి, బ్యాంకులు అందించే రుణాల పై అవగాహన కల్పిస్తూ , బలహీన వర్గాలకు , విద్యార్థులకు , స్వయం సహాయ సంఘాలకు , ఇతరులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం రుణాలు మంజూరు చేయాలని సూచించారు. పరిశ్రమల శాఖ ద్వారా కేంద్ర ప్రభుత్వం అందించే వివిధ పరిశ్రమలకు రుణాలను సకాలంలో అర్హులకు అందించాలన్నారు, CSR (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధుల వివరాలను పక్కాగా సేకరించి వాటి ని వివిధ అభివృద్ధి పనులకు మౌలిక సదుపాయాలు కలిపించడానికి ఉపయోగించాలన్నారు. జిల్లా ఖనిజ నిధులను ప్రధానంగా విద్య, వైద్యం మరియు అత్యవసర మౌలిక సదుపాయాల కోసం వినియోగించాలని స్పష్టం చేశారు. కోఆపెరటివే సొసైటీలు సకాలంలో ఎన్నికలు నిర్వహించి అక్రమాలకు తావు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. చెరువులలో గుర్రపు డెక్కను



తొలగిస్తూ నీరు కలుషితమయ్యే వ్యర్థాలు చెరువులలో కలవకుండా చేపలు చనిపోకుండా సంరక్షించడానికి తగిన చర్యలు తీసుకోవాలి అన్నారు. అవసరమైన వారికీ కొత్త మంచి నీటి కనెక్షన్లు ఇస్తూ ప్రతి ఇంటికి నీరు ఏకరీతిగా సరఫరా జరిగేలా చూడాలన్నారు. నేషనల్ హైవే అధికారులు రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన జరిగేలా చెర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులు మునిసిపల్ అధికారుల సమన్వయంతో ట్రాన్స్ ఫార్మర్లు మరియు ఇతర మరమ్మతులు చేపట్టి అగ్ని ప్రమాదాలు జరగకుండా చూడాలని అన్నారు. ప్రైవేట్ పాఠశాలలు 25 % ఉచిత విద్యను అందించేలా చర్యలు తీసుకోవాలని విద్యా శాఖను ఆదేశించారు. డబల్ బెడ్ రూమ్ కి సంబంధించి స్థానిక ప్రజలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

ఈ సమావేశంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రజా సమస్యలపై అధికారులు జవాబుదారీగా ఉండాలి

మేడ్చల్ జిల్లా కేంద్ర ప్రభుత్వం నుంచి అమలయ్యే పథకాలు పై మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కలెక్టరేట్ లో జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ ఆధ్వర్యంలో దిశ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ అధ్యక్షతన జరిగిన ఈ సమీక్ష సమావేశానికి మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్(ఓఓఅ) కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి తోపాటు మేడ్చల్ జిల్లలోని మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి, మల్కాజ్గిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి, ఉప్పల్ శాసనసభ్యులు బండారు లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలు చిత్తశుద్ధితో పరిష్కరించేలా కృషి చేయాలని, ప్రజా సమస్యలపై అధికారులు జవాబుదారీగా ఉండాలని సూచించారు. కేంద్రం నుండి మంజూరైన అభివృద్ధి నిధులు సకాలంలో పనులకు ఉపయోగించాలని, పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని దిశ వేదికగా అధికారులను ఆదేశించారు. అనంతరం మల్కాజ్గిరి పార్లమెంట్ పరిధిలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ను స్థానికతను గుర్తించి అర్హులైన పేదలకు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో ఇతర ప్రాంతాల వారికి కూడా కేటాయించారని, ప్రస్తుత ప్రభుత్వం స్థానికులకు పది నుంచి పదిహేను శాతం కేటాయిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం స్థానికంగా ఉండే పేదలకు ఇళ్లను కేటాయించాలని సూచించారు.

# అమరావతిలో భూమిపూజ



అమరావతిలో Courtyard by Marriott హోటల్ ప్రాజెక్ట్‌కు భూమిపూజ నిర్వహించిన Southern Globe Hotels & Resorts

అమరావతి నగరాన్ని అంతర్జాతీయ స్థాయి హాస్పిటాలిటీ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దే దిశలో మరో కీలక ముందడుగుగా, Southern Globe Hotels & Resorts ఆధ్వర్యంలో నిర్మించబడనున్న ప్రతిష్ఠాత్మక Courtyard by Marriott హోటల్ ప్రాజెక్ట్‌కు మే 8న ఘనంగా భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంతో అమరావతి ప్రాంతంలో ప్రపంచ స్థాయి అతిథ్య సేవల అభివృద్ధికి నాంది పలికారు.





ఈ వేదికకు ముఖ్య అతిథులుగా పలువురు ప్రముఖులు హాజరయ్యారు:

శ్రీ నారా లోకేష్ గారు -- సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్ ఒ కమ్యూనికేషన్స్, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి

శ్రీ టి.జి. భరత్ గారు -- పరిశ్రమలు ఒ వాణిజ్య శాఖ మంత్రి

శ్రీ కందుల దుర్గేష్ గారు -- పర్యాటక, సాంస్కృతిక ఒ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి

అలాగే పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, పారిశ్రామ వేత్తలు మరియు వ్యాపారవేత్తలు కార్యక్రమంలో పాల్గొని ఈ ప్రాజెక్ట్ ప్రాముఖ్యతను కొనియాడారు. అమరావతి రాజధాని ప్రాంతంలో పర్యాటకం, మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాలు మరియు ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి ఈ ప్రాజెక్ట్ కీలక పాత్ర పోషించనుందని వారు అభిప్రాయపడ్డారు.

ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌ను Southern Travels Pvt. Ltd. మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ కృష్ణమోహన్ ఆలపాటి గారు, Globe Civil Projects Ltd. ఛైర్మన్ శ్రీ వేద్ ఖురానా , మరియు DeltaPure Water India మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ విక్రం కరుణాకరం భాగస్వామ్యంతో అభివృద్ధి చేస్తున్నారు.

అమరావతిలో నిర్మితమవుతున్న ఈ Courtyard by Marrio హోటల్‌ను వ్యాపార మరియు వినోద ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఆధునిక సదుపాయాలు, అంతర్జాతీయ ప్రమాణాల సేవలు మరియు ప్రీమియం అతిథ్య అనుభూతిని అందించే విధంగా తీర్చిదిద్దనున్నారు.

ఈ సందర్భంగా Southern Travels మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ కృష్ణమోహన్ ఆలపాటి మాట్లాడుతూ:

"అమరావతిలో ఈ ప్రతిష్ఠాత్మక హోటల్ ప్రాజెక్ట్‌కు భూమిపూజ నిర్వహించడం మా సంస్థకు గర్వకారణం. ప్రపంచవ్యాప్తంగా విశ్వసనీయమైన Courtyard by Marriott బ్రాండ్‌తో భాగస్వామ్యం ద్వారా అమరావతిలో అంతర్జాతీయ స్థాయి హాస్పిటాలిటీ మౌలిక వసతులను అభివృద్ధి చేయడమే మా లక్ష్యం. ఈ ప్రాజెక్ట్ ద్వారా పర్యాటకాభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి సృష్టి మరియు ప్రాంతీయ ఆర్థిక వృద్ధికి విశేషంగా దోహదపడతామని మేము విశ్వసిస్తున్నాము," అని తెలిపారు.

ప్రపంచ ప్రఖ్యాత Marriott International బ్రాండ్ ఆధ్వర్యంలో అభివృద్ధి చెందుతున్న ఈ హోటల్, అమరావతి రాజధాని ప్రాంతంలో ప్రపంచ స్థాయి హాస్పిటాలిటీ కేంద్రంగా నిలవనుంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా దేశీయ మరియు అంతర్జాతీయ పర్యాటకులు, వ్యాపారవేత్తలు మరియు ఈవెంట్ సందర్శకులు అధిక సంఖ్యలో ఆకర్షితులయ్యే అవకాశముంది. తద్వారా రవాణా, రిటైల్, షాపింగ్, వినోదం మరియు అనుబంధ రంగాల్లో ఆర్థికాభివృద్ధి పెరుగనుంది.

ఈ ప్రాజెక్ట్ ద్వారా సుమారు 600 ల మందికి పైగా ప్రత్యక్ష మరియు పరోక్ష ఉపాధి అవకాశాలు కల్పించబడనున్నాయి. వీటిలో దాదాపు 70 శాతం ఉద్యోగాలకు స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు సంస్థ వెల్లడించింది. అదనంగా, హాస్పిటాలిటీ రంగంలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి యువతకు శిక్షణ అందించనున్నారు. అలాగే స్థానిక రైతులు, కళాకారులు మరియు చిన్న వ్యాపారుల నుంచి ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థకు మరింత మద్దతు అందించనున్నారు.

వివరాలకు సంప్రదించండి: 98480 23236

# ములుగు జిల్లా అభివృద్ధిపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన మంత్రి



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి మే 07 2026 ములుగు**శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి ములుగు జిల్లా అభివృద్ధిలో ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి ప్రజలలో ప్రభుత్వం పై ఉన్న అభిప్రాయాన్ని

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు,

డి ఫ్ ఓ వికాస్ మీనా లతో కలిసి జిల్లా అభివృద్ధి పనుల పురోగతిపై జిల్లా అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమం అదనపు కలెక్టర్ రెవెన్యూ సి హెచ్



మహేందర్ జి, ఆర్డీవో వెంకటేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎం పి డి ఓ లు, ఎం పి ఓ లు, తదితరులు పాల్గొన్నారు.

# పట్లూర్, చలివేంద్రం కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ పెద్దలు గ్రామ సర్పంచ్ పరుశురాం



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి మే 8(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం పట్లూర్ గ్రామంలోప్రభుత్వ ఆదేశాల మేరకు పట్లూర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బి.జె.ఆర్ చౌరస్తా దగ్గర చలివేంద్రంఏర్పాటు చేయడం జరిగింది ఇట్టి చలివేంద్రంను గ్రామ సర్పంచ్ బానోత్ పరశురామ్ ప్రారంభించి మాట్లాడుతూ గ్రామ ప్రజలు, ఇతర గ్రామాల నుండి వచ్చేవారు చలివేంద్రంను సద్వినియోగం చేసుకోగలరు.

కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుమ్మల సురేష్ యాదవ్, ఉప సర్పంచ్ అఖిల్, మార్కెట్ కమిటి డైరెక్టర్ శౌకత్, మాజీ యం.పి.టి.సి. సురేష్ మరియు వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు గ్రామ పెద్దలుపాల్గొన్నారు



# పదో తరగతిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమాలు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి మే 07 2026 ములుగు**ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాలలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను శుక్రవారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా శాలువలతో సన్మానించారు.

ఈ కార్యక్రమం డి ఫ్ ఓ వికాస్ మీనా ఐ ఎఫ్ ఎస్, జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి హెచ్ మహేందర్ జి, ఆర్డీవో వెంకటేష్, డీఈవో సిద్ధార్థ రెడ్డి సంబంధిత అధికారులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# జగ్గన్నపేటలో ప్రజా దర్బార్ కార్యక్రమం పెద్ద ఎత్తున హాజరైన గ్రామస్తులు




**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి మే 0 7 2026 ములుగు** 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలి లో భాగంగా శుక్రవారం ములుగు మండలం జగన్నపేట ఆశ్రమ పాఠశాల లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమంలో

జగన్నపేట, మదనపల్లి

గ్రామాల ప్రజల నుంచి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా,శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు,

డి ఫ్ ఓ వికాస్ మీనా లతో కలిసి దరఖాస్తులను స్వీకరించారు.

జగ్గన్నపేట గ్రామస్తులు సమర్పించిన దరఖాస్తులు స్వీకరించి వారి సమస్యలు వెంటనే పరిష్కరించాలని చెప్పి జిల్లా అధికారులతో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేయవలసిన పనులు వెంటనే నెరవేర్చాలని అధికారులను మంత్రి కోరారు

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సిహెచ్ మహేందర్ జి, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, ఆర్డిఓ వెంకటేష్, జగన్నపేట, మదనపల్లి సర్పంచులు, జిల్లా అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు,తహసిల్దార్, యంపిడిఓ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# బాల్య వివాహాలు జరిపించడం చట్టరీత్యా నేరం.

## బాలల సంరక్షణ చట్టాలపై ప్రజలంతా అవగాహన కలిగి ఉండాలి.: మంత్రి ధనసరి అనసూయ సీతక్క.



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి మే 07 2026 ములుగు**శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లో జిల్లా బాలల పరిరక్షణ విభాగము ములుగు ఆధ్వర్యంలో బాలల హక్కుల పరిరక్షణ చట్టాలపై రూపొందించిన వివిధ రకాల గోడ పత్రికలు, కరపత్రాలు సంబంధించిన ఆవిష్కరణ కార్యక్రమం జిల్లా సంక్షేమ అధికారిణి ఈపి ప్రేమలత గారి అధ్యక్షతన జరుగగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా అధికార యంత్రాంగంతో కలిసి మంత్రి సీతక్క ఈ గోడపత్రికలను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ సమాజం సాంకేతికతతో ఎంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఇప్పటికీ సమాజంలో బాల్య వివాహాలు జరిపించే చర్యలు సామాజిక అభివృద్ధికి గొడ్డలి పెట్టు అని అన్నారు. వెనుకటి రోజుల్లో ఏ సౌకర్యాలు లేని రోజుల్లో ఎంతో మంది తల్లితండ్రులు తమ ఆడ పిల్లలను చదివించారని, కానీ ప్రస్తుతం ఆడపిల్లలు ఉన్నత చదువులు చదివి ఎంతో గొప్ప స్థాయికి ఎదిగేలా ప్రభుత్వాలు ఎన్నో సౌకర్యాలు కల్పిస్తున్నప్పటికీ కొంతమంది తల్లితండ్రులు మాత్రం తమ పిల్లలకు చిన్న వయస్సులోనే పెళ్ళిళ్ళు జరిపించడం చాలా బాధాకరం అని అన్నారు.

ముఖ్యంగా మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ సిబ్బంది బాల్య వివాహాలను ఆపుతున్న సందర్భంలో చాలా మంది మాకు చట్టం తెలియదు అని అంటున్నారని, కానీ చట్టం గురించి తెలుసుకొని, మనం చేసే ప్రతీ పనీ చట్టానికి లోబడే ఉండేలా జాగ్రత్త వహించాల్సిన బాధ్యత ఈ సమాజంలో ప్రతీ ఒక్కరికీ ఉందని అన్నారు తెలిపారు.

ప్రజల భాగస్వామ్యంతోనే ఏ కార్యక్రమం అయిన విజయవంత అవుతుందని, కావున అంతా కలిసి మన ములుగు జిల్లాను బాలలకు స్నేహపూర్వక జిల్లాగా తీర్చిదిద్దుదామని మంత్రి పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలన, బాలకార్మిక వ్యవస్థ నిషేధం, బాలల పై లైంగిక వేధింపుల నిరోధం, చట్ట బద్ధమైన దత్తత విధానాలు మరియు చిన్నారులకు ఆపదలో చైల్డ్ లైన్ టోల్ ఫ్రీ కి కాల్ చేసి సమాచారం అందించాలని అలాగే వివిధ బాలల పరిరక్షణ అంశాలపై రూపొందించిన ఈ గోడ పత్రికలు, కరపత్రాలు మరియు బ్రోచర్లు అర్థ వంతంగా ప్రజలకు సులువుగా అర్థమయ్యేలాగా రూపొందించారని సిబ్బందిని అభినందించారు.

ఈ ప్రచార సామాగ్రిని వినియోగించి ప్రజలకు బాలల హక్కుల పరిరక్షణ చట్టాలపై మరింత అవగాహన కలిగించాలని సిబ్బందికి కలెక్టర్ సూచించారు.

ఈ కార్యక్రమంలో డి ఎఫ్ ఓ వికాస్ మీనా ల, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జు. మహేందర్ జీ, =ఋా వెంకటేష్ , వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, జిల్లా బాలల పరిరక్షణ అధికారి జీ. ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

# బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి -వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్,



వరంగల్ ఉద్యోగంలో స్థాయి పెరిగిన కొద్దీ బాధ్యతలు కూడా పెరుగుతాయని, ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించే దిశగా అధికారులు కృషి చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, ఐపీఎస్ గారు సూచించారు.

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇటీవల ఏఎస్సై స్థాయి నుంచి సబ్ ఇన్స్పెక్టర్లుగా పదోన్నతి పొందిన 25 మంది అధికారులు శుక్రవారం పోలీస్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. అనంతరం పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా పదోన్నతి పొందిన ఎస్.ఐ భుజాలపై నక్షత్ర చిన్నహాలను అలంకరించారు.

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, పదోన్నతులు కేవలం హోదా పెరుగుదల మాత్రమే కాకుండా ప్రజల పట్ల మరింత బాధ్యతతో పనిచేసే అవకాశం అని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను సానుభూతితో వినడం, చట్టపరంగా వేగవంతమైన చర్యలు తీసుకోవడం, పోలీస్ శాఖ ప్రతిష్టను పెంచే విధంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.

ప్రజలకు అందుబాటులో ఉండే పోలీసింగ్ విధానాన్ని అవలంబిస్తూ, బాధితులకు తక్షణ సహాయం అందించాలన్నారు. కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి అధికారి కీలక పాత్ర పోషించాలని, విధుల్లో క్రమశిక్షణ, నిజాయితీ, నిబద్ధతతో పనిచేయాలని ఆయన సూచించారు.

# వైకాపా నేతలపై కేసులు పెడుతున్నారు

విశాఖపట్నం స్పీకర్ అయ్యన్నపాత్రుడు అనుచరులే దాడి చేసి తమ నాయకులపై కేసులు పెట్టడం దారుణమని మాజీ మంత్రి అమర్ నాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా స్పీకర్ సొంత నియోజకవర్గంలో అక్రమ అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. ఎల్లకాలం ఒకేలా ఉండదని, భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. చర్యకు ప్రతి చర్య ఉంటుందన్న విషయం టీడీపీ నాయకులు గుర్తించుకోవాలని సూచించారు.

# విశాఖలో ఎన్జీజీవో భవనం ప్రారంభం

విశాఖపట్నం రాష్ట్రంలో ఏపీఎన్‌జీజీఓ భవణాలను ఉద్యోగులకు ఉపయోగకరంగా ఉండేలా తీర్చిదిద్దామని రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ తెలిపారు.విశాఖలో ఏపీఎన్‌జీజీఓ నూతన భవణాన్ని ప్రారంభించిన ఆయన మీడియాతో మాట్లాడుతూ ... ఉద్యోగ ఉపాధ్యాయులు సమస్యల పరిష్కరించేలా కృషి చేస్తామని,పదవీ విరమణ బకాయిలను కూడా పెండింగ్ లో ఉన్నాయని,కూటమి ప్రభుత్వ హయాంలో ఉద్యోగులకు న్యాయం చేసేలా ఒత్తిడి తెస్తామని అన్నారు.పెండింగ్ లో ఉన్న సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

# కేకే లైన్ ను రాయగడ డివిజన్ లో కలపొద్దు

విశాఖపట్నం దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేయడాన్ని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం. జగ్గునాయుడు స్వాగతించారు. అయితే, కొత్తవలస-కిరండూల్ కేకే లైన్, అరకు, బొర్రా గుహల ప్రాంతాలను విశాఖ డివిజన్ నుండి విడదీసి రాయగడ డివిజన్‌లో కలపడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు.మద్దిలపాలెంలోని ఏచూరి భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేకే లైన్‌ను తరలించడం విశాఖ ప్రజలకు అన్యాయం చేయడమేనని, ఆ ప్రాంతాలను విశాఖ డివిజన్‌లోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు.

## అక్రమ గోవుల రవాణాన్ని అడ్డుకున్న కరాటే కళ్యాణి

అనకాపల్లి అనకాపల్లి జిల్లా నక్కపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా గోవులను తరలిస్తున్న మూడు బొలెరో వాహనాలను సినీ నటి కరాటే కల్యాణి అడ్డుకున్నారు. జాతీయ రహదారిపై గోవులను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో ఆమె తన బృందంతో కలిసి వాహనాలను నిలిపివేసి పోలీసులకు సమాచారం అందించారు. ఈ వాహనాల్లో నిబంధనలకు విరుద్ధంగా, అత్యంత కిక్కిరిసిన రీతిలో గోవులను తరలిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వాహనాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. గోరక్షణలో భాగంగా తాము ఈ చర్య తీసుకున్నామని ఆమె పేర్కొనగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అందోల్ -జోగిపేట మునిసిపాలిటీలో కోఆప్షన్ ఎన్నికల్లో ఆ నలుగురు



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి మే 08 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా** అందోల్ -జోగిపేట మున్సిపాలిటీ కో ఆప్షన్ మెంబర్ల నలుగురు ఎన్నికయ్యారు . 6వ వార్డు చెందిన మైనార్టీ ముంతాజ్ బేగం, యాధులు(కొడుకు అక్బర్) పిట్ల భాగ్యలక్ష్మి, మహమ్మద్ జీషాన్, మ్యాథరి ప్రవీణ్ కుమార్, మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశంతో ఎన్నికయ్యారు, మాపై నమ్మకం ఉంచిన మంత్రి దామోదర్ రాజనర్సింహ గారికి ప్రత్యేకమైన ధన్యవాదాలు అని, కో ఆప్షన్ మెంబర్లు తెలియజేశారు. అంతేకాకుండా ఎన్నికైన తర్వాత మున్సిపల్ కార్యాలయంలో, మున్సిపల్ చైర్మన్ ఎస్ కిష్టారెడ్డి ,వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ ( చిట్టిబాబు), కౌన్సిలర్ల సమక్షంలో మున్సిపల్ కమిషనర్, ఆ నలుగురికి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలోమాజీ కౌన్సిలర్స్ , సీనియర్ మైనార్టీ నాయకులు షేక్ అజరుద్దీన,మమ్మద్ అసిఫ్ చోటు, రెహ్మాన్ అలీ, శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు, ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు

# మల్లారెడ్డి విశ్వవిద్యాపీఠ్ లో ఏఐ ఆధారిత కోర్సులు

కుత్బుల్లాపూర్ విద్యార్థుల భవిష్యత్తు కోసం ౦ఎ ఆధారిత కోర్సులను ప్రవేశపెట్టేందుకు మల్లారెడ్డి విశ్వ విద్యాపీఠ్ కృషి చేస్తోందని అన్నారు మల్లారెడ్డి విశ్వ విద్యాపీఠ్ చైర్మెన్ డా భద్రారెడ్డి. ఈ సందర్భంగా సూరారం,మల్లారెడ్డి విశ్వ విద్యాపీఠ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ సౌత్ ఇండియాలోనే మొట్టమొదటి సారిగా ౦ఎ టెక్నాలజీ తో కూడిన విద్యను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. వైస్ ఛాన్సలర్ ప్రీతి రెడ్డి మాట్లాడుతూ?ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(౦ఎ) లో అగ్రగామి సంస్థ అయిన ఇఖీూూ ౦ఎ ఎఎఆజం తో కలసి ప్రత్యేక కోర్సులను రూపొందించాని,ఈ ప్రోగ్రామ్ ద్వారా విద్యార్థులు థియరీ మాత్రమే కాకుండా ౦ఎ టూల్స్ ను ఎలా వాడాలి,గ్లోబల్ మార్కెట్ లో ఎలాంటి కంటెంటు రూపొందించాలి అనే విషయాలపై పూర్తి స్థాయిలో శిక్షణ పొందుతారని తెలిపారు. ఇంటర్ పూర్తి చేసిన ప్రతి ఒక్కరు ఈ కోర్సుకు అర్హులని,౦ఎ పై ఆసక్తి గల వారు ఈ కోర్సుల ద్వారా మంచి అవకాశాలను పొందవచ్చు అని తెలిపారు.

# జూన్ 1 నుంచి విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు

విశాఖపట్నం విశాఖ కేంద్రంగా జూన్ 1 నుంచి దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభం కానున్నట్లు ఎంపీ భరత్ వెల్లడించారు. ఇచ్చిన హామీ మేరకు వాల్తేరు డివిజన్‌ను కాపాడుకున్నామన్నారు. జోన్ వల్ల విశాఖ నుంచి మరికొన్ని కొత్త రైళ్లు అడగవచ్చని, విశాఖ నుంచి బెంగళూరుకు రోజూ సర్వీసులు నడిపే ఆలోచన చేస్తున్నామన్నారు. అలాగే విశాఖ నుంచి తిరుపతికి వందేభారత్ అడుగుతామని తెలిపారు.

వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తెలుగుదేశం పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలో రైల్వేజోన్ విషయంలో ఎందుకు సీరియస్‌గా తీసుకోలేదని ప్రశ్నించారు.జగన్ అండ్ కోకు పరిపాలన అంటే ఏమీ తెలియదని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు ఏమి చేయకపోయినా.. ప్రతిపక్షంలోకి వచ్చినప్పుడు మాత్రం అన్ని చేయాలని అంటారని ఎద్దేవా చేశారు. జూన్ ఒకటి నుంచి రైల్వేజోన్ కార్యకలాపాలు ప్రారంభమవుతాయని తెలిపారు. గెజిట్ రావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. రైల్వేజోన్ రావడమే కాదని.. విశాఖ డివిజన్ కూడా వచ్చిందని ప్రస్తావించారు. అభివృద్ధి అంటే ఏమిటో తెలియని పార్టీ వైసీపీ అని విమర్శించారు. జగన్ అండ్ కో క్రెడిట్ చోరీకి పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రతిదీ తామే తెచ్చామని గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని సెటైర్లు గుప్పించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీకి లక్ష కోట్ల ప్రాజెక్టులు వచ్చాయని ఎంపీ శ్రీభరత్ పేర్కొన్నారు.

# ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో స్పోర్ట్స్ ఇంజరీస్ కోసం అత్యాధునిక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించిన అపోలో హాస్పిటల్స్

క్రీడా గాయాలు, ఆర్థోపెడిక్ సమస్యలకు అత్యాధునిక వైద్యం అందించేందుకు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని అపోలో హాస్పిటల్లో "అపోలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ స్పోర్ట్స్ ఇంజరీస్ అండ్ ఆర్థోపెడిక్స్"ను ప్రారంభించారు. క్రీడాకారులు, ఫిట్‌నెస్ అభిరుచి కలిగిన వారికి ఒకేచోట నిర్ధారణ, శస్త్రచికిత్స, పునరావాస సేవలు అందించేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

ప్రారంభ కార్యక్రమంలో కేఈఐ గ్రూప్ వ్యవస్థాపకుడు శ్రీ అనిల్ కామినేని, తెలంగాణ ప్రభుత్వ క్రీడాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ జయేష్ రన్ జన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సన్ రైజర్స్ హైదరాబాద్ ఆటగాళ్లు కేంద్రాన్ని సందర్శించారు. ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్ తో పాటు ప్రఫుల్ హింగే, సాకిబ్ హుస్సేన్‌కు వైద్యసదుపాయాలను వివరించారు. ఆధునిక చికిత్స, పునరావాస సౌకర్యాలు క్రీడాకారుల కోలికకు ఎంతో ఉపయోగపడతాయని వారు అభిప్రాయపడ్డారు.ఆర్థోపెడిక్స్ విభాగాధిపతి డాక్టర్ దీప్తి నందన్ రెడ్డి మాట్లాడుతూ.. క్రీడా గాయాలకు సమయానికి ఖచ్చితమైన నిర్ధారణ, చికిత్స అవసరమని తెలిపారు. లిగమెంట్ గాయాల నుంచి క్లిష్టమైన కీళ్ల సమస్యల వరకు ఆధునిక శస్త్రచికిత్సలు, శాస్త్రీయ పునరావాస విధానాలతో చికిత్స అందిస్తామని చెప్పారు.అపోలో ఆస్పత్రుల తెలుగు రాష్ట్రాల సీఈఓ తేజస్వి రావు వీరేపల్లి మాట్లాడుతూ.. ప్రపంచస్థాయి స్పోర్ట్స్ మెడిసిన్ సేవలను అందించడంలో ఈ కేంద్రం కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. క్రీడలు, ఫిట్‌నెస్‌పై ఆసక్తి పెరుగుతున్న నేపథ్యంలో ప్రత్యేక వైద్యసేవల అవసరం కూడా పెరుగుతోందన్నారు.

ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ అపోలో ఆస్పత్రుల చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ హర్కరణ్ సింగ్ మాట్లాడుతూ.. బహుళ విభాగాల నిపుణులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి రోగులకు వేగవంతమైన, మెరుగైన ఫలితాలు అందించడమే లక్ష్యమన్నారు. కేంద్రంలో డాక్టర్ రవితేజ రుద్రరాజు, డాక్టర్ రమిందర్ కౌర్ తదితర నిపుణులు సేవలందించనున్నారని తెలిపారు.

పాట్ కమిన్స్ మాట్లాడుతూ.. ఇక్కడికి రావడం చాలా ఆనందంగా వుంది. అపోలో హాస్పిటల్స్ ప్రారంభించిన ఈ సెంటర్ క్రీడాకారులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇంత గొప్పగా అత్యాధునిక ట్రీట్మెంట్, రిహాబిలిటేషన్ అందిస్తున్న అపోలో హాస్పిటల్స్ కు అభినందనలు.

Apollo HOSPITALS

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com